www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

వినూత్నంగా పరీక్షాపే చర్చ

- ప్రధానితో పాటు పలువురు విశిష్ట అతిథులు దీపికా పదుకోన్, మేరీ కోమ్, సద్గురు హాజరు
- ఈనెల 10న కార్యక్రమం.. డీడీలో ప్రసారం

2

శుక్రవారం | 7-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 293 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: దశమి రా. 9.26 తదుపరి ఏకాదశి; నక్షత్రం: రోహిణి రా. 6.40 తదుపరి మృగశిర; వర్జ్యం: ఉ. 10.56-12.29, రా. 12.08-1.42; దుర్ముహూర్తం: ఉ. 9.05-9.50, మ. 12.52-1.37; అమృతఘడియలు: మ. 3.34-5.07; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.48, సూర్యాస్తమయం: 6.09 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రూ. 10 వేల కోట్లు ఏజెంట్ల పాలు!



స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత కుటుంబీకులతో పంజాబీలు

- అడ్డదారుల్లో అమెరికాకు 18 వేల మంది
- ఒక్కొక్కరి నుంచి సగటున రూ.50 లక్షల వరకు వసూలు చేసిన ఏజెంట్లు
- ఐరోపా మీదుగా మెక్సికోకు.. అడవుల్లో రోజుల తరబడి నడక.. ఆ మార్గంలో అస్థిపంజరాలు
- రూ.లక్షలు ఖర్చు పెట్టి వెళ్లి సంకెళ్లతో వచ్చాం
- తిరిగి వచ్చిన భారతీయుల కన్నీటి గాథలు
- అక్రమ ఏజెంట్లపై కొరడాకు 'పంజాబ్' సిద్ధం

(సెంట్రల్ డెస్క్)

"అమెరికాలో ఫామ్‌హౌస్‌లలో కొలువులు..!".. "ఏటా లక్షలు ఆర్జించొచ్చు..! రెండుమూడేళ్లలో పేదరికం నుంచి బయటపడొచ్చు..!".. అంటూ ఏజెంట్లు చేసిన ప్రకటనలు నమ్మిన యువకులు ఆస్తులమ్ముకుని, అప్పులు చేసి రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా వారి చేతుల్లో పెట్టారు. ఏజెంట్ల డంకీ మార్గాల్లో(అడ్డదారుల్లో) అమెరికాకు వెళ్లి.. చిక్కుల్లో పడ్డారు. అమెరికా సైనికులకు పట్టుబడి, రోజుల తరబడి చీకటి

మిగతా 2వ పేజీలో...

అక్రమ వలసదారుల తరలింపు
కొత్తదేమీ కాదు!

- గత 16 ఏళ్లలో 15,756 మందిని పంపారు: జైశంకర్ 2
- మోదీ, ట్రంప్ మిత్రులే కదా.. మన వాళ్లకు సంకెళ్లు ఏల?: ప్రియాంక

వలసదార్ల భద్రతకు కొత్త చట్టం!

పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వం



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్, మంత్రులు

నాలుగు నెలలు 3 హామీలు

అమలుకు కార్యాచరణ.. కేబినెట్ కీలక నిర్ణయం

- విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం
- జూలైకి డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి
- మేలో రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ
- విద్యుత్తు చార్జీలు తగ్గించడంపై దృష్టి
- రెవెన్యూ సమస్యలపై ఆర్డీవోకే అప్పీల్ అధికారం
- నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు 900 కోట్లకు మోక్షం
- హాస్టళ్లు, మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యం
- జీఎస్‌డీపీ పెంపునకు నియోజకవర్గానికో బృందం
- అధికారుల శిక్షణకు అత్యాధునిక కేంద్రం ఏర్పాటు

> విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం పథకం అమలు చేయాలి. ఎంతమంది పిల్లలున్నా ఇస్తాం. మేలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేస్తాం. అధికారులు ఈ దిశగా చర్యలు వేగవంతం చేయాలి.
> ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి. పాఠశాలలు ప్రారంభం కావడానికి ముందే నియామక ప్రక్రియను పూర్తి చేయాలి.
>
> - కేబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, వీలైనంత త్వరగా అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని రాష్ట్ర కేబినెట్ భేటీలో నిర్ణయించారు. జూలై నాటికి తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయడంతో పాటు డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేసే దిశగా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు

మిగతా 13వ పేజీలో...

రూ.6,78,345 కోట్ల పెట్టుబడులు!

ఒప్పందాలు జరిగిన 34 ప్రాజెక్టుల ప్రతిపాదనలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం

బడుగు, మహిళా పారిశ్రామికవేత్తలు, దివ్యాంగులకు 45% పెట్టుబడి రాయితీ

బీసీలకు మళ్లీ అగ్ర తాంబూలం!

- నామినేటెడ్ పదవుల్లో 34% కోటా
- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం

మంత్రులకు ర్యాంకులు

- ఫైళ్ల పరిష్కారంలో ఫరూక్ టాప్
- సీఎంకు ఆరో స్థానం.. 8లో లోకేశ్
- పదిలో పవన్.. చివర్న వాసంశెట్టి

ఎక్సైజ్ లెక్క తప్పింది



- మార్జిన్ విషయంలో తొందరపాటు
- ఇష్యూ ప్రైస్ అంచనాలో మెలిక 13
- లైసెన్సీల ఆందోళనతో దిద్దుబాటు చర్యలు
- 14 శాతం మార్జిన్‌కు కేబినెట్ ఆమోదం

సాగుకు 9 గంటలు ఉచిత విద్యుత్!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

12

- అమలుకు కట్టుబడి ఉన్నాం.. సీజీఎంపై చార్జిషీట్, బదిలీ వేటు వేశాం
- ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారుల ఆమోదం లేకుండా వేళలు మార్చినందుకే
- సీఎండీ సంతోషరావు వెల్లడి.. 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

క్యారెక్టర్, క్రెడిబిలిటీ ఉండాలి



- ప్రలోభాలకో.. భయపడో కాంప్రమైజ్ అయితే మన గౌరవం ఏంది? 14
- సాయిరెడ్డికైనా.. ఎవరికైనా ఇదే వర్తిస్తుంది.. జగన్ వ్యాఖ్యలు

సమాజం కోసం మనం సైతం!





- తలసీమియా పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్
- రెండు రాష్ట్రాల్లో సెంటర్లు ఏర్పాటు చేస్తాం 14
- నిధుల సేకరణకు 15న మ్యూజికల్ షో
- తన టీమ్‌తో ఉచితంగా నిర్వహిస్తున్న తమన్
- ప్రతి రూపాయీ బాధిత పిల్లల కోసమే
- సీఎం పీఏలైనా టికెట్ కొనాల్సిందే: భువనేశ్వరి

స్టీరింగ్ ఒకరికి.. సిగ్నల్ మరొకరికి!

3



ద్వారకా తిరుమలరావు, కాంతిలాల్

- ఆర్టీసీ వైస్‌చైర్మన్, ఎండీగా ద్వారకా తిరుమలరావు
- పీటీడీ కమిషనర్‌గా కాంతిలాల్‌కు పూర్తి బాధ్యతలు
- ఆపరేషన్స్, అడ్మినిస్ట్రేషన్ విధులు వేర్వేరుగా ఇద్దరికి..
- గందరగోళ పరిస్థితిపై అధికారులు, సిబ్బందిలో చర్చ

'బనకచర్ల' మా అంతర్గతం!

- తెలంగాణ, కృష్ణా బోర్డు జోక్యానికి వీల్లేదు: ఆంధ్ర
- జల వనరుల శాఖ ప్రత్యేక సీఎస్‌తో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి భేటీ
- రాష్ట్ర పరిధిలో వాటర్ గేజ్‌లు ఏర్పాటు చేయం 12
- సాగర్ ఎడమ కాలువ వద్ద రాష్ట్ర ఎస్పీఎఫ్
- సాయిప్రసాద్ స్పష్టీకరణ
- బెజవాడలోనే బోర్డు కార్యాలయం: రాయ్‌పురే



మధ్యాహ్న భోజనంలో తృణధాన్యాలు!

- మంత్రుల కమిటీ సమావేశంలో నిర్ణయం 12
- మార్కెట్‌లో ధరలపై సమీక్ష
- కందిపప్పు, నూనె, మిర్చి ధరలు తగ్గాయని వెల్లడి



14

నేడు పోలీసు విచారణకు ఆర్జీవీ

ఒంగోలులో పటిష్ఠంగా భద్రతా ఏర్పాట్లు

ఆ 20 వేల మంది ఎక్కడ?!

- కెనడా వెళ్లి.. అక్కడ కాలేజీల్లో చేరని వేలాది మంది భారతీయ విద్యార్థులు
- జాబితాలో ఏపీ, తెలంగాణ విద్యార్థులూ..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఉన్నత విద్య కోసమని కెనడా వెళ్లిన దాదాపు 20 వేల మంది భారతీయ విద్యార్థులు అక్కడ కళాశాలల్లో చేరలేదని ఇటీవల ఓ నివేదిక వెల్లడించింది. వారంతా ఎక్కడున్నారనే దానిపై ప్రభుత్వం వద్ద కూడా సమాచారం లేదు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. ఆ విద్యార్థుల్లో చాలా మంది వరకు కెనడా నివాసంలో ఉండేందుకు, డబ్బు సంపాదించుకునేందుకు పలు రకాల పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ ఉద్యోగాలు చేసుకుంటున్నారని టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం పేర్కొంది. కొంత మంది విద్యార్థులు నకిలీ కళాశాలల చేతుల్లో మోసపోగా.. మరికొంత మంది ఉద్దేశపూర్వకంగానే కెనడాలో ఉ ద్యోగాలు చేసుకొనేందుకు స్టూడెంట్ వీసాను దుర్వినియో గం చేసినట్లు తెలిసింది. అమెరికా, ఆస్ట్రేలియా మాదిరిగా కెనడా విధానంలో అంతర్జాతీయ విద్యార్థులు ముందుగా ట్యూషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. దీన్ని చాలా మంది విద్యార్థులు ఆసరాగా



చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు గుజరాత్, పంజాబ్, హరియాణా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి చాలా మంది విద్యార్థులు ఈ విధంగానే కెనడా వెళ్లారు. కాలేజీల్లో అడ్మిషన్లు పొం దిన విద్యార్థులు తరగతులకు మాత్రం హాజరు కావడం లేదు. దీనికి బదులుగా డబ్బులు సంపాదించుకొనేందుకు మొబైల్ షాపుల్లో, గ్యాస్ స్టేషన్లలో, డెలివరీ ఏజెంట్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. కొంతమంది విద్యార్థులకు వాస్తవంగా చదువుకోవాలనే ఉద్దేశం ఉన్నప్పటికీ, మంచి యూనివర్సిటీల్లో అడ్మిషన్లు దొరకక.. చిన్న కాలేజీల అఫర్లను అంగీకరిస్తున్నారు. చివరకు అక్కడకు చేరుకున్న తర్వాత ఆ కాలేజీలు నకిలీవని తేలడమో లేదా తగిన సదుపాయాలు లేకపోవడం వంటివి చోటుచేసుకున్నాయి. తెలంగాణలోని ఖమ్మంకు చెందిన ఓ 26 ఏళ్ల విద్యార్థి సర్రేలోని ఓ కాలేజీలో అడ్మిషన్ తీసుకున్నాడు. అయితే అతను తరగతులకు హాజరు కాకుండా ఒక మొబైల్ షాపులో ఫుల్ టైమ్ ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ అతనికి ఒక గంటకు ఏడు డాలర్ల వరకు ఇస్తారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన 25 ఏళ్ల మరో విద్యార్థి టోరంటోలో డెలివరీ ఏజెంట్‌గా చేస్తున్నారు. కెనడాలో కనిపించకుండా పోయారన్న చాలా మంది విద్యార్థులు సరిహద్దు దాటలేదని, కెనడాలోనే పని చేసుకుంటూ.. శాశ్వత నివాసం కోరుతున్నారని వలస నిపుణులు హెన్రీ లోటిన్ పేర్కొన్నారు.



అక్రమ వలసదారుల పట్ల అమెరికా వ్యవహరించిన తీరుపై పార్లమెంట్ హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న రాహుల్, ఖర్గే, ప్రియాంక, అఖిలేశ్ తదితరులు

అక్రమ వలసదారుల తరలింపు కొత్తేమీ కాదు

- వలసదారుల పట్ల దురుసుగా ప్రవర్తించకుండా అమెరికాతో సంప్రదింపులు జరుపుతాం: జైశంకర్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: అక్రమ వలసదారులను వెనక్కి పంపే ప్రక్రియ కొత్తదేమీ కాదని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. అయితే అక్రమ వలసదారుల పట్ల అనుచితంగా వ్యవహరించకుండా చూసేందుకు అమెరికాతో భారత ప్ర భుత్వం సంప్రదింపులు జరుపుతోందని గురువారం రాజ్యసభలో వెల్లడించారు. టెక్సాస్ నుంచి 104 మంది అక్రమ వలసదారులను పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అక్ర మ వలసదారుల పట్ల అమెరికా దారుణంగా వ్యవహరించిందని, వారికి సంకెళ్లు వేసి అవమానించిందంటూ విపక్ష సభ్యులు నిరసనకు దిగారు. దీనిపై కేంద్రం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి జైశంకర్ స్పందించారు. ఏ దేశమైనా అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపడంపై దృష్టి పెట్టాలని, అలాగే చట్టబద్ధంగా వచ్చే వారికి వీసాలు సులభతరం చేయడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇక అమెరికా నుంచి అక్రమ వలసదారులను తరలించే ప్రక్రియ 2009 నుంచి కొనసాగుతోందన్నారు. చాలామంది వలసదారులకు అమెరికాలో ఆస్తులు ఉన్నాయన్న అంశంపై స్పందిస్తూ.. ఈ సమస్యను పరిష్కరించేందుకు అమెరికా అధికారులతో సంప్రదింపులు జరుపుతామని జైశంకర్ చెప్పారు. కాగా, భారతీయుల పట్ల అమెరికా వ్యవహరించిన తీరును నిరసిస్తూ విపక్షాలు.. గురువారం లోక్‌సభ, రాజ్యసభల్లో ఆందోళనకు దిగాయి. విపక్ష సభ్యులు పదేపదే వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేయడంతో లోక్‌సభ నాలుగుసార్లు వాయిదా పడింది. కాగా ,మోదీ, ట్రంప్ మంచి మిత్రులు అయినప్పటికీ భారతీయులకు ఇలా జరగడమేంటని ఎంపీ ప్రియాంక ప్రశ్నించారు. వలసదారులను రప్పించడానికి మోదీ ఎందుకు విమానాన్ని పంపలేదని నిలదీశారు. జైశంకర్ ప్రకటన అనంతరం విపక్ష ఎంపీలు పార్లమెంటు ఆవరణలో నిరసన ప్రదర్శన చేపట్టారు.

రాజధాని టెండర్లు పిలుచుకోవచ్చు!

- కానీ కోడ్ ముగిసే వరకు ఖరారు చేయవద్దు: ఈసీ

విజయవాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పనులకు టెండర్లు పిలవటానికి అడ్డంకులు తొలిగాయి. టెండర్లు పిలుచుకోవచ్చని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మాత్రమే వాటిని ఖరారు చేయాల్సిందిగా ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. దీంతో టెండర్లు పిలవాలన్న సీఆర్‌డీఏకు పెద్దఊరట లభించింది. అమరావతి రాజధాని ప్రాంత పనులకు సంబంధించి కొంతమంది సైంధవులు పనులను అడ్డుకునేందుకు ప్రపంచబ్యాంకుకు ఫిర్యాదులు మీద ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ ఫిర్యాదులన్నీ వైసీపీయే తమ నాయకులు, కార్యకర్తల చేత చేయిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో.. మళ్లీ సైంధవులు ఫిర్యాదు చేసి అడ్డుకునే ప్రయత్నం చేస్తారన్న ఉద్దేశంతో వాస్తవ పరిస్థితిని తెలియచేస్తూ సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ఎన్నికల సంఘానికి కొద్ది రోజుల కిందట లేఖ రాశారు. అమరావతి రాజధాని నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ. 48,012.67 కోట్ల విలువతో చేపట్టేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇవ్వటం జరిగిందని, అందులో రూ. 14,874.53 కోట్ల విలువైన పనులకు టెండర్లను ఆహ్వానించినట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాజధాని ప్రాజెక్టు పనులను నిలుపుదల చేయటం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఉందని ఆయన ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువచ్చారు. గత కొన్ని సంవత్సరాలుగా పనుల విషయంలో సుదీర్ఘ జాప్యం జరగటం వల్ల ఖర్చు పెరిగిపోయిందని.. ఆర్థిక చిక్కులకు దారి తీసిందని ఆ లేఖలో కమిషనర్ పేర్కొన్నారు. రాజధాని నిర్మాణ పనులను ముందుకు తీసుకు వెళ్లేందుకు ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూల నుంచి రూ. 31 వేల కోట్ల రుణాలను తీసుకోవటం జరిగిందని తెలిపారు. చాలా కాలంగా నిలిచిపోయిన పనులను వేగంగా ముందుకు తీసుకువెళ్లటానికి వీలుగా టెండర్లు పిలవటం జరిగిందని, ఇంకా పిలవాల్సి ఉందని తెలిపారు. రాజధాని ప్రాజెక్టులనేవి రాష్ట్రం మొత్తం అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, ఉపాధి, మౌలిక సదుపాయాలకు సంబంధించినవని తెలిపారు. ఈ తరుణంలో ఏదైనా అంతరాయం తలెత్తితే రాష్ట్ర పురోగతిపై ప్రభావం చూపుతుందని చెప్పారు. రాష్ట్ర సీఈఓ ఈ లేఖను పరిశీలించి కేంద్ర ఎన్నికల సంఘానికి పంపారు. దీనిపై ఈసీ స్పష్టతిచ్చింది.

మూగజీవాలకు రేడియం బెల్ట్‌తో ప్రమాదాల నివారణ

- న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి బబిత

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ్లలో మూగజీవాలు అకస్మాత్తుగా రోడ్ల మీదకు రావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాల నివారణకు ఆవులు, గేదెలకు రేడియం బెల్ట్‌లు ధరింపజేయాలని ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి ఎం.బబిత తెలిపారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ సూచన మేరకు ఆవులు, గేదెలకు రేడియం బెల్ట్‌లు ధరింపజేసే కార్యక్రమాన్ని రాజధాని పరిధిలోని వెంకటపాలెంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ ఉపకార్యదర్శి అమర రంగేశ్వరరావు, తుళ్లూరు డీఎస్పీ మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గేదె మెడలో రేడియం బెల్ట్ కడుతున్న న్యాయసేవాధికార సభ్యకార్యదర్శి బబిత

ఇజ్రాయెలే మాకు అప్పగిస్తుంది

- గాజా స్వాధీనంలో మా సైన్యం ప్రమేయం ఉండదు: ట్రంప్

వాషింగ్టన్, ఫిబ్రవరి 6: యుద్ధం ముగిసిన అనంతరం గాజా స్ట్రిప్‌ను ఇజ్రాయెల్ తమకు స్వాధీనం చేస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. దీంట్లో అమెరికా దళాల ప్రమేయం ఏమీ ఉండదని ఆయన తేల్చిచెప్పారు. గాజా పునర్నిర్మాణం జరిగే వరకూ సుమారు 2 లక్షల మంది పాలస్తీనీయులను శరణార్థులుగా స్వీకరించాలంటూ ఇటీవల ఈజిప్ట్, జోర్డాన్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, అరబ్‌లీగ్, పాలస్తీనా అథారిటీని ట్రంప్ కోరగా.. ఆయా దేశాలు తిరస్కరించిన సంగతి తెలిసిందే. దీంతో గాజాను అమెరికా స్వాధీనం చేసుకుంటుందని మంగళవారం ఆయన ప్రకటించారు. ఆ ప్రకటనపైనా అరబ్ దేశాలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో.. తమ సైన్యం ప్రమేయం ఉండదంటూ గురువారం ఆయన స్పష్టత ఇచ్చారు.

రూ.10 వేల కోట్లు ఏజెంట్ల పాలు!

(మొదటి పేజీ తరువాయి)

గదుల్లో మగ్గి.. కాళ్లు, చేతులకు సంకెళ్లతో డీపోర్ట్‌కు గురయ్యారు. ఇలా 18 వేల మంది వరకు భారతీయులను వెనక్కి తిప్పిపంపేందుకు అమెరికా సిద్ధమవ్వగా.. వీరి ద్వారా ఏజెంట్లు రూ.10 వేల కోట్లకు పైగా జేబులు నింపుకొన్నట్లు అంచనా..! ఒక్క పంజాబ్‌లోనే.. 8 వేల మంది యువకులు రూ.4 వేల కోట్లను పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే..! అమెరికాలోకి చొరబడి, గుట్టుచప్పుడు కాకుండా పనిచేస్తున్న వారు.. మెక్సికో సరిహద్దుల్లోనే చనిపోయిన వారి సంఖ్యకు అంచనాల్లేవు..!

ఇలా తరలిస్తారు..

అమెరికా తిప్పిపంపిన 104 మంది భారతీయుల్లో ఒకరైన హర్విందర్‌సింగ్.. ఏజెంట్ల నేరశైలిని మీడియాకు వివరించారు. హర్విందర్ స్వస్థలం పంజాబ్‌లోని తహ్లీ గ్రామం. కడుపేద కుటుంబం కావడంతో.. అమెరికా వెళ్లి, బాగా సంపాదించాలని హర్విందర్ అనుకున్నారు. పొరుగింటి కుర్రాడు ఐదేళ్ల క్రితం 10 పాసవ్వగానే.. ఏజెంట్ల ద్వారా అమెరికాకు వెళ్లి.. అక్కడ వ్యవసాయ క్షేత్రాల్లో పనికి కుదిరాడు. మూడేళ్లలో ఆ కుటుంబాన్ని పేదరికం నుంచి బయటపడేసేలా సంపాదించాడు. దాంతో.. హర్విందర్ కూడా 8 నెలల క్రితం ఆస్తులమ్మి, అప్పులు చేసి, అమెరికా వెళ్లేందుకు రూ.42 లక్షలను ఏజెంట్ చేతుల్లో పెట్టారు. గత నెల 15న అమెరికాలోకి అడుగుపెట్టారు. ఆ వెంటనే అమెరికా సైనికులు అరెస్టు చేశారు. బుధవారం అమృత్‌సర్ తిరిగి వచ్చిన హర్విందర్.. ఏజెంట్ల మోసాలను గురించి మీడియాకు వివరించారు. "ఏజెంట్లు ఇటలీ, ఇతర చిన్న దేశాల్లో వర్క్ పర్మిట్లు ఇప్పించి, దుబాయ్ మీదుగా అక్కడికి తీసుకెళ్తారు. ఆ తర్వాత ఐరోపాకు.. అక్కడి నుంచి మెక్సికోకు తరలిస్తారు. మెక్సికో నుంచి డంకీ మార్గాల్లో అమెరికా సరిహద్దులను దాటిస్తారు. ఈ మార్గాలు భయంకరంగా ఉంటాయి. రోజుకు ఒక రొట్టె ముక్క, రెండు బిస్కట్లతోనే సరిపెట్టుకోవాలి. మధ్యలో అనారోగ్యానికి గురైతే.. అంతేసంగతులు. అడవుల్లో రోజుల తరబడి ఉన్నాం. ఆ మార్గంలో ఎన్నో శవాలు కనిపించాయి. మెక్సికో-అమెరికా సరిహద్దుల్లోని 45 కిలోమీటర్ల కొండ మార్గాల్లోనూ అస్థిపంజరాలు కనిపించాయి" అని చెప్పుకొచ్చారు. తాను గత నెల 15న అమెరికాలో అడుగుపెట్టానని, ఆ తర్వాత మిలటరీ అరెస్టు చేసిందని చెప్పారు. చీకటి గదుల్లో మగ్గిపోయామని, అక్కడి జైళ్లలో అంతా అక్రమంగా అమెరికాలోకి చొరబడ్డ వారేనని పేర్కొన్నారు. జైళ్లలో కాళ్లు, చేతులను సంకెళ్లతో కట్టేస్తారని, అమృత్‌సర్ విమానాశ్రయానికి వచ్చేవరకు కూడా తనకు సంకెళ్లు ఉన్నాయని చెప్పారు.



డేరియన్ గ్యాప్ అడవుల్లో..

ఏజెంట్లు దుబాయ్ లేదా ఇటలీ వంటి దేశాలకు వర్క్ పర్మిట్లు తీసుకున్నాక.. అక్కడి నుంచి టూరిస్ట్ వీసా తేలిగ్గా వచ్చే పనామా, కోస్టారికా, ఎల్-సాల్వడార్, గ్వాటెమాల వంటి దేశాలకు తీసుకెళ్తారు. కొలంబియా-పనామా మధ్య ఉన్న దట్టమైన అటవీ ప్రాంతం (సుమారు 100 కిలోమీటర్లు) మీదుగా ఉండే డేరియన్ గ్యాప్ నుంచి మెక్సికోకు తరలిస్తారు. డేరియన్ గ్యాప్ సాంతం చిత్తడి నేలలతో నిండి ఉండే దట్టమైన అడవి. క్రూరమృగాలు, విష సర్పాలకు నిలయం. ఈ 100 కిలోమీటర్లను కాలినడకన పూర్తిచేయడం ఓ సాహసమే. ఇందుకు 15 రోజుల సమయం పడుతుంది. ఈ అడవిని దాటాక.. మెక్సికోకు తరలిస్తారు. అక్కడి నుంచి అడవులు, గుట్టల మీదుగా 45 కిలోమీటర్ల కాలినడక తర్వాత.. అమెరికా సరిహద్దులకు చేరుకుంటారు. డేరియన్ గ్యాప్, మెక్సికో-అమెరికా సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లో డ్రగ్స్ ముఠాలు, దోపిడీ ముఠాలు అక్కడికి వచ్చినవారిని వచ్చినట్లు దోచుకునేందుకు కాచుక్కూర్చుంటాయి. ఈ ముఠాలకు ఎదురు తిరిగితే.. చంపేందుకూ వెనకాడవు. ఇంతటి ప్రతికూల వాతావరణం ఉన్నా.. ఏటా సుమారు 5 లక్షల మంది అక్రమంగా అమెరికాలోకి చొరబడుతుంటారు. ఇలా వెళ్లే వారిలో భారత్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, హైతీ, ఈక్వెడార్, వెనెజువెలా దేశాలకు చెందిన యువకులే ఎక్కువగా ఉంటారు. ఇప్పటి వరకు 18 వేల మంది భారతీయులు అక్రమంగా తమదేశంలోకి చొరబడ్డట్లు అమెరికా ప్రకటించగా.. వారిలో 8 వేల మందికి పైగా పంజాబీలు ఉండడం గమనార్హం..!

కాళ్లు చేతులకు సంకెళ్లు

భారత్‌కు తిప్పి పంపిన యువకులకు సంకెళ్లు వేశారంటూ.. కాదుకాదు.. అదంతా ఫేక్ అని విపక్షాలు, అధికార ఎన్డీయే మధ్య మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో.. అమృత్‌సర్ తిరిగి వచ్చిన బాధితులు అసలు విషయం వెల్లడించారు. అమెరికాలో సైనిక విమానంలోకి ఎక్కించింది మొదలు.. తమ కాళ్లు, చేతులను గొలుసులతో బంధించారని పేర్కొన్నారు. అమెరికా కస్టమ్స్-బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం చీఫ్ మైఖేల్.డబ్ల్యూ.బ్యాంక్స్ కూడా అమృత్‌సర్‌కు బయలుదేరిన విమానంలో సంకెళ్లు వేసిన అక్రమ వలసదారులంటూ.. ఎక్స్‌లో ఫొటోలను షేర్ చేశారు.


ఆస్తులు, డబ్బు అంతా పోగొట్టుకున్నాం



మాది డేరాబస్సీ బ్లాక్‌లోని జడోత్ గ్రామం. మా అబ్బాయి ప్రదీప్ 12వ తరగతి పాసవ్వగానే అమెరికా పంపేందుకు భూములు అమ్మి రూ.42 లక్షలను ఏజెంట్ల చేతుల్లో పెట్టాను. మాది పేద కుటుంబం. పెళ్లి కావాల్సిన కూతురు ఉంది. ప్రదీప్ అమెరికాలో సంపాదించి, మా కష్టాలు తీరుస్తాడనుకున్నాం. ఆర్నెల్ల క్రితం ఏజెంట్లతో వెళ్లిన ప్రదీప్‌ను అమెరికా ప్రభుత్వం తిప్పి పంపింది. ఇప్పుడు మేమేం చేయాలి? భూముల్లేవు, డబ్బుల్లేవు.

- నరీందర్ కౌర్, పంజాబ్

లోకం తీరు



విమానం ఎక్కించి కాళ్లు చేతులకు సంకెళ్లు వేశారు



నా అమెరికా కల చెదిరిపోయింది. ఏజెంట్లు నిండా మోసం చేశారు. రూ.40 ల క్షలు తీసుకుని, అమెరికాకు పంపిస్తున్నామంటే.. అంతా సక్రమంగా ఉంటుందనుకున్నా. అప్పుచేసి, డబ్బులిచ్చా. ఐరోపాకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి బ్రెజిల్‌కు.. ఆ తర్వాత కాలినడకన అమెరికా సరిహద్దులకు చేర్చారు. 2024 జూలైలో ఐరోపాకు వెళ్తే.. ఆర్నెల్లపాటు వేర్వేరు దేశాల్లోని డంకీ మార్గాల్లో తిప్పారు. పనామా అడవుల్లోనూ గడిపాను. అమెరికా సరిహద్దు దాటగానే.. సైనికులు అరెస్టు చేశారు. చీకటి గదుల్లో ఉంచారు. ఎక్కడికి తీసుకెళ్తున్నారో చెప్పరు. చివరకు అమృత్‌సర్ వచ్చేప్పుడు కూడా విమానం ఎక్కించి, కాళ్లు, చేతులకు గొలుసులతో సంకెళ్లు వేశారు. కిందకు దిగేవరకు కూడా నాకు తెలియదు.. నేను భారత్‌కు వచ్చానని..!

- జస్పాల్ సింగ్, గురుదాస్‌పూర్

జైలులోనే సుఖ్‌పాల్!

రూ.45 లక్షలు చెల్లించి, నా కొడుకు సుఖ్‌పాల్‌ను 8 నెలల క్రితం అమెరికా పంపాను. ఏజెంట్లు తొలుత ఇటలీ వర్క్ పర్మిట్‌తో తీసుకెళ్లారు. నెల క్రితం అక్కడి నుంచి అమెరికాకు డంకీ మార్గాల్లో తరలించారు. 22 రోజుల క్రితం అమెరికాకు చేరుకున్నట్లు సుఖ్‌పాల్ ఫోన్ చేసి చెప్పాడు. ఆ తర్వా త సమాచారం లేదు. బహుశా.. అక్కడి పోలీసులు జైలులో పెట్టారేమో..! మా అబ్బాయిని వెంటనే భారత్‌కు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

- ప్రేమ్‌కుమార్, ధారాపూర్ తండా(పంజాబ్)

వలసదారుల భద్రతకు కొత్త చట్టం!

- పరిశీలిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- విదేశాల్లో ఉపాధికి సురక్షిత వలసలను ప్రోత్సహించేలా చట్టంలో విధివిధానాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: ఉపాధి కోసం విదేశాలకు వెళ్లే భారతీయుల భద్రత కోసం కొత్త చట్టం తీసుకురావాలని కేంద్రం యోచిస్తోంది. విదేశాల్లో ఉపాధి కోసం సురక్షితమైన, క్రమబద్ధమైన వలసలను ప్రోత్సహించేలా చట్టంలో విధివిధానాలు రూపొందించాలని పరిశీలిస్తోంది. తాజాగా భారత్‌కు చెందిన 104 మంది అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపడంతో ఈ ప్రతిపాదన వచ్చింది. 1983 నాటి వలస చట్టం స్థానంలో కొత్త ప్రతిపాదిత చట్టం (ఓవర్సీస్ మొబిలిటీ బిల్లు-2024)తీసుకొచ్చే అంశం పరిశీలనలో ఉంది. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సారథ్యంలోని విదేశీ వ్యవహారాల కమిటీ దీనిపై పార్లమెంటులో నివేదిక సమర్పించింది. వలసదారుల భద్రతను పర్యవేక్షించే(పీవోఈ) ఆఫీసులు లేని రాష్ట్రాల్లో కొత్తగా ఏర్పాటు చేయాలని ఈ కమిటీ సూచించింది. ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చండీగఢ్, కొచి, తిరువనంతపురం, జైపూర్, పట్నా, రాయబరేలి, రాంచీ, గువహటిలలో 14 కార్యాలయాలు ఉన్నాయని వెల్లడించింది. వలసలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో అదనపు కార్యాలయాలు ఏర్పాటు చేయాలని సూచించింది. వీసా నిబంధనలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరముందని పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా వలసలు పెరుగుతున్న నేపథ్యంలో భారత పౌరుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 1983 వలస చట్టం స్థానంలో సమగ్ర శాసన సవరణ అవసరమని కొన్నేళ్లుగా ప్రభుత్వానికి సూచిస్తున్నట్టు కమిటీ పేర్కొంది. ప్రతిపాదిత ముసాయిదాపై సంబంధిత శాఖలతో చర్చించిన తర్వాత ప్రజాభిప్రాయం కోసం అందుబాటులో ఉంచనున్నట్టు విదేశీ వ్యవహారాల శాఖ తెలియజేసిందని కమిటీ వెల్లడించింది.

ఓవర్సీస్ బిల్లుతో లాభాలు

- మెరుగైన నిబంధనలు తేవడం ద్వారా అక్రమ నియామకాలు, దోపిడీ, మోసాల నుంచి వలసదారులకు రక్షణ
- వలసలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వలసదారుల భద్రతా కార్యాలయాల విస్తరణ. తద్వారా సులభంగా చట్టపరమైన మార్గదర్శకత్వం, మద్దతు
- పౌరసమాజం, మీడియా భాగస్వామ్యంతో వలసదారులకు హక్కులు, చట్టపరమైన విధానాలు, అక్రమ వలసలతో ఇబ్బందులపై అవగాహన
- ఆధునికీకరణ వ్యవస్థ ద్వారా అధికారిక అడ్డంకుల్ని తొలగించి, పద్ధతిప్రకారం వలస ప్రక్రియను పూర్తి చేయడం
- ప్రపంచ వలస ధోరణులు, భారత పౌరుల అవసరాలకు అనుగుణంగా విస్తృతంగా చర్చించి బిల్లు రూపకల్పన

మరో రెండు ఎగ్జిట్ పోల్స్ బీజేపీ వైపే

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీనే అధికారంలోకి రానున్నదని టుడేస్ చాణక్య, యాక్సిస్ మై ఇండియా సర్వే సంస్థలు వెల్లడించాయి. గురువారం తమ అంచనాలను ప్రకటించాయి. ఎన్నికల్లో బీజేపీకి 51, ఆమ్ ఆద్మీకి 19 సీట్లు లభిస్తాయని టుడేస్ చాణక్య అంచనా వేసింది. అదేవిధంగా బీజేపీకి 45 నుంచి 55 సీట్లు, ఆమ్ ఆద్మీకి 15-20 సీట్లు, కాంగ్రెస్‌కు 0-1, ఇతరులకు 0-1 సీట్లు వస్తాయని యాక్సిస్ మై ఇండియా సంస్థ తెలిపింది.

అందరితో.. అందరి కోసం

ప్రభుత్వాన్ని నడుపుతున్న విధానం ఇదే.. కాంగ్రెస్ హయాంలో అన్నీ బుజ్జగింపు నిర్ణయాలే

- అన్ని వర్గాల సంతృప్తే మా లక్ష్యం
- అంబేడ్కర్ అంటే కాంగ్రెస్‌కు గౌరవం లేదు: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ (అందరితో కలిసి.. అందరి అభివృద్ధి కోసం) సిద్ధాంతమే తమ ప్రభుత్వాన్ని నడిపిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. పేదలు, మధ్యతరగతి, కొత్తగా మధ్యతరగతిలో చేరుతున్న వారి సంక్షేమం కోసం సర్కారు పని చేస్తోందన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు బదులిస్తూ మోదీ గురువారం రాజ్యసభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పై విమర్శలు కురిపించారు. 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆరు దశాబ్దాలపాటు కాంగ్రెస్ పాలనలో బుజ్జగింపు విధానాలే నడిచాయి. కొందరికి మాత్రమే ఇవ్వటం.. మిగిలినవారికి నిరాకరించటం అనే విధంగా పాలన నడిచింది. 2014 తర్వాత ఈ పద్ధ తి మారింది. బుజ్జగింపు విధానాల మీద కాకుండా.. అందరి సంతృప్తే లక్ష్యంగా పాలన మొదలైంది. వనరులను సమర్థంగా ఉపయోగించుకోవటం, ఏ ఒక్కరినీ వదిలిపెట్టకుండా అందరికీ పథకాలను చేరువ చేయటంపైనే దృష్టి పెట్టాం. ఈ విధంగా ప్రతీ స్థాయిలో సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ విధానాన్ని అమలుపరిచాం. దాని ఫలితాలు ప్రస్తుతం చూస్తున్నాం. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం' అని మోదీ తెలిపారు.



ఓబీసీ ఎంపీల డిమాండ్‌ను పట్టించుకోలేదు

ఓబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని పార్టీలకు అతీతంగా ఓబీసీ ఎంపీలు 3 దశాబ్దాలపాటు డిమాండ్ చేసినా.. నాటి కాంగ్రెస్ ప్రభుత్వాలు అంగీకరించలేదని ప్రధాని గుర్తు చేశారు. కానీ, తాము ఓబీసీ కమిషన్‌ను ఏరాటు చేయటమేగాక రాజ్యాంగబద్ధతను కల్పించామన్నారు. దేశంలో రిజర్వేషన్ సమస్య ఎప్పుడు ముందుకొచ్చినా సమాజంలో అశాంతికి కారణమయ్యేదని, కానీ, తాము ఎవరి కోటానూ తగ్గించకుండా ఆర్థికంగా వెనుకబడిన (ఈబీసీ) వర్గాలకు 10% రిజర్వేషన్ కల్పించామని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజికవర్గాలు కూడా స్వాగతించాయని మోదీ చెప్పారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ గౌరవించలేదని, వారి పాలనలో ఆయనకు భారతరత్న ఇవ్వలేదని, ఇప్పుడు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో జైభీం అని నినదిస్తోందన్నారు.

మజ్రూ సుల్తాన్‌పురిని అరెస్టు చేయించారు

ఎమర్జెన్సీకి అనుకూలంగా మాట్లాడనందుకు బాలీవుడ్ హీరో దేవానంద్ సినిమాలను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దూరదర్శన్‌లో ప్రదర్శించకుండా నిషేధించిందని, గాయకుడు కిశోర్‌కుమార్ పాటలపైనా ఇలాగే ఆంక్షలు విధించిందని మోదీ పేర్కొన్నారు. నిరసనల్లో పాల్గొన్నందుకు ప్రముఖ కవి మజ్రూ సుల్తాన్‌పురి, నటుడు బల్‌రాజ్ సాహ్నిలను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేయించిందని తెలిపారు.

చరిత్రను తుడిచేసే యత్నం

- భాషపై ఆర్‌ఎస్‌ఎస్ దాడి
- రాహుల్‌గాంధీ, అఖిలేశ్ ధ్వజం
- యూజీసీ ముసాయిదా నిబంధనలపై ఆగ్రహం
- జంతర్‌మంతర్ వద్ద డీఎంకే నిరసనకు హాజరు



నిరసనలో పాల్గొన్న రాహుల్, కనిమొళి, అఖిలేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: చరిత్రను తుడిచిపెట్టేందుకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) నిరంతరం ప్రయత్నిస్తోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. నియామక, పదోన్నతులకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) రూ పొందించిన ముసాయిదా నిబంధనలకు వ్యతిరేకంగా డీఎంకే విద్యార్థి విభాగం గురువారమిక్కడ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన నిరసనలో వారిద్దరూ పాల్గొన్నారు. 'ఈ దేశంలోని అన్ని చరిత్రలు, సంస్కృతులు, సంప్రదాయాలను నిర్మూలించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని కొద్దికాలంగా నేను చెబుతూ వస్తున్నాను. రాజ్యాంగంపై వారు దాడిచేస్తున్నారు. దేశం మీద ఒకటే చరిత్ర, ఒకటే సంప్రదాయం, ఒకే భాష, ఆలోచనను రుద్దాలని అనుకుంటున్నారు. తమ ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి విద్యావ్యవస్థ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. తమిళ ప్రజలకు నిర్దిష్ట చరిత్ర, భాష, సంప్రదాయాలు ఉన్నాయి. పోరాటాల చరిత్ర కూడా ఉంది. యూజీసీ నిబంధనలు మార్చడం ద్వారా ఆర్‌ఎస్‌ఎస్ తన ఆధిపత్యాన్ని రుద్దాలనుకోవడం.. వారిని, ఇతర రాష్ట్రాలను అవమానించడమే' అని అన్నారు. జాతీయ విద్యావిధానాని(ఎన్‌ఈపీ)కి తాను వ్యతిరేకమని అఖిలేశ్ స్పష్టంచేశారు. రాష్ట్రప్రభుత్వాల అధికారాలన్నీ లాక్కోవాలని మోదీ ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. కాగా, ప్రగతిశీల విద్యానిబంధనలను ప్రతిపక్షాలు వక్రీకరించి.. లేనిపోని ముప్పును ఊహిస్తున్నాయని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించారు. యూజీసీ ముసాయిదా నిబంధనలు,హద్దులను విస్తృతం చేయడానికే తప్ప కుదించడానికి కాదన్నారు.

వినూత్నంగా పరీక్షాపేచర్చ

- ప్రధానితో పాటు పలువురు విశిష్ట అతిథులు దీపికా పదుకోన్, మేరీ కోమ్, సద్గురు హాజరు
- ఈనెల 10న కార్యక్రమం.. డీడీలో ప్రసారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6: వార్షిక పరీక్షలకు ముందు విద్యార్థులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే పరీక్షా పేచర్చ (పీపీసీ) కార్యక్రమం ఈసారి సరికొత్తగా ఉండనుంది. ఫిబ్రవరి 10న జరిగే ఎనిమిదో పీపీసీని విశిష్ట అతిథులతో విలక్షణంగా నిర్వహించనున్నారు. ప్రముఖ నటి దీపికా పదుకోన్, బాక్సర్ మేరీ కోమ్, ఆధ్యాత్మికవేత్త సద్గురు జగ్గీ వాసుదేవ్ వంటి వారు పీపీసీలో పాల్గొని జీవితంలో ముఖ్యమైన అంశాలు, అభ్యసనం తదితర విషయాల్లో తమ అనుభవాలను, జ్ఞానాన్ని విద్యార్థులతో పంచుకుంటారు. ఎప్పుడూ నిర్వహించేలా కాకుండా ఈసారి ఢిల్లీలోని సుందర్ నర్సరీ పార్క్‌లో 35 మంది విద్యార్థులతో ప్రధాని మోదీ ముఖాముఖిగా మాట్లాడతారని అధికారులు తెలిపారు. విద్యార్థులను 'వర్రీయర్స్' నుంచి 'వారియర్స్'గా మార్చేందుకు పరీక్షల అంశాలు, ఒత్తిడిని తట్టుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రధాని సహా నిపుణులు సూచనలు ఇస్తారని చెప్పారు. ఆసక్తికరమైన 8 ఎపిసోడ్‌లుగా పీపీసీని రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 11 గంటల నుంచి దూరదర్శన్, స్వయంప్రభ, పీఎంవో యూట్యూబ్ చానెల్, విద్యా, సమాచార ప్రసార శాఖల సోషల్ మీడియా చానల్స్‌లో ప్రసారం అవుతుంది. ఈసారి పరీక్షాపేచర్చ వినూత్నంగా ఉంటుందని ఎక్స్‌వేదికగా మోదీ కూడా తెలిపారు.



ప్రయాగ్‌రాజ్‌లో శ్రీనివాస కల్యాణం

మహాకుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని ఇస్కాన్ క్యాంపులో గురువారం టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం జరిగింది. అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. – తిరుమల, ఆంధ్రజ్యోతి





అన్న క్యాంటీన్‌లో అమ్మ రాజశేఖర్!

దర్శకుడు, డ్యాన్స్ మాస్టర్ అమ్మ రాజశేఖర్ గురువారం విశాఖపట్నంలోని అన్న క్యాంటీన్‌లో భోజనం చేశారు. నగరంలోని రామాటాకీస్ రోడ్డులో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి వద్ద గల అన్న క్యాంటీన్‌కు వచ్చిన అమ్మ రాజశేఖర్, 'జబర్దస్త్' ఫేమ్ ముక్కు అవినాష్, తల చిత్రం ద్వారా హీరోగా పరిచయం అవుతున్న రాగిణి రాజ్ క్యూలో నిల్చుని వెళ్లి భోజనం చేశారు. -సీతమ్మధార (విశాఖపట్నం), ఆంధ్రజ్యోతి

కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి



అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం వడ్డాది జంక్షన్‌లో గల నేషనల్ టాలెంట్ స్కూల్‌లో లెక్కల ఉపాధ్యాయుడు దారపు గంగాప్రసాద్ తొమ్మిదో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్ర వర్తించడంతో బాలిక తల్లిదండ్రు లు గురువారం దేహశుద్ధి చేసి స్తంభానికి కట్టేశారు. పోలీసులు గంగాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. -బుచ్చెయ్యపేట, ఆంధ్రజ్యోతి

వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వ్యవసాయ కళాశాలలో పేలుడు పదార్థాలు ఉంచామని, త్వరలో పేలుస్తామంటూ బెదిరింపు మెయిల్ వచ్చింది. ప్రిన్సిపాల్ రమణ పోలీసులకు సమాచారమివ్వడంతో తనిఖీలు చేపట్టారు. ఏమీ దొరక్కపోవడంతో ఫేక్ మెయిల్‌గా భావిస్తున్నారు. దర్యాప్తు చేస్తున్నట్టు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు చెప్పారు.



అభివాదం చేస్తున్న ఎంపీలు ఈటల రాజేందర్, పుట్టా మహేశ్, ఆర్.కృష్ణయ్య, దగ్గుమళ్ల ప్రసాదరావు, లక్ష్మీనారాయణ, మల్లు రవి, బస్తిపాటి నాగరాజు

చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలి

» జనగణనలో కులగణన చేపట్టాలి: తెలుగు ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలుగు రాష్ట్రాల ఎంపీలు డిమాండ్ చేశారు. ఇందుకోసం పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి ఆమోదించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఏపీ/తెలంగాణ భవన్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఓబీసీ సెమినార్ జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, బీద మస్తాన్‌రావు, దగ్గుమళ్ల ప్రసాదరావు, పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, మల్లు రవి, అంబిక లక్ష్మీనారాయణ, పార్థసారథి, బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ 'త్వరలో చేపట్టే జనగణనలో కులాలవారీగా జనాభా లెక్కలు సేకరించాలి. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియమాకంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలి. క్రిమిలేయర్‌ను తొలగించాలి. ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి. బీసీలకు పారిశ్రామిక పాలసీలో 50 శాతం కోటా ఇవ్వాలి. రూ.2లక్షల కోట్లతో బీసీ సబ్ ప్లాన్‌ను కేంద్రం ఏర్పాటు చేయాలి' అని డిమాండ్ చేశారు.

ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోండి

» క్వాష్ పిటిషన్‌లో అరెస్టు నుంచి రక్షణ కల్పించలేం

» వైసీపీ నేత కాకాణికి హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలంటూ వైసీపీ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. కేసుల విచారణ ప్రాథమిక దశలో ఉన్న నేపథ్యంలో క్వాష్ పిటిషన్‌లో అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని పేర్కొంది. అరెస్టు చేస్తారనే ఆందోళన ఉంటే ముందస్తు బెయిలు పిటిషన్ వేసుకోవాలని సూచించింది. ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. 'టీడీపీ నేతలను విడిచిపెట్టేది లేదు. పోలీసుల పాపాలు వారికి శాపాలుగా మారుతాయి' అంటూ ఇటీవల కాకాణి చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేత ఒంటేరు ప్రసన్నకుమార్ చేసిన ఫిర్యాదు మేరకు కావలి పోలీసులు కేసు నమోదు చేశారు. దానిని కొట్టివేయాలని కోరుతూ కాకాణి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కాగా, వెంకటాచలం ఇన్‌స్పెక్టర్ సుబ్బారావుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పద్మయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసునూ కొట్టివేయాలని, తదుపరి చర్యలు నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని మరో పిటిషన్‌లో కోరారు.

పూర్తి సామర్థ్యంతో హంద్రీ-నీవా పంపుల వినియోగం

» ప్రాజెక్టుపై సమీక్షలో మంత్రులు, ఎమ్మెల్యేల నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా ప్రాజెక్టు పంపులను పూర్తి సామర్థ్యంతో ఉపయోగించుకోవాలని మంత్రులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రులు నిమ్మల రామానాయుడు, సవిత, సత్యకుమార్ గురువారమిక్కడ సచివాలయంలో సమీక్షించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రూ.2,692 కోట్లతో ప్రాజెక్టు పనులను సీఎం చంద్రబాబు ప్రారంభించారని పేర్కొన్నారు. భేటీలో ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దట్టమైన పొగమంచు... విమానాలు ఆలస్యం

గన్నవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దట్టమైన పొగమంచు కారణంగా గురువారం విమానాల రాకపోకలు ఆలస్యమయ్యాయి. గన్నవరం విమానాశ్రయానికి హైదరాబాద్, ఢిల్లీ నుంచి వచ్చిన ఇండిగో, ఎయిరిండియా విమానాలు గాలిలో చక్కర్లు కొట్టి ల్యాండ్ అయ్యేందుకు విజిబిలిటీ లేకపోవటంతో హైదరాబాద్ వెళ్లిపోయాయి. చెన్నై నుంచి వచ్చిన ఇండిగో విమానం రాజమండ్రిలో ల్యాండ్ అయింది. విమానాల రాకపోకలు ఆలస్యం కావటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

డబుల్ ఇంజన్‌తో రాష్ట్రం ప్రగతి వైపు: వల్లూరు జేపీ

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి ఎలా పరుగులు పెడుతుందో చెప్పడానికి రాష్ట్రంలో ఏడు నెలలుగా జరుగుతున్న ప్రగతే నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ అన్నారు. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌ను ఎన్నుకోవడం వల్ల అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలు ఊపందుకున్నాయని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్లు ఇచ్చిందన్నారు. ప్రత్యేక రైల్వే జోన్‌ను సాకారం చేసిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.



విజ్ఞాన్ మహోత్సవ్‌లో ప్రసంగిస్తున్న సంగీత దర్శకుడు తమన్, వేదికపై ఇండియన్ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు మన్యం తులసిరెడ్డి, విజ్ఞాన్ సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వీసీ నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్, సీఈవో మేఘన

నిరంతర అధ్యయనంతోనే లక్ష్య సాధన

» విజ్ఞాన్స్ మహోత్సవ్‌లో సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్

గుంటూరు విద్య, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నిరంతర అధ్యయనంతోనే లక్ష్యాన్ని సాధించడం సాధ్యమవుతుందని సినీ సంగీత దర్శకుడు, గాయకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. గుంటూరు సమీపంలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ(వడ్లమూడి)లో జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తమన్ మాట్లాడుతూ జీవితంలో కొత్తవి నేర్చుకోవడానికి ఆలస్యం చేయరాదని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఏదో ఒకటి సాధించేలా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. జీవితంలోని ప్రతి దశను, ప్రతి నిమిషాన్ని ఆస్వాదించి విజయతీరాలకు చేరాలన్నారు. చదువుకే పరిమితం కాకుండా యోగ, సంగీతం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇండియన్ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు మన్యం తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శారీరక దృఢత్వానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉంటేనే మానసికంగా మరింత బలంగా ఉంటారన్నారు. విజ్ఞాన్స్ మహోత్సవ్‌లో 80 ఈవెంట్లను నిర్వహించినట్టు వీసీ నాగభూషణ్ తెలిపారు. రిజిస్ట్రార్ రఘునాథన్, సీఈవో మేఘన తదితరులు పాల్గొన్నారు.

స్టీరింగ్ ఒకరికి.. సిగ్నల్ మరొకరికి!

» ఆర్టీసీ వైస్‌చైర్మన్, ఎండీగా ద్వారకా తిరుమలరావు

» పీటీడీ కమిషనర్‌గా కాంతిలాల్‌కు పూర్తి బాధ్యతలు

» ఆపరేషన్స్, అడ్మినిస్ట్రేషన్ విధులు వేర్వేరుగా ఇద్దరికి..

» గందరగోళ పరిస్థితిపై అధికారులు, సిబ్బందిలో చర్చ

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనాన్ని ఇద్దరు డ్రైవర్లు నడిపితే.. దాని గమ్యం ఏటు వెళుతుందో చెప్పగలమా..!! ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీలో పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఆర్టీసీ వైస్ చైర్మన్, ఎండీగా రిటైర్డ్ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉన్నారు. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(పీటీడీ) కమిషనర్‌గా రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. బస్సుల ఆపరేషన్స్ విభాగాన్ని ఎండీ పర్యవేక్షిస్తే.. పరిపాలనా వ్యవహారాలు (అడ్మినిస్ట్రేషన్) రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి చూస్తారు. ఆర్టీసీ చరిత్రలో ఎన్నడూ లేని ఇలాంటి విచిత్ర పరిస్థితి నెలకొనడం చర్చనీయాంశమైంది. ఆర్టీసీ హౌస్‌లోని కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకూ దీనిపై మాట్లాడుకుంటున్నారు. గత నెలాఖరున తిరుమలరావు రిటైర్డ్ అయ్యే వరకు ఆయన చేతిలోనే ఉన్న ఈ మొత్తం బాధ్యతలు, ఇప్పుడు విభజన కావడంపై గందరగోళ పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ 11 వేల బస్సుల్లో 45 లక్షల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీలో 48 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ప్రతి నెలా రూ.500 కోట్ల ఆదాయం తెచ్చుకునే కీలకమైన సంస్థకు గత ప్రభుత్వంలో 2020 జనవరి నుంచి ఒక విధమైన ముప్పు వస్తే.. 2025 ఫిబ్రవరి నుంచి మరో సమస్య ఎదురైంది. కార్పొరేషన్‌గా ఉన్న ఆర్టీసీని రెండు ముక్కలు చేసి బస్సులు, ఆస్తులను కార్పొరేషన్ కిందే ఉంచి.. సిబ్బంది, జీతభత్యాలు, ఇతర పాలనా వ్యవహారాలను పీటీడీ కింద ప్రభుత్వ పరిధిలోకి తీసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అలాంటి అనాలోచిత నిర్ణయం వల్ల ఆర్టీసీ సిబ్బంది విలీన సమస్యలు పరిష్కారం కాక నాలుగేళ్ల పాటు ఇబ్బంది పడ్డారు. ఇప్పుడిప్పుడే ఆ సమస్యలు తీరిపోతున్నాయనగా.. మరో కొత్త సమస్య ఎదురైంది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి పూర్తిస్థాయిలో పాలకమండలిని ఏర్పాటు చేయకపోవడంతో విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ఏడు నెలలకు పైగా ఇన్‌చార్జి బాస్‌గా ఉన్న తిరుమలరావు జనవరి 31న డీజీపీగా పదవీ విరమణ పొందారు. అయితే త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే ఆలోచనలో ఉన్న కూటమి ప్రభుత్వం.. అందుకు అనుభవజ్ఞుడైన అధికారి ఉంటే మంచిదన్న భావనలో ఉంది. ఇందుకు అనుగుణంగానే తిరుమలరావును పదవీ విరమణ తర్వాత ఆర్టీసీ వైస్‌చైర్మన్, ఎండీగా నియమించింది. అయితే ప్రభుత్వంతో జరిపే పాలనాపరమైన వ్యవహారాలు రిటైర్డ్ అధికారికి అప్పగించడం సరికాదన్న ఆలోచనతో అడ్మినిస్ట్రేషన్ విభాగాన్ని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శికి అప్పగిస్తూ జీవో జారీచేసింది. కీలకమైన అడ్మిన్ విభాగం ఎండీ చేతిలో లేకపోతే కనీసం డిపో మేనేజర్‌ను కూడా బదిలీ చేయడం సాధ్యం కాదు. ఆపరేషన్స్ విభాగంపై పూర్తి పట్టు రావాలంటే డిపో మేనేజర్ స్థాయిలో చర్యలు తీసుకునే అధికారం ఎండీ చేతిలో ఉంటే ప్రయాణ సేవల్లో నాణ్యత ఉంటుంది. కానీ రిటైర్డ్ అధికారి సంతకంతో పంపించే దస్త్రానికి విలువ ఉండదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ ఉన్నతాధికారులు అంటున్నారు. తిరుమలరావు అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని బస్సుల నిర్వహణతో పాటు ఆపరేషన్స్ వ్యవహారాలు ఆయనకు అప్పగించినట్లు వివరిస్తున్నారు. అయితే ఇదంతా గందరగోళంగా ఉందని ఆర్టీసీ హౌస్‌లోని సిబ్బంది, అధికారులు, అసోసియేషన్ల ప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. పూర్తిస్థాయి అధికారాలు ఒకరి వద్దే ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీకి పూర్వ వైభవం తీసుకొద్దాం

» బోర్డు డైరెక్టర్లతో మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 'ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందిద్దాం. సంస్థ పూర్వవైభవం కోసం మనందరం కలిసి పని చేద్దాం.. క్షేత్రస్థాయిలో పర్యటించి విలువైన సూచనలు చేయండి' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి ఏపీఎస్ఆర్టీసీ డైరెక్టర్లతో అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ పూర్తిస్థాయి పాలకమండలి ఏర్పాటైన నేపథ్యంలో డైరెక్టర్లు దొన్ను దొర (విజయనగరం), రెడ్డి అప్పలనాయుడు (విజయవాడ), సురేశ్ రెడ్డి (నెల్లూరు), పూల నాగరాజు (కడప) రవాణా మంత్రితో గురువారం సచివాలయంలో భేటీ అయ్యారు. మహిళలకు ఉచిత ప్రయాణం, సిబ్బంది ఆరోగ్య సమస్యలు, కారుణ్య నియామకాల భర్తీ తదితర అంశాలపై మంత్రితో చర్చించారు. సమస్యలు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకుందామని, ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని మంత్రి వారికి మాటిచ్చారు. ఏపీఎస్ఆర్టీసీ కొత్తగా కొనుగోలు చేయబోయే వాటిలో విద్యుత్ బస్సులకే ప్రాధాన్యం ఇద్దామని సూచించారు.

కేఎల్‌యూ ప్రెసిడెంట్‌కు హైకోర్టులో ఉపశమనం

» రెండు వారాలపాటు తొందరపాటు చర్యలు వద్దు: హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్(కేఎల్ఈఎఫ్) ప్రెసిడెంట్ కోనేరు సత్యనారాయణకు హైకోర్టులో ఉపశమనం లభించింది. ఆయన విషయంలో రెండు వారాలపాటు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్‌పై సీబీఐ నమోదు చేసిన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని గుర్తు చేసింది. విచారణను ఫిబ్రవరి 13కి వాయిదా వేసింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. కేఎల్ విశ్వవిద్యాలయానికి ఏ++ గుర్తింపు ఇచ్చేందుకు న్యాక్ బృందానికి లంచం ఇచ్చారని ఆరోపిస్తూ ప్రెసిడెంట్ కోనేరు సత్యనారాయణ, యునివర్సిటీ ఉప కులపతి, ఉపాధ్యక్షుడు, డైరెక్టర్, మరికొందరు న్యాక్ బృందం సభ్యులపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ కోనేరు సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. గురువారం కోర్టు విచారణ ప్రారంభమైన వెంటనే ముందస్తు బెయిల్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని ఆయన తరఫు న్యాయవాది అభ్యర్థించడంతో న్యాయమూర్తి లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించారు. సత్యనారాయణ తరఫున న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ... 'సత్యనారాయణ వయస్సు 70 ఏళ్లు. యూనివర్సిటీ వ్యవహారాల్లో ఆయన చురుగ్గా పాల్గొనడం లేదు. న్యాక్‌లో మొత్తం 3,000 మంది ఉంటారు. న్యాక్ మార్గదర్శకాల మేరకు లాటరీ విధానంలో బృందంలోని సభ్యులను ఎంపిక చేస్తారు. కమిటీలో సభ్యులుగా ఎవరుండాలో ఒక వ్యక్తి నిర్ణయించలేరు. ఈ నేపథ్యంలో లంచం ఇవ్వడం ఎలా సాధ్యపడుతుంది? అరెస్టు నుంచి రక్షణ కల్పించాలి' అని కోరారు. సీబీఐ తరఫు న్యాయవాది పీఎస్‌పీ సురేశ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ... 'పిటిషనర్ యూనిర్సిటీకి ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఆయన సూచనలతోనే యూనివర్సిటీకి చెందిన ఇతర నిందితులు న్యాక్ బృందంలోని సభ్యులకు లంచం ఇచ్చారు. ఈ వ్యవహారంలో అంతిమంగా లబ్ధి పొందింది పిటిషనరే. సీబీఐ సోదాలు జరిపి సొమ్మును రికవర్ చేసింది. తాను చెప్పినట్లు నడుచుకొనే వ్యక్తులను పిటిషనర్ న్యాక్ బృందంలో సభ్యులుగా ఎంపిక చేశారు. సోర్స్ ఇచ్చిన సమాచారంతో యూనివర్సిటీ ప్రతినిధులు, న్యాక్ సభ్యులపై సీబీఐ నిఘా పెట్టింది. న్యాక్ బృందంలోని సభ్యులకు రూ.10 లక్షలు లంచం ఇచ్చారు. కాల్ రికార్డులు కూడా ఉన్నాయి. పిటిషనర్‌ను అరెస్టు చేసేందుకు సీబీఐ అధికారులు ఇంటికి వెళ్లారు. గుండెనొప్పి అని ఆయన ఆసుపత్రిలో చేరారు. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్య నివేదికల్లో స్పష్టంగా ఉంది' అని వివరించారు.

ఖరీఫ్‌కు 17.31 లక్షల టన్నుల ఎరువులు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024 ఖరీఫ్‌లో 15.80 లక్షల టన్నుల ఎరువులను కేటాయించగా, 2025 ఖరీఫ్‌కు 17.31 లక్షల టన్నులు కేంద్రం కేటాయించినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ కోసం యూరియా 6.32, కాంప్లెక్స్ 6.30, డీఏపీ 2.60, సూపర్ ఫాస్పేట్ 0.94, పొటాష్ 0.70, ఇతర ఎరువులు 0.27 లక్షల టన్నులు రాష్ట్రానికి రానున్నట్లు చెప్పారు. రైతుల అవసరాలను గుర్తించి, డీఏపీ అదనంగా కేటాయించారని తెలిపారు. కాగా గురువారం జాతీయ స్థాయిలో 2025 ఖరీఫ్ పంటల సన్నద్ధతపై రాష్ట్రాల వ్యవసాయ శాఖ సంచాలకులతో కేంద్ర వ్యవసాయశాఖ సంయుక్త కార్యదర్శి ఫ్రాంక్లిన్ ఎల్ ఖోబంగ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో రసాయన ఎరువుల వాడకాన్ని పరిగణలోకి తీసుకుని, ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఎరువులు కేటాయించినట్లు చెప్పారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే దిశగా రైతుల్ని చైతన్యపర్చి, సేంద్రియ, నానో ఎరువులను ప్రోత్సహించాలని రాష్ట్ర అధికారులకు సూచించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాటలు.. మంటలు

నన్ను క్షమించండి, గతాన్ని వదిలేసి, ఈ కొత్తసంవత్సరంలో అన్ని జాతులవారూ ఒక్కటిగా కలసిమెలసి నడవండి అంటూ నెలక్రితం ఓ అద్భుతమైన ఉపన్యాసం దంచిన మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ఇంతలోనే అడ్డంగా దొరికిపోయారు. రాష్ట్రంలో నెలల తరబడిసాగిన హత్యాకాండను ప్రేరేపిస్తున్నది ఆయనేనంటూ మీతీయేతరులు ఆనాదిగా చేస్తూవచ్చిన ఆరోపణలకు ఈ ఆడియోటేపుల వ్యవహారం ఊతాన్నిస్తున్నది. మీతీలను తుపాకులు దోచుకోనివ్వండి, ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆయుధాలను లూటీచేసేందుకు అవకాశమివ్వండి అంటూ ఆయన అధికారులను ఆదేశించినట్టుగా ప్రచారంలో ఉన్న సదరు ఆడియోక్లిప్‌తో బీరేన్‌సింగ్ గొంతు 93శాతం మేరకు సరిపోలిందని ఫోరెన్సిక్ పరీక్ష తేల్చింది. బీరేన్‌తో పాటు ఆయనను ఇంతకాలం వెనకేసుకొస్తున్న బీజేపీ పెద్దలకు కూడా ఈ పరిణామం పెద్ద ఎదురుదెబ్బ.

ట్రూత్‌ల్యాబ్స్ నివేదికను సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టుకు సమర్పించినప్పుడు, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబరేటరీలో పరీక్షలు జరగాలంటూ అభ్యంతరం వెలిబుచ్చడంతో తదుపరి విచారణ మార్చి 24కు వాయిదాపడింది. కుకీ హ్యూమన్ రైట్స్ సంస్థ దాఖలు చేసిన ఈ కేసు చంద్రచూడ్ కాలంనుంచీ సాగుతోంది. నవంబరు 14న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు అనుమతించినమేరకే ఈ ప్రైవేట్ ఫోరెన్సిక్ ల్యాబరేటరీలో టేపుల పరీక్ష జరిగింది. అత్యంత సంక్లిష్టమైన కేసులను పరిష్కరించడానికి సీబీఐ, ఎన్ఐఏ ఇత్యాది కేంద్ర దర్యాప్తుసంస్థలు ఇదే ప్రైవేటు ఫోరెన్సిక్ సంస్థమీద ఆధారపడిన విషయం డబుల్ ఇంజన్ సర్కార్ తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్‌కు తెలియనిదేమీ కాదు. నిజనిర్ధారణ జరిగిన తరువాత ఇప్పుడు ఆయనకు అసలు ఈ కేసు విచారణ అర్హత సుప్రీంకోర్టుకు లేదని అనుమానం వచ్చింది. మణిపూర్ హైకోర్టుకు దీనిని బదలాయించాలన్న ఆయన విజ్ఞప్తి మీద తదుపరి విచారణలో నిర్ణయం తీసుకుంటామని ప్రస్తుత చీఫ్‌జస్టిస్ అంటున్నారు. కేసు స్వరాష్ట్రానికి తరలిపోయి, వ్యవహారం మళ్ళీ మొదటికి వచ్చినా రావచ్చు. న్యాయప్రక్రియ ఎలా సాగబోతున్నదో, సీల్డుకవర్‌లో సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబరేటరీ సమర్పించబోతున్న నివేదికలో ఏ గుట్టు ఉంటుందో తెలియదు కానీ, నిజం ఇప్పటికే నిర్ధారణ అయిపోయింది. ముఖ్యమంత్రి కుర్చీలో ఉన్న మీతీ బీరేన్ రాజ్యాంగబద్ధంగా నడుచుకోలేదని, తన పదవీ ప్రమాణానికి పూర్తిభిన్నంగా వ్యవహరించారని దాదాపుగా తేలిపోయింది. మూలవాసులను తరిమేసి మణిపూర్‌ను మీతీల రాజ్యంగా మార్చేయాలన్న ఆయన లక్ష్యం మేరకే అగ్గిరాజుకుందన్నది వాస్తవం.

మణిపూర్ హింసాకాండపై విచారణకోసం హోంమంత్రిత్వశాఖ నియమించిన జుడీషియల్ కమిషన్‌కు 'కోహుర్' ఈ ఆడియోటేపులను తొలుత అందించింది. ఆ తరువాత నేరుగా సుప్రీంకోర్టుకు సమర్పించినందువల్ల ఈ మాత్రం కదలికైనా వచ్చింది. తరతమభేదాలు లేకుండా ప్రజలను రక్షిస్తానని రాజ్యాంగంమీద ప్రమాణం చేసిన ఓ ముఖ్యమంత్రి తద్భిన్నంగా తనవారిని ఉద్ధరించడానికి మిగతావారిని ఊచకోతకు గురిచేయడం దుర్మార్గం. 21 నెలలుగా మణిపూర్ మండిపోతూంటే, అందుకు కారకుడైన వ్యక్తిని ప్రధాని, హోంమంత్రి వెనకేసుకురావడం ఆశ్చర్యకరం. గ్రామాలకు గ్రామాలు తగలబడిపోతూ, ఊచకోతలు, అఘాయిత్యాలు యథేచ్ఛగా సాగిపోతున్న తరుణంలో నరేంద్రమోదీ స్వయంగా ఆ రాష్ట్రంలో పర్యటించి, అనుమానాలు, అవిశ్వాసాలతో నిలువుగా చీలి ఉన్న ఆ సమాజంలో శాంతినెలకొల్పే ప్రయత్నం చేస్తారని దేశం ఆశించింది. ఇది జరగకపోగా, మణిపూర్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా బీజేపీ అధినాయకులు విపక్షంమీద విరుచుకుపడుతూ వచ్చారు.

మీతీలు మినహా మణిపూర్‌లోని మిగతా అందరి నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిన బీరేన్‌సింగ్ అధికారంలో ఉన్నంతకాలం సమాజంలో సయోధ్య సాధ్యపడదని ఈ ఆడియోటేపులు తేల్చేశాయి. సంఖ్యాబలం ఉన్నప్పటికీ, ఆయనపట్ల పార్టీలో అసంతృప్తి తీవ్రంగా ఉన్నమాట వాస్తవం. ఆయన స్థానంలో కొత్తవ్యక్తిని కూచోబెడితేనే మద్దతు ఉంటుందని మిత్రపక్షాలు కూడా తేల్చేశాయి. ఆడియోటేపుల్లో గుట్టు రట్టయిన తరువాత కూడా బీరేన్‌ను తప్పించకపోతే పార్టీ పెద్దలకు మరింత అప్రదిష్ట తప్పదు.

కొత్త సీఈసీపై సుప్రీం నిర్ణయమేమిటి?

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తన విధులు రాజ్యాంగ నిష్ఠతో నిర్వహిస్తుందా? లేదు. అసంబద్ధంగా వ్యవహరిస్తూ అవహేళనకు గురవుతోంది. ఎంత బాధాకరం! అమిత ఆవేదనతో నేను ఈసీఐ పనితీరును ఆక్షేపిస్తున్నాను. ఎందుకు ఈ వ్యాకులత? ఒకప్పుడు ఈసీఐ కర్తవ్య పాలనను నిర్లజ్జగా అభిమానించేవాణ్ణి, గౌరవించేవాణ్ణి. నా వైఖరిని ఎవరు తప్పుపట్టినా లెక్కచేసేవాణ్ణి కాదు. భారతదేశ ఎన్నికల ప్రజాస్వామ్య ఆదర్శప్రాయ విజయాలను ప్రపంచానికి తెలియజేసేందుకు సమస్త దేశాల ఎన్నికల కమిషనర్ల సదస్సును నిర్వహించమని కూడా మన ఈసీఐకి నేను ఒకప్పుడు విజ్ఞప్తి చేశాను. నా సూచన ఈసీఐకి ఒక సామాన్య పౌరుని కితాబుగా భావించాను. అయ్యో! ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. మౌనంగా ఉండలేను. అలా ఉండడమంటే మన గొప్ప రాజ్యాంగ సంస్థ భారత ప్రజాస్వామ్య ప్రస్థానంలో నిర్వహించిన ఘనతర పాత్రను అగౌరవించడమే అవుతుంది. అంతకంటే ముఖ్యంగా మన ప్రజాస్వామ్య పురోగమనానికి ఎదురవుతున్న సవాళ్ళు, సమస్యలను ఉపేక్షించడమే అవుతుంది.

రాజీవ్ కుమార్ (భారత ఎన్నికల సంఘం 25వ ప్రధానాధికారి – సీఈసీ) ఈ మాసాంతంలో పదవీ విరమణ చేయనున్న తరుణాన మన రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థ ఒక కఠిన ప్రత్యామ్నాయాన్ని ఎదుర్కొంటున్నది: రాజ్యాంగ నిబద్ధత, లేదంటే రాజకీయ సంక్షోభం. మరింత స్పష్టంగా చెప్పాలంటే నిష్పాక్షికత, తటస్థత, పారదర్శకత ప్రస్ఫుటంగా ఉన్న న్యాయబద్ధమైన పద్ధతి ద్వారా కొత్త సీఈసీ ఎంపిక జరగాలి. లేనిపక్షంలో మనం ఒక ఎడతెగని రాజకీయ సంక్షోభంలో చిక్కుకోవడం అనివార్యమవుతుంది. మన ఇరుగు పొరుగు దేశాలలో వలే ఎన్నికల ఫలితాలు సదా వివాదాస్పదమవుతాయి ఇటువంటి పరిస్థితి మనకు మేలుచేస్తుందా? నిస్సందేహంగా సిగ్గుచేటు అవుతుంది.

ఈ శోచనీయ పరిస్థితికి రాజీవ్ కుమారే పూర్తిగా కారకుడు కాదు. ఒకప్పుడు తన విధ్యుక్త ధర్మాన్ని విలక్షణంగా నిర్వర్తించిన భారత ఎన్నికల సంఘం ప్రస్తుత అవనతికి ఆయన వ్యక్తిగతంగా బాధ్యుడు కానే కాదు. ఒక సుదీర్ఘ పతన క్రమం పరాకాష్ఠ దశలో ఆయన నిర్వాచన్ సదన్ (ఈసీఐ కార్యాలయం)కు సీఈసీగా వచ్చారు. తొలి నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో ఈసీఐ ఏకసభ్య సంఘంగా ఉండేది. అయితే భారత ప్రభుత్వ విస్తరణ వ్యవస్థగా మాత్రమే వ్యవహరించేది. భారత రాజ్యాంగం తనకు సంక్రమింపచేసిన అధికారాలను చాలా చాలా అరుదుగా మాత్రమే వినియోగించింది. ఎన్నికలలో అక్రమాలపైన, అధికార భారత జాతీయ కాంగ్రెస్ పట్ల ఎన్నికల సిబ్బంది పక్షపాత వైఖరిపైన ఫిర్యాదులు వెల్లువెత్తుతూనే ఉండేవి. అయితే 1972లో పశ్చిమ బెంగాల్ శాసనసభా ఎన్నికలలో పెద్ద ఎత్తున చోటుచేసుకున్న అవకతవకల పైన, 1987 జమ్మూ–కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ స్వేచ్ఛగా, సక్రమంగా లేక పోవడంపైన ఆరోపణలు తీవ్ర స్థాయిలో వచ్చాయి. ఈ రెండు సందర్భాలలో మినహా మరెప్పుడూ ఎలాంటి వివాదాలు ఈసీఐకి చిక్కులు కల్పించలేదు. ఉపేక్షా భావంతో వాటిని అధిగమించగలిగింది. పాలనా పరంగా ప్రభుత్వానికి లోబడి ఈసీఐ వ్యవహరించింది. అయితే ఏనాడూ పాలకపక్షానికి లోబడి, దానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోలేదు, వ్యవహరించలేదు.



akbar

> ప్రస్తుత పరిస్థితుల్లో మరొక రాజీవ్ కుమార్ ఎన్నికల సంఘం ప్రధానాధికారి కావడం మన ప్రజాస్వామ్యానికి శ్రేయస్కరం కాదు. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని సర్వోన్నత న్యాయస్థానం తదుపరి సీఈసీని ప్రభుత్వ ప్రాబల్యమున్న కమిటీ నిర్ణయం ద్వారా నియమించేందుకు మోదీ సర్కార్‌ను అనుమతించడమో లేక గతంలో తాను జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ఒక స్వతంత్ర ప్రక్రియ ద్వారా నియమించి తీరాలని నిర్దేశించడమో చేయాలి.

అప్పుడు తిరునెల్లై నారాయణ అయ్యర్ శేషన్ (టిఎన్ శేషన్‌గా సుప్రసిద్ధుడు) రంగప్రవేశం చేశారు. భారత ఎన్నికల సంఘంకు ఆయన 10వ ప్రధానాధికారి (1990–96). ఎన్నికల సంఘంకు భారత రాజ్యాంగం కల్పించిన అధికారాలు అన్నిటినీ ఆయన సంపూర్ణంగా చెలాయించారు. శేషన్ ప్రజాస్వామ్యవాది కాదు. నిరంకుశుడు. జగడాలమారి. తెంపరితనంతో వ్యవహరించడం ఆయన స్వాభావిక లక్షణం. పాత ఆనవాయితీలకు స్వస్తి చెప్పారు. ఈసీఐలో భారీ సంస్కరణలు తెచ్చారు. ఎన్నికల సంఘానికి ఒక కొత్త గుర్తింపునిచ్చారు. కర్తవ్య పరాయణతలో కొత్త పుంతలు తొక్కారు. దేశ ప్రజలలో ఒక అపూర్వ ప్రజాస్వామిక చైతన్యాన్ని రగుల్కొలిపారు. అయితే రాజ్యాంగ అవధులు మీరుతున్నారా అన్న భావనకు కూడా శేషన్ ఆస్కారం కల్పించారు. సర్వోన్నత న్యాయస్థానం ఆక్షేపించింది. ఎన్నికల సంఘంలో మరో ఇద్దరు కమిషనర్లను నియమించాలని ఆదేశించింది. ఈ చర్యలతో శేషన్ దూకుడుకు కళ్ళెం పడింది. ఆయన తెంపరితనాన్ని సంయమనపరిచింది. ఏతావాతా మేల్కొన్న సింహంలా భారత ఎన్నికల సంఘం నికార్సయిన స్వతంత్రతతో పనిచేయడం ప్రారంభించింది. ఈ చైతన్యశీలత 2004 వరకు కొనసాగింది. శేషన్ అనంతరం సీఈసీలు అయిన ఎమ్ఎస్ గిల్, జెఎమ్ లింగ్డో‌లు తమ పూర్వీకుని నాటకీయతలకు పోకుండా తమ విధ్యుక్త ధర్మాన్ని రాజ్యాంగ నిష్ఠతో నిర్వర్తించారు. ఈసీఐ స్వతంత్రతను నిలబెట్టారు. విధి నిర్వహణలో కచ్చితమైన తటస్థత పాటించారు. ఎన్నికల నిబంధనలను పాటించని రాజకీయవేత్తలను చట్టంతో జడిపించారు, అదుపు చేశారు. 2002 గుజరాత్ శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇది బాగా ప్రస్ఫుటమయింది. ఈసీఐ చరిత్రలో శేషన్ నుంచి లింగ్డో హయాం దాకా స్వర్ణ యుగం. ఈ కాలంలోనే అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పరాజయాల పాలు కావడం, సంకీర్ణ ప్రభుత్వాలు అధికారంలోకి రావడం అధికమయింది.



■ యోగేంద్ర యాదవ్

2004 నుంచి 2018 దాకా ఈసీఐ వివాదాలకు తావివ్వకుండా మామూలు రీతిలో ప్రస్థానించింది. శేషన్, ఆయన తరువాయి సీఈసీలు సాధించిన మార్పులను మరింత ముందుకు తీసుకువెళ్లి, ఎన్నికల క్రీడలో రాజకీయ ఆటగాళ్లు అందరికీ సమాన అవకాశాలు కల్పించడంపై పెద్దగా శ్రద్ధ పెట్టకుండా భద్రంగా వ్యవహరించింది. అయితే సరైన మార్గంలోనే సాగింది. ప్రస్తావిత కాలంలో సీఈసీలు పాలకులు, పాలకపక్షంతో ఘర్షణ పడకుండా వ్యవహరించారు. అయితే ఈసీఐ స్వతంత్రత ఒక ప్రమాణంగా స్థిరపడింది. స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించడం ఒక అలవాటు అయింది. అయితే ఆనవాయితీలను పాటించడం మాటున విలువలు క్షీణ ముఖం పట్టడం ప్రారంభమయింది. రాజకీయ తటస్థతనుంచి ఈసీఐ పక్కదారులకు వెళ్లింది. క్షీణపతనాలు కనిపించక పోయినా ఆరంభమయ్యాయి.

డిసెంబర్ 2018లో సీఈసీగా సునీల్ అరోరా నియామకంతో, సంస్థాగత స్వతంత్రత కోల్పోయిన, రాజకీయ తటస్థతకు తిలోదకాలు ఇచ్చిన ప్రస్తుత దశలోకి సీఈసీ ప్రవేశించింది. ఆ తరువాత అశోక్ లావాసా, అరుణ్ గోయెల్ ఉదంతాలతో ఎన్నికల సంఘంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేందుకు ఏ మాత్రం ఆస్కారం లేనటువంటి పరిస్థితి నెలకొన్నది. ఈ శోచనీయ స్థితిని రాజీవ్ కుమార్ మరింత ముందుకు తీసుకువెళ్లారు. భిన్నభిప్రాయాన్ని వ్యక్తం చేయకపోవడం నుంచి పాలకులతో కుమ్మక్కయ్యే దశకు ఆయన చేరుకున్నారు! ప్రస్తుత సీఈసీ నిర్ణయాలు రాజ్యాంగ నిబద్ధతతో తీసుకున్నవేనా? నిశితంగా పరిశీలించడం అవశ్యం. ఈశాన్య భారత రాష్ట్రమైన అసోంలో పార్లమెంటరీ, శాసనసభా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణలో ఆయన నిష్పాక్షికంగా ప్రవర్తించలేదు. పూర్తిగా భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా వ్యవహరించారు. ఒక అరుదైన, వివాదాస్పద 'పోటీ రహిత' పార్లమెంటరీ ఎన్నికలను పర్యవేక్షించారు (గత సార్వత్రక ఎన్నికలలో సూరత్ నియోజకవర్గంలో ఏమి జరిగిందో గుర్తు చేసుకోండి). తద్వారా ఆయన నేతృత్వంలో మన ఎన్నికల సంఘం అపారదర్శకతను కొత్త ఎత్తులకు తీసుకువెళ్లింది. ఎంత మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు, పోలయిన ఓట్లు, లెక్కించిన ఓట్ల సంఖ్య మధ్య అంతరం... సంబంధిత విషయాలపై సమాచారాన్ని సకాలంలో వెల్లడించలేదు. వెల్లడింపులో ఉద్దేశపూర్వకంగా జాప్యం చేశారు.

మరింత ఘోరమైన విషయమేమిటంటే జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఏర్పాటైన ఉన్నతస్థాయి కమిటీ ముందు లోక్‌సభకు, అన్ని శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఈసీఐ తన సంసిద్ధత ఉద్ఘాటించింది. మరి మీ ఆధ్వర్యంలో ఉన్న ఈసీఐ, గత ఏడాది నాలుగు రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడంలో ఎందుకు విఫలమయింది రాజీవ్ కుమార్ గారూ? మొత్తం మీద రాజీవ్ కుమార్ నేతృత్వంలో ఈసీఐ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. లోక్‌నీతి–సిఎస్‌డిఎస్ సర్వేలు ఈ వాస్తవాన్ని ధ్రువీకరించాయి.

మరి భారత ఎన్నికల సంఘం పూర్తిగా దిగజారిపోయిందా? విచక్షణారహితంగా పాలకపక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తోందా? అదృష్టవశాత్తు అటువంటి దుర్దశ ఇంకా దాపురించలేదు. 2007–16 సంవత్సరాల మధ్య వ్లాదిమిర్ వై చురోవ్ సారథ్యంలో రష్యా కేంద్ర ఎన్నికల సంఘం దిగజారినస్థితికి మన ఎన్నికల సంఘం ఇంకా పతనమవలేదు. పుతిన్‌కు చురోవ్ బహిరంగంగా విధేయత ప్రదర్శించిన తీరులో మన సీఈసీ ఇంకా భారత ప్రధానమంత్రికి బహిరంగంగా తన విధేయతను చాటుకోలేదు. రష్యాలో వలే మన దేశంలో ప్రతిపక్షాలు, వాటి అభ్యర్థులను ఎన్నికలలో పోటీ చేసేందుకు అనర్హులుగా ప్రకటించడం జరగడం లేదు. పాకిస్థాన్‌లో వలే ఓట్ల లెక్కింపును నిలిపివేయడం జరగడం లేదు. ఫలితాలను తారుమారు చేయడం జరగడం లేదు. పాలక పక్షానికి అనుకూలంగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ ఒక మినహాయింపుగా మాత్రమే ఉందిగానీ ఒక సాధారణ ఆచరణ కాలేదు. ఎన్నికలలో మోసాలను ప్రజలు సహించరనే ఎరుక బాగా ఉన్నందున నిబంధనలను తప్పనిసరిగా పాటించడం ఎన్నికల అధికారులకు అనివార్యమవుతోంది.

మన ప్రజాస్వామ్యం ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతోంది. ఈ పరిస్థితుల్లో మరొక రాజీవ్ కుమార్ ఎన్నికల సంఘం ప్రధానాధికారి కావడం శ్రేయస్కరం కాదు. అటువంటి సీఈసీతో మన ప్రజాస్వామ్యానికి ఎంత చేటు జరగాలో అంత చేటు సంభవిస్తుంది. ఈ వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకుని సర్వోన్నత న్యాయస్థానం తదుపరి సీఈసీని ప్రభుత్వ ప్రాబల్యమున్న కమిటీ నిర్ణయం ద్వారా నియమించేందుకు మోదీ సర్కార్‌ను అనుమతించడమో లేక గతంలో తాను జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం ఒక స్వతంత్ర ప్రక్రియ ద్వారా నియమించి తీరాలని నిర్దేశించడమో చేయాలి. సుప్రీంకోర్టు నిర్ణయంపైనే మన రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్యం భవిష్యత్తు ఆధారపడి ఉన్నది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

వర్సిటీల ప్రమాణాల్ని దిగజార్చే నిర్ణయాలు

ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు మానవవనరుల అభివృద్ధిలో కీలకభూమిక పోషించవలసిన అవసరం ఉంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఉన్నత విద్యారంగం అధోగతి పాలైన సంగతి ప్రజానీకానికి తెలిసిందే. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఉన్నత విద్యారంగం పటిష్టంగా అవతరిస్తుందని మొత్తంగా మేధోవర్గం ఆశించింది. అయితే నూతన విద్యావిధానంతో వచ్చిన సంస్కరణలు గందరగోళం సృష్టించగా, యూజీసీ మార్గదర్శకాలు–2025 మరింత వివాదాస్పదంగా మారాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు కూడా అధ్యాపక, ఉద్యోగ వర్గాల్లో, విద్యార్థి సంఘాల్లో గుబులు రేకెత్తిస్తున్నాయి.

రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లోని సీనియర్ ఆచార్యుల్ని పక్కనబెట్టి సాంప్రదాయ విశ్వవిద్యాలయాలకు ఐఐటీల నుంచి, ఎన్ఐటీల నుంచి ఉపకులపతుల్ని నియమించే దిశగా సెర్చ్ కమిటీల సిఫారసులు జరుగుతుండటం దిగ్భ్రాంతికరం. సాంకేతిక నిపుణుల్ని ఉపకులపతులుగా తీసుకొచ్చే ప్రయత్నంలో ప్రభుత్వం తలమునకలు కావడం రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఆచార్యుల్ని ఆందోళనకు గురిచేస్తున్నది. సామాజిక శాస్త్రాలు, భాషా సాహిత్యాలు, చిత్రకళలు, ప్రదర్శనకళలు, న్యాయశాస్త్రం, విద్యాబోధన కళాశాలలు, కామర్స్, మేనేజ్‌మెంట్, పరిశోధన కేంద్రాలు, దూరవిద్య కేంద్రాలు, క్రీడలు, వ్యాయమవిద్య విభాగాలు వంటి సమస్త మానవశాస్త్రాలు గల రాష్ట్ర విశ్వవిద్యాలయాల విషయంలో ప్రభుత్వ తీసుకుంటున్న ఈ నిర్ణయం సరైనది కాదు. రాష్ట్ర విశ్వవిద్యాలయాల్ని ప్రక్షాళన చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు ఐఐటీ, ఎన్ఐటీ ఆచార్యుల్ని ఉపకులపతులుగా నియమించడం ఒక్కటే పరిష్కారం కాదు. విశ్వవిద్యాలయాలు అంటే కేవలం ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రమే కాదు, ఇక్కడ సకల శాస్త్రాలు వుంటాయి.



> రాష్ట్ర విశ్వవిద్యాలయాల్ని ప్రక్షాళన చేయాలనే ప్రభుత్వ ఆలోచనకు ఐఐటీ, ఎన్ఐటీ ఆచార్యుల్ని ఉపకులపతులుగా నియమించడం ఒక్కటే పరిష్కారం కాదు. విశ్వవిద్యాలయాలు అంటే కేవలం ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రమే కాదు, ఇక్కడ సకలశాస్త్రాలు వుంటాయి.

వీటికి తోడు రాష్ట్ర విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించే యూజీసీ – 2025 ముసాయిదా పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధమైన ఈ నిర్ణయం రాష్ట్ర విశ్వవిద్యాలయాల మీద జరుగుతున్న పెద్ద కుట్రగా మేధోవర్గం పేర్కొంటుంది. యూజీసీ మార్గదర్శకాలు–2025తో విశ్వవిద్యాలయాల్లో నియామకాలు, పదోన్నతుల్లో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. జాతీయ విద్యావిధానం సిఫార్సు మేరకు కాలానుగుణంగా ఉన్నతవిద్యలో సంస్కరణలు చేపట్టాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. అయితే రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక సిబ్బంది కొరత తీవ్రలోటుగా వుంది. దేశ ఉజ్వల భవిత కోసం ప్రతిభ గల అధ్యాపకుల్ని నియమించి యువతను తీర్చిదిద్దాలని యూజీసీ సిఫార్సు చేసింది. ఇందుకు రాష్ట్ర విశ్వవిద్యాలయాలు చొరవ తీసుకోలేకపోతున్నాయి. 2008 నుంచి ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాలకు 2017లో చంద్రబాబునాయుడు నాయకత్వంలోని అప్పటి ప్రభుత్వం రెండు ప్రకటనలు ఇచ్చి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించింది. ఇవి న్యాయస్థానాల్లో కేసుల కారణంగా భర్తీ చేయలేకపోయింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2024 ఎన్నికలకు ఆరు నెలల ముందు అస్తవ్యస్తంగా ఒక ప్రకటన విడుదల చేసి నిరుద్యోగుల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొట్టి దుకాణం బంద్ చేసింది. చెదురుమదురుగా ప్రత్యామ్నాయదారుల్లో అక్కడక్కడా వచ్చిన ఏక సంఖ్య అధ్యాపకులు మినహా సుమారు పదిహేడేళ్ళ నుంచి ఏపీ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక ఉద్యోగాల భర్తీ జరగలేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ఆలోచన చేయకుండా పదిమంది చేసే పనిని ఒక్కరి మీదకే నెట్టి, విశ్వవిద్యాలయాలు ర్యాంకులు సాధించాలంటే సాధ్యం కాదు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ టు బి యూనివర్శిటీల నుంచి ఆచార్యులను రాష్ట్ర విశ్వవిద్యాలయాల నియామకాల సెర్చ్ కమిటీల్లో సభ్యులుగా నియమించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఆచార్యులు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు సెర్చ్ కమిటీ సభ్యులుగా వుండి ఉపకులపతుల్ని ఎంపిక చేస్తారా! ఇదేమి వింత సంప్రదాయం! ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులే ఎక్కువశాతం మంది ప్రవేశిస్తున్నారు. వీరిలో తెలుగు మీడియం విద్యార్థులే అధికశాతం మంది ఉన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్నవారి శాతమే ఎక్కువ. వీరు ఉపకారవేతనాలతో చదువులు కొనసాగిస్తున్నారు. యూజీసీ, ఇతర ఫండింగ్ ఏజెన్సీల స్కాలర్‌షిప్పులు, ఫెలోషిప్‌లతో చదువులు, పరిశోధనలు కొనసాగించేవారి సంఖ్య నామమాత్రమే. అంతేగాకుండా రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వాలు సమకూర్చే మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమే. ఇన్ని అడ్డంకులను అధిగమించి ఏపీ విశ్వవిద్యాలయాల్ని ప్రగతిపథంలో నడిపించాలంటే ప్రభుత్వం మేధావుల సూచనలను పరిగణలోకి తీసుకొని అమలు చేయాలి. అప్పుడే ప్రజలూ, ప్రభుత్వ ఆకాంక్షలు నెరవేరుతాయి.

• డాక్టర్ జీకేడీ ప్రసాదరావు
ఫ్యాకల్టీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఆంధ్ర విశ్వవిద్యాలయం

విరసం సాహిత్య పాఠశాల!

ఇటీవలే మనకు దూరమైన ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబా తన జీవితంతో, మరణంతో రగిలించిన ఉత్తేజమూ, సమాజంపైకి సంధించిన చురుకైన ప్రశ్నలూ ఒక కొత్త సందర్భాన్ని మన ముందుకు తీసుకొచ్చాయి. సంకెళ్లలోనే స్వేచ్ఛాగానం చేయడం, చీకటిలో వెలుగును కలగనడం, అణచివేస్తే విముక్తిని ప్రకటించుకోవడం, అంతిమంగా మృత్యువులో కూడా చావును నిరాకరించడం అనేవి ఇంకెంత మాత్రం రొమాంటిక్ వ్యక్తీకరణలు కాదని ఆయన నిరూపించారు.

సాయిబాబా సందర్భంలో సాహిత్యకారుల పాత్ర గురించి మాట్లాడుకోవడమంటే ఇదేదో విప్లవ సాహిత్యోద్యమం సొంత గొడవ వెళ్లబోసుకోవడం కాదు. సాహిత్యం నిర్వహించే పాత్రను, సాహిత్యకారుల సామాజిక ఆచరణను మరోసారి మాట్లాడుకోవడమే. ఫాసిజం సాహిత్య కళా మేధో రంగాల ముందుకు తీసుకొచ్చిన అనేక సంక్లిష్ట సవాళ్లను చూడాలి. ఫాసిస్టు వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకుపోవడానికి వాటితో సవ్యంగా వ్యవహరించాలి.

సమస్త కళా సాహిత్యాల ప్రాథమిక షరతు మనుషుల్నీ, సమాజాన్నీ సెన్సిటైజ్ చేయడమే. దానితో పాటు రచయితలు, బుద్ధిజీవులు వ్యక్తులుగా, ఒక సమూహంగా ప్రజా జీవితంలో ఎక్కడ నిలబడతారు? తమ విలువలతో, ఆచరణతో సంక్షుభిత సమాజంలో ఏ వైఖరులు తీసుకుంటారు? అనేవి అంతకంటే ముఖ్యం. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం బలపడుతున్న ఈ సంక్షోభ కాలంలో రచయితలు, కళాకారులు, బుద్ధిజీవులు తమ సామాజిక, రాజకీయ ఆచరణను తాజాగా పునర్నిర్వచించుకోవాలి. రాజకీయార్థిక, సాంస్కృతిక, సైనిక, నైతిక తలాల్లో కార్పొరేట్ల కోసం, హిందుత్వ రాష్ట్ర కోసం ఫాసిస్టులు చేస్తున్న విధ్వంసానికి వ్యతిరేకంగా సాహిత్య కళా మేధో రంగాల నుంచి ప్రజలను కూడగట్టవలసి ఉన్నది. ముఖ్యంగా మెజారిటీ మత ప్రజలపై ఫాసిస్టు భావజాల ప్రభావం తీవ్రమవుతున్న సమయంలో గెలుచుకోవాల్సిన ప్రజా సమూహాలు పెరిగిపోతున్నాయి. హేతుబద్ధ వాదనతో గతాన్ని సరికొత్తగా చూసి, ప్రగతిదాయకమైన భవిష్యత్తు మీద ఆశ పెంచవలసి ఉన్నది. దీనికి రచన, పరిశోధన అనే ముఖ్యమైన ఆచరణ రూపాలతోపాటు రాజకీయ, సామాజిక ఆచరణను రచయితలు నిర్భీతిగా, మరింత నిబద్ధతతో ఎంచుకోవాల్సి ఉన్నది. రచన వ్యక్తిగత అనుభవాలను దాటి సంక్షుభిత సామాజిక అనుభవంలోకి, గతాన్ని అధిగమించి భవిష్యత్ దార్శనికతలోకి, సకల మానవ ఉద్వేగాల సారమైన చారిత్రక వాస్తవికతలోకి చేరుకోడానికి రచయితలు, బుద్ధిజీవులు వీలైనన్ని ఆచరణ రూపాలను ఎన్నుకోవలసి ఉన్నది. సామాజిక చైతన్య ప్రతిఫలనంగానేగాక ఈ సంక్షోభ మూలాలను ఎత్తిచూపుతూ, పరిష్కారానికి ఉన్న అవకాశాలను సాహిత్యంలోకి తీసుకరావాలి. రచన చేయడంతో పాటు సమాజాన్ని కాపు కాయాల్సిన బాధ్యత సాహిత్యకారులదే.

ఫాదర్ స్టాన్‌స్వామి, నర్మద, ప్రొ. సాయిబాబ ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో అద్భుతమైన నమూనాలను అందించి వెళ్లిపోయారు. ఇంకా వేల మంది ప్రజలు హిందుత్వ ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో ప్రాణత్యాగాలు చేశారు. జైళ్లలో మగ్గుతున్నారు. అక్రమ కేసులను ఎదుర్కొంటున్నారు. ఫాసిస్టు వ్యతిరేకంగా రచన, ప్రసంగం, ప్రచురణ, ప్రచారం చేసి ఎందరో నిత్యం బెదిరింపులను అనుభవిస్తున్నారు. ఈ ఫాసిస్టు అణచివేతకు, దోపిడీకి, కుట్రలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలుగు సాహిత్య, మేధోరంగాలను మరింత సమాయత్తం చేయమని, మిలిటెన్సీ పెంచమని సాయిబాబ స్ఫూర్తి మనందరినీ ప్రేరేపిస్తున్నది. అందులో భాగంగానే విరసం నిర్వహిస్తున్న సాహిత్య పాఠశాల ఫిబ్రవరి 8, 9 తేదీల్లో కర్నూలులో జరుగుతున్నది.

– అరసవిల్లి కృష్ణ


వారిని కాదనుకుంటే కష్టమే!

కల్తీ లేని పాలు కావాలనుకునేవాళ్లు గేదెలను పెంచేవారి నుంచి నేరుగా కొంటూ ఉంటారు. అమెరికాలోనూ గేదెలను పెంచే డెయిరీ ఫార్మ్ వద్దకు వెళ్లి తెచ్చుకోవచ్చు. ఇక్కడ మొన్నమొన్నటిదాకా ఒక గ్యాలను (మూడున్నర లీటర్లకంటె కాస్త ఎక్కువ) పాల ధర 8–9 డాలర్లు ఉండేది. తరువాత, అది 15 డాలర్లు అయింది. మరువారానికి 18 డాలర్లకు చేరుకుంది. హఠాత్తుగా ధర రెట్టింపు అయిందేమిటని కుతూహలం కొద్దీ అతడిని అడిగాను. 'ఇప్పుడు వాళ్ల పనికి రావడం లేదు. స్థానికులతోనే చేయించాల్సి వస్తోంది' అన్నాడు. 'వాళ్లు' అంటే– ట్రంప్ ప్రభుత్వం ఎవరినైతే 'డిపోర్ట్' చేసేస్తున్నదో వాళ్లన్నమాట. 'స్థానికులు' అంటే అమెరికన్లే!. అక్రమ వలసదారులందరినీ 'డిపోర్ట్' చేయడం.. అమెరికాను ఖాళీ చేయించడం అనే మాటలు ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కానీ, ఆ నిర్ణయం పర్యవసానాలు అమెరికాలోని ప్రజాజీవితం మీద భవిష్యత్తులో ఎలాంటి ప్రభావం చూపిస్తాయో అర్థం చేసుకోవడానికి ఇది చిన్న ఉదాహరణ.

'అక్రమ వలసదారులు' అనే పదం ద్వారా వారి గురించి దురభిప్రాయాన్ని సృష్టించడం చాలా సులువు. కానీ అమెరికన్ శ్రామిక వ్యవస్థలో అట్టడుగు స్థాయిలో ఉన్న వీరిని ఆ స్థానంనుంచి తొలగించడమంటే ఏకంగా ఆ వ్యవస్థను కుప్పకూల్చేయడమే. ఇందుకు అమెరికా అనేక రకాల విపరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది. ఉత్పాదనల ధరలు అమాంతం పెరిగి, అంతిమంగా అమెరికన్లలో అసహనానికి దారితీయవచ్చు. అమెరికాలో చిన్నచిన్న ఉద్యోగాల్లో ఇలాంటివారే ఉంటారు. కెనడా, మెక్సికో తదితర ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం సరిహద్దు దాటి పెద్దసంఖ్యలో వచ్చేస్తుంటారు. ఆ రెండు దేశాలు మాత్రమే కాదు. మెక్సికోలోకి సులువుగా ప్రవేశించగల భూమార్గాలు ఉన్న గ్వాటిమాలా, ఎల్ సాల్వడార్ తదితర దక్షిణ అమెరికా దేశాలకు చెందినవారు కూడా తొలుత మెక్సికోలోకి, తర్వాత మంచి అవకాశం చూసుకుని అమెరికాలోకి నడుచుకుంటూ వచ్చేస్తుంటారు. ఈ అక్రమ వలసదారులనే కేటగిరీలో భారతీయులు కూడా అత్యధికంగానే ఉన్నారు. పంజాబ్, గుజరాత్‌లకు చెందిన అనేకమంది తొలుత మెక్సికోకు వెళ్లి అక్కడి నుంచి అమెరికాలోకి వస్తారు. తర్వాతి స్థానం తెలుగువారిదే. తనిఖీల కన్నుగప్పగల తెలివితేటలు, చాకచక్యం ఉన్నవారు నేరుగా వచ్చేయగలరు. మెక్సికోలో సరిహద్దు దాటించి అమెరికాలోకి పంపడానికి కొన్ని ముఠాలు కూడా పనిచేస్తుంటాయి.

వీళ్లందరూ పొట్ట చేతబట్టుకుని కడుపుకూటి కోసం తరలివచ్చేవాళ్లు. పిల్లాపాపలతో వందల కిలోమీటర్లు వచ్చేస్తారు. బెదిరించిన వారికి తృణమో పణమో సమర్పించుకుని వస్తారు, గుట్టుచప్పుడు కాని బతుకులే బతుకుతూ ఉంటారు. వ్యవసాయ పనుల్లో, డెయిరీ ఫార్మ్‌లలో, భవన నిర్మాణ కార్మికులుగా, ఆతిథ్య, సేవారంగాల్లో అతి తక్కువ కూలికి వీరు పనిచేస్తుంటారు. ల్యాండ్ స్కేపింగ్, రవాణా, వేర్ హౌసింగ్, చైల్డ్ కేర్, ఇంటి పనులు వంటి వాటిల్లో కూడా వీరి సేవలు అధికం. ఈ రంగాలన్నీ మానవ వనరులు విస్తృతంగా అవసరమయ్యేవి.

> భారతీయ విద్యార్థులను తక్షణం వెనక్కు పంపాలనేంత దుర్మార్గమైన పోకడలు ప్రస్తుతానికైతే ఇక్కడ ఏమీ కనిపించడం లేదు. అక్రమంగా ఉంటున్నవారి మీదనే ఐస్ (ఐసీఈ– ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) దృష్టి ఉంటోంది. అమెరికా నుంచి అక్రమ వలసదారుల్ని డీపోర్ట్ చేయడం ఇప్పుడు కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. ఐస్ నిరంతరాయంగా అదే పనిమీద ఉంటుంది. కాకపోతే, ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొంచెం ఉధృతంగా జరుగుతోంది.



ఇవి తరచూ కూలీల కొరతతో ఇబ్బంది పడుతుంటాయి. ఈ రంగాలు స్థిరంగా కొనసాగడంలో ఈ అన్ డాక్యుమెంటెడ్ లాటినో వర్కర్స్‌గా పరిగణనలో ఉండేవారి భాగస్వామ్యమే ఎక్కువ.

దాదాపు 90 శాతం హోటళ్లలో, ఇతరత్రా తక్కువ వేతనాలు ఇవ్వజూపే వృత్తుల్లో వీరే ఉంటారు. గంటల వంతున చెల్లించే వేతనాలను తక్కువ మొత్తాల్లో ఇస్తూ, వీరి నుంచి నాణ్యమైన పనిని పొందడం ఆయా వ్యాపారాల యజమానులకు సాధ్యమవుతుంది. వేతనాలకు సంబంధించి వారి నుంచి అతిగా డిమాండ్లు ఉండవు. అలాగే ఒళ్ళు దాచుకోకుండా శ్రద్ధగా పనిచేస్తారని పేరుంది. అలాగే అన్ని రకాల చిల్లర పనులు చేస్తూ, నిత్యం అందుబాటులో ఉండే వారిని అమెరికాలో 'హ్యాండీ మెన్' అని వ్యవహరిస్తారు. వీరు ఎలక్ట్రికల్, ప్లంబింగ్, గార్డెనింగ్, క్లీనింగ్ తదితర సకల డొమెస్టిక్ పనులకు గంటల వారీ వేతనానికి అందుబాటులో ఉంటారు. ఈ హ్యాండీ మెన్‌లుగా పనులు చేసేవాళ్లలో అత్యధికులు ఈ వర్గానికి చెందినవారే. వారిని దేశం నుంచి పూర్తిగా తుడిచిపెట్టడం అంటూ జరిగితే అమెరికాలో చిరు వ్యాపారాలు, వ్యవసాయ రంగాల రూపురేఖలు మారిపోతాయి. వారి స్థానంలో అమెరికన్లనే నియమించుకోవాల్సి వస్తే, ప్రతి పనికీ ఆ వ్యాపార యజమాని గతంలో ఇస్తున్న వేతనం కంటే కనీసం రెట్టింపు చెల్లించాల్సి వస్తుంది. దీని ప్రభావం ఉత్పత్తుల ధరల మీద పడుతుంది. అంతిమంగా నష్టం జరిగేది అమెరికన్ పౌరులకే. అమెరికాలోని సెంటర్ ఫర్ అమెరికన్ ప్రోగ్రెస్ ఎస్టిమేట్స్ వారి నివేదిక ప్రకారం ఈ ఇమిగ్రెంట్స్ అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఏటా వందల బిలియన్ల డాలర్ల ఆదాయం సమకూరుస్తుంటారు. వారు చెల్లించే వివిధ రకాల పన్నులే కాదు, వీరిలో కొందరు సొంతంగా చిరువ్యాపారాలు కూడా ప్రారంభించి ఆర్థిక వృద్ధిలో భాగం అవుతుంటారు.

నేరచరిత్ర ఉన్నవారిని వెనక్కు పంపడాన్ని ఎవ్వరూ కాదనరు. కానీ స్వస్థలాలను, సొంత మనుషుల్ని వదులుకుని.. ఇక్కడ బతుకు తెరువు కోసం వచ్చిన అందరిమీద సమానంగా కక్ష కట్టడం విజ్ఞత కాదు. డెమోక్రాట్ల నుంచి మాత్రమే కాకుండా.. వీరి సేవలను వాడుకుంటున్న చిరు వ్యాపారులు, వ్యవసాయదారులు, పారిశ్రామికవేత్తలు, ఉత్పాదక వర్గాల నుంచి కూడా ట్రంప్ నిర్ణయం పట్ల వ్యతిరేకత వెల్లువెత్తే అవకాశం ఉంది. ట్రంప్, విశాల దృక్పథంతో అమెరికన్ల జీవితాలపై పడే భారాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని, తన నిర్ణయాలను సమీక్షించుకోవాలి.

డీపోర్టేషన్ జరుగుతున్న సమయంలో భారత్‌లో తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసే అనేక అర్థంపర్థంలేని సోషల్ మీడియా ప్రచారాలు వెల్లువెత్తుతున్నాయి. భారతీయ విద్యార్థులను తక్షణం వెనక్కు పంపాలనేంత దుర్మార్గమైన పోకడలు ప్రస్తుతానికైతే ఇక్కడ ఏమీ కనిపించడం లేదు. అక్రమంగా ఉంటున్నవారి మీదనే ఐస్ (ఐసీఈ– ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్) దృష్టి ఉంటోంది. అమెరికా నుంచి అక్రమ వలసదారుల్ని డీపోర్ట్ చేయడం ఇప్పుడు కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. ఐస్ నిరంతరాయంగా అదే పనిమీద ఉంటుంది. కాకపోతే, ఇప్పుడు ట్రంప్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొంచెం ఉధృతంగా జరుగుతోంది.

■ కృష్ణమోహన్ దాసరి
జర్నలిస్ట్, డల్లాస్

క్రెబ్స్ నుంచి వచ్చిన రసాయనాలే..

- కంపెనీ లాగ్ రిజిస్టర్‌లో నమోదైన ట్యాంకర్ నెంబర్
- రికార్డులను పరిశీలించిన వైజాగ్ పీసీబీ అధికారులు
- ఘటనపై పీసీబీ ఉన్నతాధికారుల సీరియస్
- ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం



(ఆంధ్రజ్యోతి-విజయవాడ): జక్కంపూడి శివారులోని ఖాళీ స్థలాల్లో పారబోసిన రసాయన వ్యర్థాల మూలలను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కనుగొన్నారు. ట్యాంకర్ డ్రైవర్ వద్ద లభించిన కాగితాల్లో ఉన్నట్టుగానే విశాఖ జిల్లాలోని క్రెబ్స్ బయోటెక్ కంపెనీ నుంచి ఈ వ్యర్థాలు నగరానికి వచ్చినట్టు గుర్తించారు. ట్యాంకర్ లారీ ఏపీ02 టీటీ 6606 నెంబరుతో, ట్యాంకర్‌పై మాత్రం యజమాని కె.రమణారెడ్డి అని, రిజిస్ట్రేషన్ నెంబరు ఏపీ21 టీవై 3499 అని ఉన్న విషయం తెలిసిందే. ఈ సమాచారాన్ని జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు విశాఖ జిల్లా అధికారులకు పంపారు. వారు క్రెబ్స్ కంపెనీలో రికార్డులను పరిశీలించగా, ఈ లారీ ట్యాంకర్ అక్కడి నుంచి వ్యర్థాలతో బయల్దేరినట్టు స్పష్టంగా ఉంది. ఇదే విషయాన్ని అధికారులు పీసీబీ ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీనిపై విజయవాడలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వ్యర్థాలను పారబోసిన విషయాన్ని తీవ్రంగా పరిగణించి అసలు దోషులను బయటకు లాగాలని అధికారులు ఆదేశించారు.

ఆన్‌లైన్‌లో ఎందుకు నమోదు కాలేదు?

కర్మాగారాన్ని ఏర్పాటు చేసినప్పుడు సంబంధిత వ్యక్తులు కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతి తీసుకోవాలి. ఈ కర్మాగారం నుంచి ఏ స్థాయిలో వ్యర్థాలు విడుదలవుతాయో పీసీబీకి తెలియజేయాలి. దీన్నే మాస్ బ్యాలెన్స్‌గా వ్యవహరిస్తారు. కర్మాగారంలో ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత విడుదలయ్యే వ్యర్థాలు ఎంత పరిమాణంలో మిగతా 6లో..

కనకదుర్గమ్మకు రూ. 2.28 కోట్ల కానుకలు

16 రోజులకు హుండీల లెక్కింపు పూర్తి 6లో

కబ్జాలపై కదలిక

- ఇరిగేషన్ భూముల్లో హెచ్చరిక బోర్డులు
- డ్రోన్లతో టౌన్‌ప్లానింగ్ అధికారుల సర్వే
- కార్పొరేషన్‌కు ఇరిగేషన్ లేఖ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్ 8లో

కమనీయం.. సుబ్బారాయుడి తెప్పోత్సవం

కొత్త దారిలో..

ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చే యోచనలు

- ఈస్ట్ బైపాస్ రద్దు కొరత తీర్చడం కోసమే..
- కాజ-చోడవరం.. కేసరపల్లి వరకు మొదటి పనులు
- కేసరపల్లి నుంచి విజయవాడ వెస్ట్ బైపాస్‌లోకి..
- అమరావతి ప్రధాన రహదారులకూ సమ్మిళితం
- ఇబ్రహీంపట్నం రింగ్ నుంచి కొండపల్లి దిగువన వెస్ట్ బైపాస్‌కు అనుసంధానం
- చోడవరం వద్ద డ్యామ్ తరహా బ్రిడ్జి ప్రతిపాదన
- తాజా ఆలోచనలతో ఖర్చు తగ్గే అవకాశం
- ప్రజల డిమాండ్లతో అధికారుల్లో కొత్త ఆలోచనలు



ప్రతిపాదిత ఇన్నర్ రింగ్ రోడ్డు

ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణం విషయంలో కొత్త ఆలోచనలు, సరికొత్త ప్రతిపాదనలు వస్తున్నాయి. విజయవాడ ఈస్ట్ బైపాస్ రద్దయిన నేపథ్యంలో ఈ రింగ్‌రోడ్డును మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. పాత అలైన్‌మెంట్ విషయంలో అనేక సవరింపులు చేయాలన్న వాదనలు వినిపిస్తుండగా, సీఆర్‌డీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా సహేతుకమైనవని భావిస్తూ ముందడుగులు వేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ నగరంలో 14 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. నగరం మూడుదిక్కులా 30 కిలోమీటర్లలోపు శివారు ప్రాంతాలన్నీ విజయవాడతో సమానంగా అభివృద్ధి చెందుతూ విస్తరిస్తున్నాయి. మొదట్లో నగరం నుంచి బయటకు వెళ్లాలంటే.. కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ మాత్రమే దిక్కుగా ఉండేది. నగర విస్తరణతో కనకదుర్గ వారధి నిర్మించారు. మిగతా 6లో..

చోడవరం వద్ద డ్యామ్ ఆలోచన

చోడవరం వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మించాలన్నది ఎప్పటినుంచో ఉన్న ప్రతిపాదన. కానీ, కార్యరూపం దాల్చలేదు. విజయవాడ ఈస్ట్ బైపాస్ రద్దు కావటంతో ఇన్నర్ రింగ్‌రోడ్డు వంతెన చోడవరం వద్ద కృష్ణానదిపై నిర్మించాలి. దీంతో అక్కడ వంతెన కంటే డ్యామ్ తరహాలో బ్రిడ్జిని నిర్మించటం సముచితమనే విజ్ఞప్తులు వస్తున్నాయి. ఈ అంశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. చోడవరం వద్ద సాధరణ వంతెనను నిర్మించి, మళ్లీ ఇక్కడ బ్రిడ్జిని నిర్మించటం కంటే రెంటినీ ఒకటిగా నిర్మిస్తేనే ఖర్చు తగ్గుతుందన్న ఆలోచన ప్రభుత్వం చేస్తోంది. ఈ ఆలోచన కారణంగా చోడవరం దగ్గర డ్యామ్ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ డ్యామ్ ఏర్పాటు చేస్తే ప్రకాశం బ్యారేజీ నుంచి చోడవరం వరకు కృష్ణానదిలో నిండుగా నీరు నిల్వ ఉంచుకునే అవకాశం కలుగుతుంది. పద్మావతి ఘాట్ నుంచి యనమలకుదురు వరకు కృష్ణానది రిటైనింగ్ వాల్ ఉంది. కాబట్టి విజయవాడ నగరానికి వరద సమస్య కూడా ఉండదు.

ఈవోగా ఐఏఎస్?

దుర్గగుడికి మళ్లీ నియమించే యోచనలో ప్రభుత్వం

- గతంలో టీడీపీ హయాంలో ఐఏఎస్ అధికారి సూర్యకుమారి ఈవోగా నియామకం
- వైసీపీ హయాంలో ఆ నిర్ణయాలు వెనక్కి.
- మళ్లీ తెరపైకి వస్తున్న ఊహాగానాలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి కార్యనిర్వహణాధికారి (ఈవో)గా మరోసారి ఐఏఎస్ అధికారిని నియమిస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఎక్కువమంది భక్తులు దర్శించుకునే రెండో పెద్ద దేవాలయం దుర్గగుడి. ఈ ఆలయానికి గతంలో దేవదాయ శాఖలో కమిషనర్ తరువాత హోదా కలిగిన వారిని ఈవోలుగా నియమిస్తూ వచ్చారు. ఒక్కోసారి డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవో స్థాయి రెవెన్యూ అధికారులను కూడా నియమించారు.

గతంలో టీడీపీ హయాంలో..: 2014లో ఉమ్మడి రాష్ట్రం నుంచి విడిపోయి నవ్యాంధ్రలో అమరావతి రాజధానిగా ప్రకటించాక దుర్గగుడికి ప్రాధాన్యం పెరుగుతూ వచ్చింది. గతం కంటే కూడా భక్తులు, వీవీఐపీలు, వీఐపీల రాక కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో దుర్గగుడిని మరింత అభివృద్ధి చేయడం కోసం టీడీపీ ప్రభుత్వం ఐఏఎస్‌లను ఈవోగా నియమించాలని తలపెట్టింది. అప్పటి బ్రాహ్మణ కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన మొవ్వ పద్మను తొలిసారిగా దుర్గగుడికి ఈవోగా నియమించారు. ఆ తరువాత ఆమె ఇన్‌చార్జి కమిషనర్‌గా కూడా పనిచేశారు. ఆ తరువాత ఇన్‌చార్జి ఈవోగా అనురాధను మిగతా 6లో..

ఉల్లంఘనలకు క్వారీలే సాక్ష్యాలు



- నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు
- సహకరించిన అధికారులు
- ప్రభుత్వ క్వారీల్లో ముగిసిన గడువు
- ఇక తెరచుకోనున్న ప్రైవేటు క్వారీలు
- సర్వేచేసి హద్దులు వేసిన అధికారులు

8లో



8లో

అల కృష్ణాతీరాన

పశ్చిమ కృష్ణా తీరం..టెంపుల్ టూరిజానికి అనుకూలం

- జగ్గయ్యపేట నుంచి ముక్త్యాల.. పరిటాల వరకు పుణ్యక్షేత్రాలు
- ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ప్రజల ఆకాంక్ష

6లో

అల.. కృష్ణాతీరాన

ఆధ్యాత్మిక కేంద్రాలకు ఆరామం.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు నెలవైన పవిత్ర కృష్ణానదీ తీరం వెంబడి ఎన్నో ప్రముఖ దేవాలయాలు ఉన్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలున్న జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదనలు ఎప్పటి నుంచో ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఈ ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ కృష్ణా తీరప్రాంతాన్ని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయడానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. -కంచికచర్ల - ఆంధ్రజ్యోతి

పశ్చిమ కృష్ణా తీరం..టెంపుల్ టూరిజానికి అనుకూలం

- జగ్గయ్యపేట నుంచి ముక్త్యాల మీదుగా పరిటాల వరకు పుణ్యక్షేత్రాలు
- ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ప్రజల ఆకాంక్ష



ముక్త్యాల వద్ద ఉత్తర, తూర్పు దిక్కుల్లో ప్రవహిస్తున్న కృష్ణానది

పవిత్ర కృష్ణానది ఉత్తర వాహిని ముక్త్యాల క్షేత్రం

పడమటి కనుమల్లో పుట్టిన కృష్ణమ్మ తూర్పుగా ప్రవహిస్తూ జగ్గయ్యపేట మండలం ముక్త్యాల దగ్గర ఉత్తర దిశగా మరలి మరలా తూర్పుగా ప్రవహిస్తుండటంతో ఈ క్షేత్రం ప్రత్యేకత సంతరించుకుంది. ఈ ఉత్తర వాహినిలో స్నానమాచరిస్తే కాశీలో స్నానమాచరించిన పుణ్యఫలం దక్కుతుందన్నది పురాణగాథ. ఈ క్షేత్రంలో రెండు భవాని ముక్తేశ్వరస్వామి దేవాలయాలు ఉన్నాయి. కృష్ణానది గర్భంలో ఒకటి. గ్రామంలో మరొకటి ఉన్నాయి. కృష్ణానదిలోని దేవాలయం ఆరు మాసాలు నీటిలో మునిగి ఉంటుంది. ఆ సమయంలో దేవతలు అక్కడ పూజలు చేస్తారని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్షేత్రాన్ని త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు, బ్రహ్మరుషి వశిష్ఠుడు సందర్శించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది. భరద్వాజ మహారుషి ఈ క్షేత్రంలో పూజలు నిర్వహించి కృష్ణానది ఆవలి ఒడ్డు గుంటూరు జిల్లాలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారని ప్రతీతి. ముక్త్యాల క్షేత్రాన్ని గురించి, క్షేత్ర ప్రాశస్త్యం గురించి బ్రహ్మాండ పురాణంలో భీమసేన జాతకం, నెరవణి జాతకం, నాగార్జునుడు రచించిన రసరత్నాకరం అనే గ్రంథాల్లో లిఖించబడి ఉంది. ఈ క్షేత్రంలో భవానీ ముక్తేశ్వరస్వామి స్ఫటిక లింగాకారంలో భక్తులకు దర్శనమిస్తుంటారు. కోరిన కోర్కెలు తీరుస్తుంటాడని ప్రతీతి. ఇక్కడి నుంచి బయలుదేరే కృష్ణమ్మ దిగువన సముద్రంలో కలుస్తుంది.

కోటిలింగ హరిహర మహాక్షేత్రం



ముక్త్యాల వద్ద కోటి లింగాల క్షేత్రం

ముక్త్యాల క్షేత్రంలో 2006లో కంచికచర్ల మాజీ సర్పంచ్ స్వర్గీయ గద్దె ప్రసాద్-పావని దంపతుల ఆధ్వర్యంలో కోటిలింగ హరిహర మహాక్షేత్రాన్ని నిర్మించారు. శివకేశవులకు భేదం లేదని చాటి చెప్పే విధంగా పంచముఖ అమృతలింగేశ్వరస్వామితోపాటు వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించారు. నాలుగు ద్వారాలు, నాలుగు ధ్వజస్తంభాలు, విశాలమైన ముఖమండపంతో 108 ఉప ఆలయాలతో నిర్మించిన ఈ దేవాలయంలో భక్తులు స్వయంగా శివలింగ ప్రతిష్ఠ చేసుకునే అవకాశం ఉంది.




పరిటాల ఆంజనేయస్వామి

ఆసియా ఖండంలోనే అతి ఎత్తైన దివ్యసుందర అభయ వీర హనుమాన్ విగ్రహం కృష్ణా తీరంలోని పరిటాల వద్ద ఉంది. కంచికచర్ల మండలం పరిటాల- దొనబండ గ్రామాల మధ్య జాతీయ రహదారి పక్కన శ్రీరామ పాద క్షేత్రంలో రెండు దశాబ్దాల క్రితం అతి ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. విగ్రహం పొడవు 150 అడుగులు.(పీఠం పొడవు 15 అడుగులు, విగ్రహం పొడవు 135 అడుగులు). విగ్రహాన్ని చూస్తున్నప్పుడు మేఘాలు కదులుతున్నపుడు ఆంజనేయస్వామి కదులుతున్నాడన్న అనుభూతి కలుగుతుంది. ఇక్కడ నిరంతరం హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుంది. ఇలా ఏ క్షేత్రంలోనూ జరుగదు.

కంచికచర్ల శివసాయి క్షేత్రం



కంచికచర్ల సర్పంచ్ స్వర్గీయ గద్దె ప్రసాద్, పావని దంపతులు 2004లో బైపాస్ రోడ్డులో శివసాయి క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్షేత్రంలో శివాలయం ప్రత్యేక ఆకర్షణ. గణేశ, పార్వతీ సహిత అష్టోత్తర శత లింగాత్మక మహా శివలింగం ఇక్కడ తప్ప మరే క్షేత్రంలో లేదని అంటున్నారు. దీనికి తోడు క్షేత్రం ముందు భాగంలో నిర్మించిన శివలింగాకారం కట్టడం నుంచి భక్తులు క్షేత్రం లోపలకి వెళ్లాల్సి ఉంటుంది. ఇక్కడ అయ్యప్పస్వామి, షిరిడి సాయి బాబా, పంచముఖ హనుమాన్, జ్ఞాన సరస్వతి, నాగేంద్ర, వీరభద్ర, కాలభైరవ, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి. ఇంకా చిల్లకల్లు సమీపంలో తిరుమలగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయం, నందిగామ మునేటి అవతల పల్లగిరి గట్టుపై గల త్రిశక్తి పీఠంతో పాటుగా పలు దేవాలయాలు చూడదగినవి ఉన్నాయి.



వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయం

దక్షిణాది రాష్ట్రాల్లో వేదాద్రి యోగానంద లక్ష్మీనృసింహస్వామి ఆలయం పంచ నరసింహక్షేత్రంగా వెలుగొందుతోంది. వేదాలు కొండల రూపంలో అవతరించడంతో దీనికి వేదాద్రి అని పేరు వచ్చిందని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ క్షేత్రంలో స్వామి ఐదు రూపాల్లో భక్తులకు దర్శనమిస్తుంటారు. వేదాద్రి కొండపై వెలసిన జ్వాలా నరసింహుడు స్వయంవ్యక్తంగా, కృష్ణానది గర్భంలో కొలువైన సాల గ్రామ నరసింహుడు బ్రహ్మ ప్రతిష్ఠగా, గరుడాచలం గుహలో కొలువైన వీర నరసింహుడు గరుడ ప్రతిష్ఠగా, ఆలయంలో కొలువైన యోగానంద నరసింహుడు రుష్య శృంగ మహాముని ప్రతిష్ఠగా, దేవాలయంలో లక్ష్మీ నరసింహుడు మానవ ప్రతిష్ఠగా పురాణ ఇతిహాసాల ద్వారా తెలుస్తుంది.

పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయం



పెనుగంచిప్రోలులో పవిత్ర మునేటి తీరాన గోపయ్య సమేత, తిరుపతమ్మ పుణ్యక్షేత్రం ఉంది. తిరుపతమ్మ భర్త గోపయ్య గోవులను మేపటానికి ఉత్తరారణ్యానికి వెళ్లగా, పెద్దపులి చంపేసింది. భర్త చనిపోయాడని కల ద్వారా తిరుపతమ్మకు తెలిసింది. భర్త వియోగాన్ని తట్టుకోలేక యోగాగ్ని ప్రవేశం చేయడానికి సిద్ధపడింది. స్థానిక పెద్దలు అంగీకరించకపోవడంతో ఆమె మహిమలు చూపించి, ఇక్కడే గుడి కట్టాలని చెప్పి, యోగాగ్ని ప్రవేశం చేసింది. విశిష్ట ఆచార సంప్రదాయాలతో అనునిత్యం అశేష భక్తులతో పూజలందుకుంటూ ఈ క్షేత్రం మరో కలియుగ వైకుంఠమై విరాజిల్లుతోంది. ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి నుంచి ఐదు రోజులు పెద్ద తిరునాళ్లు, అమ్మవారి కల్యాణం కనులపండుగగా నిర్వహిస్తారు. పాల్గుణ శుద్ధ పౌర్ణమి నుంచి ఐదు రోజుల పాటు చిన తిరునాళ్లు జరుగుతాయి.

కూటమి ప్రభుత్వమైనా టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయాలి

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నుంచి గుంటూరు జిల్లా అమరావతి మీదుగా ముక్త్యాల వరకు ఏడాది పొడవునా ప్రత్యేకంగా బోట్లు నడపాలని నిర్ణయించారు. దీంతో పర్యాటక రంగం అభివృద్ధి చెంది, ఈ ప్రాంతాలు అభివృద్ధి చెందటానికి దోహదపడుతుందని, రాజధానికి అవసరమైన సిమెంట్, కంకర ఇతర ముడిపదార్థాల రవాణాకు ఉపయోగపడుతుందని భావించారు. విజయవాడ, అమరావతి, ముక్త్యాల వద్ద ప్రత్యేకంగా జెట్టీలు నిర్మించాలని ప్రతిపాదించారు. వేసవిలోనూ నదిలో బోటు తిరిగేలా తగినంత నీరు ఉండేలా అప్పట్లో డ్రెడ్జర్‌తో కొంతమేర పూడిక తీయించారు. వైసీపీ ప్రభుత్వమొచ్చాక ఈ ప్రాజెక్టును పూర్తిగా విస్మరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా ఈ ప్రాంతాన్ని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

కనకదుర్గమ్మకు రూ.2.28 కోట్ల కానుకలు

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం మహామండపం ఆరో అంతస్థులో లెక్కించారు. ఈ ఏడాది జనవరి 21 నుంచి ఈనెల 5వరకు 16 రోజులకు నగదు రూ.2,28,81,128, బంగారం 328 గ్రాములు, వెండి 3 కిలోల 480 గ్రాములు, విదేశీ కరెన్సీ 158 యూఎస్ఏ డాలర్లు, 5 సౌదీ రియాల్స్, 130 యూఏఈ దిర్హమ్స్, 115 కెనడా డాలర్లు, 55 సింగపూర్ డాలర్లు, 65 ఇంగ్లండ్ పౌండ్లు, ఒక ఖతర్ రియాల్, 2000 ఒమన్ బైసాలు, ఒక రియాల్, 30.5 కువైట్ దీనార్లు, ఆన్‌లైన్ ద్వారా రూ.78,333 కానుకలరూపేణా సమకూరింది. ఈవో కె.రామచంద్రమోహన్, డిప్యూటీ ఈవో రత్నరాజు పాల్గొన్నారు.

క్రెబ్స్ నుంచి వచ్చిన రసాయనాలే..

(5వ పేజీ తరువాయి)

వచ్చాయి, ఏ నెంబరు కలిగిన ట్యాంకర్‌లో ఎక్కడి పీపీయూ (ప్రీ ప్రాసెసింగ్ యూనిట్)కు పంపుతున్నారో ఏపీ ఎన్విరాన్‌మెంటల్ కార్పొరేషన్ (ఏపీఈఎంసీ) వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. దీన్ని పరిశీలించి ఆన్‌లైన్‌లోనే అనుమతి ఇస్తారు. దీన్ని మ్యానిఫెస్టో ప్రింట్ అవుట్‌గా వ్యవహరిస్తారు. ఈ కాపీని ప్రింట్ తీసుకుని సంబంధిత లారీ డ్రైవర్‌కు ఇవ్వాలి. మ్యానిఫెస్టో తయారుకాగానే పీపీయూకు ఒక మెసేజ్ వెళ్తుంది. కంపెనీ నుంచి లారీ బయల్దేరగానే జీపీఎస్ ద్వారా దాన్ని ట్రాక్ చేస్తారు. ట్యాంకర్ ఎక్కడైనా దారి తప్పితే వెంటనే అధికారులకు అలెర్ట్ మెసేజ్ వెళ్తుంది. ఇంత పగడ్బందీగా ఉన్నప్పుడు జక్కంపూడికి వచ్చిన ట్యాంకర్, వ్యర్థాల వివరాలు ఏపీఈఎంసీలో ఎందుకు నమోదు కాలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి ఈ ట్యాంకర్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని బుకాయించే ప్రయత్నాలను క్రెబ్స్ ప్రతినిధులు చేశారు. లాగ్ పుస్తకాల్లో ట్యాంకర్ నెంబరు ఉండటంతో కిక్కురుమనడం లేదని తెలుస్తోంది. కంప్యూటర్‌లో ఆన్‌లైన్‌లో జనరేట్ కావాల్సిన మ్యానిఫెస్టో కాకుండా, చేతితో రాసిచ్చిన మ్యానిఫెస్టో ఉండటం కూడా అనుమానాలకు కారణం. ఈవిధంగా ఎన్ని ట్యాంకర్లను, ఎన్నాళ్ల నుంచి పంపారన్న దానిపై పీసీబీ అధికారులు కూపీ లాగుతున్నారు.

ఇదే తొలిసారి కాదు

కర్మాగారాల నుంచి వెలువడుతున్న వ్యర్థాలను నిర్మానుష్య ప్రదేశాల్లో పారబోయడం ఇదే తొలిసారి కాదని జిల్లావాసులు చెబుతున్నారు. ఈ తరహా పనులు జగ్గయ్యపేట శివారుల్లోను జరిగాయంటున్నారు. రెండేళ్ల క్రితం రసాయన వ్యర్థాలను ట్యాంకర్లలో తీసుకొచ్చి బుగ్గమాదారం వద్ద కృష్ణానదిలో వదలడానికి ప్రయత్నించారు. దీన్ని గమనించిన స్థానికులు పట్టుకుని చిల్లకల్లు పోలీసులకు అప్పగించారు. తర్వాత ఆ కేసు నీరుగారిపోయింది. జగ్గయ్యపేట చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థాలను కొన్ని కంపెనీలు బోరు బావుల్లో వదిలేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని భూముల్లో బోర్ల కోసం వేసిన రంధ్రాలకు నీరు పడకపోవడంతో అలాగే వదిలేశారు. వాటి వద్దకు ట్యాంకర్లను తీసుకొచ్చి పైపుల ద్వారా ఈ రంధ్రాల్లోకి వ్యర్థాలను వదిలిన దాఖలాలున్నాయి. వ్యర్థాలను డంప్ చేసే ప్రక్రియకు ఇకనైనా అడ్డుకట్ట వేయకపోతే సారవంతమైన భూములకు నష్టం కలుగుతుందని ప్రజలు కోరుతున్నారు.

ఈవోగా ఐఏఎస్?

(5వ పేజీ తరువాయి)

నియమించారు. అనంతరం పూర్తికాలపు ఈవోగా ఏ.సూర్యకుమారి, కోటేశ్వరమ్మ నియమితులయ్యారు.

వైసీపీ హయాంలో.. : 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక మళ్లీ దుర్గగుడికి దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ హోదా ఉన్న వారిని నియమించాల్సి ఉండగా, డిప్యూటీ కమిషనర్‌గా ఉన్న సురేష్‌బాబును నియమించారు. అతని హోదాను మారుస్తూ జీవో ఇచ్చారు. తిరుమల తరహాలో పాలనా మార్పులు చేయాలన్న ప్రతిపాదన చేశారు కానీ, అమలు కాలేదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక : తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దుర్గగుడిలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు చేయడానికి మాస్టర్ ప్లాన్ అమల్లో ఉంది. దీంతో ఆలయంలో పాలనను సమూలంగా మార్చేందుకు సీఎం, దేవదాయ శాఖ మంత్రి కూడా ఆలోచిస్తున్నారు. దీంతో మళ్లీ దుర్గగుడికి ఐఏఎస్‌ను ఈవోగా నియమించాలని అనుకుంటున్నట్లు సమాచారం. మరోవైపు దుర్గగుడికి స్వయం ప్రతిపత్తి కలిగిన అధికారిని ఈవోగా నియమించాలని ప్రస్తుత ఇన్‌చార్జి దేవదాయ కమిషనర్ కోరుతున్నారు. ప్రస్తుత ఈవో కె.రామచంద్రమోహన్ కూడా ప్రభుత్వానికి లేఖ రాశారు. దుర్గగుడిలో సుమారు 2వేల మంది వరకు వివిధ కేటగిరీల ఉద్యోగులు పనిచేస్తున్నారు. భక్తుల రాక, ఆదాయం భారీగా పెరిగాయి. అభివృద్ధి పనులకు కూడా శ్రీకారం చుట్టారు. ఆ అంశాల ప్రాతిపదికన ఐఏఎస్‌ను నియమించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

- సమష్టిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
- అధికారులతో సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీన నిర్వహించే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని అధికారులంతా సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలి. ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థలతో పాటు ప్రైవేటు పాఠశాలలు, విద్యాసంస్థల్లోను కార్యక్రమం తప్పనిసరిగా అమలయ్యేలా చూడాలి. కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ విద్యార్థులకు నులి పురుగుల మాత్రలను ఉచితంగా పంపిణీ చేయాలి.' అని అధికారులను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమ వాల్‌పోస్టర్, కరపత్రాలను వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి ఆయన ఆవిష్కరించారు. వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల జిల్లాస్థాయి అధికారులతో నేరుగా, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. 'ఈనెల 10న 1-19 ఏళ్ల వయస్సు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరుగుతుంది. తమ పిల్లలు మాత్రలు తీసుకునేలా తల్లిదండ్రులు చూడాలి. 1-2 ఏళ్ల చిన్నారులకు సగం మాత్ర(200 మి.గ్రా), ఆపైన 19 ఏళ్ల వరకు ఒక మాత్ర (400 మి.గ్రా) ఇవ్వాలి. ఆల్బెండజోల్ సురక్షితమైన మాత్ర. బాగా చప్పరించి, శుభ్రమైన తాగునీటితో మింగాలి. ఈనెల 10న మాత్రలు తీసుకోకుండా మిగిలిపోయిన వారికి 17న మాత్రలు ఇస్తాం.' అని కలెక్టర్ వివరించారు. మాత్రల పంపిణీ అనంతరం చేతుల శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీసీహెచ్ఎస్ బీసీకే నాయక్, డీపీవో పి.లావణ్యకుమారి, డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారి, ప్రోగ్రాం ఇన్‌చార్జి డాక్టర్ మాధవినాయుడు పాల్గొన్నారు.

పేదరికాన్ని నిర్మూలనకు కృషి చేద్దాం

- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ విజయానంద్

ఎన్టీఆర్ కలెక్టరేట్: పేదరికాన్ని సమూలంగా నిర్మూలించేందుకు అందరం పనిచేద్దామని కలెక్టర్లు, వివిధ శాఖ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ దిశానిర్దేశం చేశారు. శూన్య పేదరికం, పీ-4 విధానం తదితరాలపై కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్సు (వీసీ) నిర్వహించారు. పేదరికాన్ని దూరం చేసేందుకు ప్రభుత్వ ప్రణాళికలను ఆయన వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇంటినీ ప్రగతి పథంలో నడిపించి, అందరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉద్దేశించిన పీ-4 పాలసీపై అవగాహన కల్పించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ, సీపీవో వై.శ్రీలత, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, డీపీవో పి.లావణ్యకుమారి, వీఎంసీ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్ వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ఎన్టీఆర్ కలెక్టరేట్: మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, పదిమందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో అడుగులు వేయాలని కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. గొల్లపూడిలోని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన స్వయం సహాయక బృందాల జిల్లా సమాఖ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. పేదరికాన్ని రూపుమాపేందుకు, మహిళలను ఆర్థికసాధికారత దిశగా నడిపించి వారు స్వయం సమృద్ధిని సాధించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కృషి చేస్తోందన్నారు. గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి కల్పించేలా స్వయం సహాయక సంఘాల మండల, జిల్లా సమాఖ్య సభ్యులకు చేతివృత్తుల్లో శిక్షణ, తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తున్నామన్నారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, స్టాండప్ ఇండియా పథకాలను ఉపయోగించుకుని, ఆసక్తి ఉన్న యూనిట్లను ఏర్పాటు చేసి క్రమశిక్షణతో వ్యాపారం చేసి, ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. ఈ ఏడాది 10 వేల యూనిట్ల ఏర్పాటు దిశగా అడుగులేస్తున్నామని, వీటిలో 5 వేల యూనిట్లు సెర్ప్-డీఆర్‌డీఏ అధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. బ్యాంకు రుణాలు పొందడం, వ్యాపారాలను విజయవంతంగా నిర్వహించడంపై శిక్షణ తీసుకుని, పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మహిళా శక్తిని నిరూపించుకోవాలని కలెక్టర్ సూచించారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్ప, ఎన్ఐఆర్‌డీ ప్రతినిధి మురళి, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ముక్త్యాల కోటిలింగ హరిహర మహాక్షేత్రం దత్తత నిలిపివేత

- తుదితీర్పు వచ్చేవరకు దేవదాయశాఖ పర్యవేక్షణ.. స్పష్టమైన ఆదేశాలిచ్చిన హైకోర్టు

జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ముక్త్యాలలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రాన్ని తాళ్లాయపాలేనికి చెందిన శైవక్షేత్రానికి దత్తత ఇస్తూ దేవదాయ శాఖ మాజీ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు నిలిపివేసింది. కోటిలింగ హరిహర మహాక్షేత్రాన్ని డిసెంబరు 18న తాళ్లాయపాలేనికి చెందిన శైవక్షేత్రానికి దత్తత ఇస్తూ అప్పటి కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులతో అప్పటి అసిస్టెంట్ కమిషనర్ సీతారామయ్య ముక్త్యాల వచ్చి ఈవో హరిదుర్గానాగేశ్వరరావుతో కలిసి 20న దత్తత కార్యక్రమాన్ని ముగించారు. శివస్వామికి క్షేత్రాన్ని అప్పగించారు. 21న ఆంధ్రజ్యోతిలో శివార్పణం పేరుతో కథనం వచ్చింది. దీంతో అధికారులు తప్పును సరిదిద్దుకునేందుకు తాత్కాలికంగా దత్తతను నిలిపివేయాలని మౌఖిక ఆదేశాలిచ్చి చేతులు దులుపుకొన్నారు. అప్పటి నుంచి దేవదాయ శాఖ తరఫున నిర్వహణకు దత్తత ఆర్డర్ ప్రతిబంధకంగా నిలిచింది. దీంతో భక్తుడు శ్రీనివాసరావు స్పష్టమైన ఆదేశాలు వస్తే తప్ప నిర్వహణ కష్టమని కోర్టును ఆశ్రయించారు. కమిషనర్ ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ బుధవారం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తుది తీర్పు వచ్చే వరకు దేవదాయ శాఖ పర్యవేక్షణలో ఆలయ నిర్వహణ కొనసాగాలని సూచించింది. దీంతో ఈవో హరిదుర్గానాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. 48 రోజులుగా త్రిశంకు స్వర్గంలో ఉన్న ఆలయ నిర్వహణ గాడిన పడింది.

గంజాయి మత్తులో రైలు కోచ్‌కే నిప్పుపెట్టారు!

- బోగీ దహనం బ్లేడ్ బ్యాచ్ పనే?
- లోకోషెడ్డు ఏరియాలో మితిమీరుతున్న ఆగడాలు



బోగీ లోపల దహనమయిన ఫర్నిచర్

రైల్వే స్టేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బ్లేడ్ బ్యాచే కదా అని పెద్దగా పట్టించుకోలేదు! మరి ఇప్పుడో..ఏకంగా రైలు బోగీనే తగులబెట్టారని తెలుస్తోంది. ఇవాళ ఆగి ఉన్న బోగీని తగులబెట్టారు. రేపు ప్రయాణికులు ఉన్న బోగీకి నిప్పుపెడితే ఎవరు బాధ్యత తీసుకుంటారు? రైల్వేస్టేషన్‌ను అడ్డాగా చేసుకున్న బ్లేడ్ బ్యాచ్.. రైల్వే ఆస్తులనే నాశనం చేసే స్థాయికి చేరింది. గంజాయి తాగి, ఏకంగా రైల్వే కోచ్‌కు నిప్పుపెట్టి దహనం చేసి, రూ.లక్షల నష్టాన్ని కలిగించినట్టు తెలుస్తోంది. రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఖుద్దుస్ నగర్ నుంచి ఉన్న డీజిల్ లోకో షెడ్ ఏరియాలో బ్లేడ్ బ్యాచ్ సభ్యుల ఆగడాలు మితిమీరాయి. ఈ ప్రాంతంలో ఆర్‌పీఎఫ్ జీఆర్‌పీ, స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసుల నిఘా కొరవడడంతో లోకో షెడ్డు సమీపంలో నిలిపి ఉంచిన రైలు బోగీలను అడ్డాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ ప్రాంతంలో రాత్రివేళల్లో వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. సుమారు 20 మంది బ్లేడ్ బ్యాచ్ సభ్యులు గ్రూపులుగా విడిపోయి ఖాళీ బోగీలను షెల్టర్‌గా చేసుకుని గంజాయి, మద్యం, మత్తు పదార్థాలను సేవిస్తున్నట్లుగా సమాచారం. మద్యం మత్తులో ఒకరిపై ఒకరు వాదులాటలకు పోట్లాటలకు దిగుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అన్నివైపుల నుంచి ఈ ప్రాంతానికి మార్గాలు ఉన్నాయి. ఎవరన్నా అటుగా వస్తున్నారంటే చాటుకు వెళ్లిపోతున్నారని తెలుస్తోంది. బుధవారం రాత్రి కొందరు బ్లేడ్ బ్యాచ్ సభ్యులు నిలిపి ఉంచిన రైలు ఏసీ బోగీలోకి ఎక్కి పూటుగా మద్యం తాగి, ఒకరిపై ఒకరు పోట్లాడుకున్నట్టు తెలుస్తోంది. వారిలో కొందరు బోగీకి ఉన్న అద్దాలను పగులగొట్టి, తమ వద్ద ఉన్న సిగరెట్ లైటర్‌ను వెలిగించి కోచ్‌లో పడేయడంతో బోగీ పూర్తిగా దహనమయిందని, మంటలు దట్టంగా వ్యాపించడంతో వారంతా అక్కడి నుంచి పరారయ్యారని సమాచారం. ఆర్‌పీఎఫ్ పోలీసులు, రైల్వే అధికారులు, మంటలంటుకున్న సమాచారం అందిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చారు. అప్పటికే బోగీలోని ఫర్నిచర్ పూర్తిగా దహనమయింది. పోలీసుల నిఘా లోపం వల్లే ఇక్కడ ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని చెబుతున్నారు. ఆర్‌పీఎఫ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త దారిలో..

(5వ పేజీ తరువాయి)

కొద్దికాలం తర్వాత రెండో బ్రిడ్జి నిర్మాణం కూడా జరిగింది. ఆ తర్వాత నుంచి విజయవాడ నగరం.. కానూరు వరకు పెరిగిపోయింది. ఇలాంటి దశలో వీజీటీఎం-ఉడా (సీఆర్‌డీఏకు ముందున్న పట్టణాభివృద్ధి సంస్థ) ప్రస్తుత ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ ప్రకారం అర్ధ వలయాకారపు రింగ్‌ను వేయాలన్న ఆలోచన చేసింది. ప్రస్తుతం ఇన్నర్ అలైన్‌మెంట్ సాగే చోడవరం వద్ద బ్రిడ్జి ఏర్పాటు చేసి అర్ధ వలయాకారపు రోడ్డు వేయాలన్నది అప్పటి ప్రణాళిక. అప్పట్లో కార్యరూపం దాల్చలేదు. దాదాపు రెండు దశాబ్దాలుగా కృష్ణానదిపై మరో బ్రిడ్జి లేదు. ఇలాంటి పరిస్థితుల్లో విజయవాడ ఈస్ట్ బైపాస్ ఎంతో అవసరంగా మారింది. దీనిద్వారా ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టాలనుకున్నారు.

తూర్పు బైపాస్ రద్దుతో కొత్త ఆలోచనలు

తూర్పు బైపాస్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ రద్దు వల్ల ఏర్పడనున్న ఇబ్బందులను అధిగమించాలంటే మాత్రం తప్పనిసరిగా ఇన్నర్ రింగ్‌రోడ్డులో మార్పులు చేర్పులు చేయాల్సిన అవసరం ఉంది. ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులతో ప్రభుత్వం కూడా ఆ దిశగా కొత్త ఆలోచనలు చేస్తోంది.

కొత్త ప్రతిపాదనలు ఇలా..

- ఇన్నర్ రింగ్‌రోడ్డును ఒకేసారి కాకుండా అవసరాలకు అనుగుణంగా దశలవారీగా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ముందు విజయవాడ వెస్ట్ బైపాస్ ప్యాకేజీ-4 ముగిసే కాజ దగ్గర నుంచి కృష్ణాజిల్లా కేసరపల్లి వరకు మొదటి దశలో అలైన్‌మెంట్ చేపట్టాలన్న ఆలోచన చేస్తున్నారు. చోడవరం మీదుగా ఉప్పులూరు దిగువ నుంచి కేసరపల్లి వరకు దీని అలైన్‌మెంట్ వస్తుంది. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంగా ఇది ఎన్‌హెచ్-16కు అనుసంధానమవుతుంది.
- కేసరపల్లి నుంచి కొండపావులూరు మీదుగా వెళ్తున్న విజయవాడ వెస్ట్ బైపాస్‌కు ఇన్నర్‌ను అనుసంధానించాలన్న ఆలోచన చేస్తున్నారు. ఇలాచేస్తే ఇన్నర్ రింగ్‌రోడ్డు నిర్మాణం పూర్తియిపోయినట్టే అవుతుంది.
- రాజధాని అమరావతిలోని ప్రధాన రోడ్లన్నింటినీ ఇన్నర్ రింగ్‌రోడ్డుకు అనుసంధానం కావాల్సి ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని కాజ దగ్గర నుంచి రాజధాని ప్రధాన రహదారులను అనుసంధానం చేస్తూ ఇబ్రహీంపట్నం రింగ్‌రోడ్డుకు కలపాలన్న ఆలోచన కూడా చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇన్నర్ ఎన్‌హెచ్-30 మీదుగా ముందుకు సాగుతూ కొండపల్లి దాటాక కుడివైపునకు తిరుగుతుంది. అనువైన చోట విజయవాడ వెస్ట్ బైపాస్‌కు అనుసంధానమవుతుంది.

తక్కువ వ్యయంతో..

ఈ మార్పుల వల్ల ఇన్నర్ రింగ్‌రోడ్డుకు చాలా తక్కువ వ్యయమవుతుంది. టన్నెల్స్ నిర్మించే పరిస్థితి ఉండదు. ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుంది. భూ సేకరణ ఇబ్బందులు కూడా తగ్గుతాయి. గుంటూరు జిల్లావారికి విజయవాడ ఎయిర్‌పోర్టుకు తేలికైన మార్గం ఏర్పడుతుంది. రింగ్‌రోడ్డును ఈ విధంగా మార్చటం వల్ల అన్ని ప్రధాన జాతీయ రహదారులు అనుసంధానమవుతాయి. విజయవాడ వెస్ట్ బైపాస్, ఎన్‌హెచ్-16, 65, 30, ఖమ్మం-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ వంటి అనేక రహదారులు కూడా కలుస్తాయి. ఈ మార్పులపై విస్తృత అధ్యయనం చేస్తున్నారు. ఇలా చేస్తే విజయవాడ ఈస్ట్ బైపాస్ కొరతను తీర్చవచ్చు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు కొండపై ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 25 నుంచి 28 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి దాత సంగా నరసింహరావు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆలయంలో గురువారం ఆవిష్కరించారు. 25న ఉదయం 8 గంటలకు స్వామివార్లను వధూవరులుగా అలంకరిస్తామని, విఘ్నేశ్వరపూజ, అఖండస్థాపన, దీక్షాధారణ, ధ్వజారోహణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కల్యాణదాతలు అయోధ్య శ్రీనివాసరావు, లక్ష్మీనరసమ్మ, ప్రధానార్చకుడు సాగర్, కాళిదాసు శివనాగేంద్రమ్మ, ధనుసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాజాను భారీ మెజార్టీతో గెలిపించాలి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. పటమట కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలను శాసన మండలిలో లేవనెత్తి చర్చించేందుకు ఆలపాటి రాజా గెలుపు అనివార్యం అన్నారు. ఎమ్మెల్సీ రాష్ట్ర పరిశీలకుడు, శాప్‌చైర్మన్ ఎ.రవి నాయుడు మాట్లాడుతూ ఆలపాటికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎన్నికల పరిశీలకుడు వెలగపూడి శంకర్‌బాబు, తెలుగు యువత నాయకుడు గద్దె క్రాంతికుమార్, ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, నందిపాటి దేవానంద్, కోనేరు రాజేష్, మల్లెల రామకృష్ణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద మరమ్మతులు చేయించండి

మొగల్రాజపురం: రామవరప్పాడు రింగ్ రోడ్డు జంక్షన్‌లో ఉన్న మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం ఉన్న ప్రాంతం బాగు చేయించాలని 8వ డివిజన్ పార్టీ కార్యదర్శి మల్లెల రామకృష్ణ ఆధ్వర్యంలో విగ్రహ కమిటీ సభ్యులు ఎం.పరమేశ్వరరావు, పొలిమెట్ల విజయ్‌కుమార్‌లు పటమటలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వినతి ప్రతం ఇచ్చారు. ఏప్రిల్ 5న బాబూ జగ్జీవన్‌రాం జయంతి అని, ఇప్పటికే విగ్రహం, దాని పరిసర ప్రాంతాలు పాడైపోయాయని, సోషల్ వేల్ఫేర్ శాఖకు, వీఎంసీ దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించాలని వారు కోరారు.

నిష్కళంక మాత..మరియమాత

ఈదులగూడెం విచారణకర్త ఫాదర్ ప్రశాంత్
7వ రోజుకు చేరుకున్న నవదిన ప్రార్థనలు

గుణదల, ఫిబ్రవరి 6 (ఆంధ్ర జ్యోతి): దేవుని తల్లి అయిన మరియ మాత తన కుమారుడైన యేసుప్రభువు పట్ల వినయ విధేయతలతో మెలిగిందని ఈదులగూడెం విచారణకర్త ఫాదర్ కూచిపూడి ప్రశాంత్ తెలిపారు. గుణదలమాత మహోత్సవాల నవదిన ప్రార్థనల్లో భాగంగా గురువారం సాయంత్రం జరిగిన 7వ రోజు ప్రార్థనలకు ముఖ్య అతిథిగా ఫాదర్ కూచిపూడి ప్రశాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ లూర్దుమాత భక్తులను తన అనుంగ బిడ్డలుగా అక్కున చేర్చుకొని ఆపద సమయంలో రక్షణగా ఉంటుందని అన్నారు. మరియమాత నిష్కళంక మాతగా భక్తులచేత కొనియాడబడుతోందని తెలిపారు. పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ ఈనెల 9 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు సర్వం సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రదేశాల్లో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అంతకు ముందు పుణ్యక్షేత్రం ప్రధాన గేటు నుంచి ఫాదర్ కూచిపూడి ప్రశాంత్ తదితర గురువులు దివ్యసత్ప్రసాద ఆరాధనతో కొండపైకి చేరుకున్నారు. అనంతరం గురువులు సమష్టి దివ్య పూజాబలి సమర్పించారు. సత్యనారాయణపురం, కొండపావులూరు, వేల్పూరు తదితర విచారణల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు గాబ్రియేలు, కొలకాని మరియన్న, తోట సునీల్ రాజు, జోసఫ్, దత్తు పాల్గొన్నారు.



మరియమాత గుహ వద్ద దివ్యపూజా బలి సమర్పిస్తున్న గురువులు



కులగణన బిల్లును తక్షణమే రద్దు చేయాలి

● ఉప్పులేటి దేవీప్రసాద్

పటమట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణన సర్వే తప్పుల తడకగా ఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాను తక్కువగా చూపడం దేనిక సంకేతం అని అఖిల భారత మాల సంఘాల చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్ అన్నారు. కులగణన బిల్లును తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం విజయవాడలోని అఖిల భారత మాలసంఘాల చైర్మన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కులగణనపై ఎలాంటి చర్చ జరపకుండా క్యాబినెట్‌లో ఆమోదం తెలిపారన్నారు. దీని వెనుక కుట్ర ఉందన్నారు. ఏపీలో ఇలాంటివి జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో గుర్రం రామారావు, పిల్లి రాజులు పాల్గొన్నారు.

జీఎస్టీ చట్టం పై అవగాహన పెంచుకోవాలి

జాయింట్ కమిషనర్ ప్రశాంత్‌కుమార్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ చట్టంలో వచ్చిన మార్పులు, చేర్పులపై అవగాహన పెంచుకుని పారదర్శకంగా వ్యాపారాలు చేస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జీఎస్టీ విజయవాడ డివిజన్ 1, 2 జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ వ్యాపారులకు సూచించారు. గాంధీనగర్‌లోని విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ కార్యాలయంలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వ్యాపార, వాణిజ్య వర్గాలను కలుసుకుని జీఎస్టీ సంబంధిత పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వ్యాపారులను నుంచి వస్తున్న జీఎస్టీ సంబంధిత సమస్యలు, వినతులను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తున్నామన్నారు. డిప్యూటీ కమిషనర్లు జహీర్ షేక్, పరదేశీ నాయుడు వ్యాపారుల సందేహాలను నివృత్తి చేశారు. చాంబర్ ప్రధాన కార్యదర్శి వక్కగడ్డ శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ సుధీర్, చాంబర్ అధ్యక్షుడు గడ్డం బాలవెంకట రవికుమార్, ప్రతినిధులు ఈమని దామోదర్, కొత్త దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా రాజశ్యామలాదేవి నవరాత్రులు

● పూర్ణాహుతి సమర్పించడంతో ముగిసిన ఉత్సవాలు

కృష్ణలంక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న రాజశ్యామలా దేవి నవరాత్రులు గురువారంతో ముగిశాయి. మార్గశుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు కాళీమాత అమ్మవారు రాజశ్యామలా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం నవమి కావడంతో ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్ దంపతులు పూర్ణాహుతి కార్యక్రమంలో పాలుపంచుకొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆధ్యాత్మిక సలహాదారు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

గుణదల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో గుండెపోటుతో మరణించిన హోంగార్డు కుటుంబానికి నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు రూ. 5లక్షల చెక్కును గురువారం అందజేశారు. నగర హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు గడచిన కొద్దికాలం క్రితం గుండెపోటుతో మృతి చెందారు. కమిషనరేట్లో పనిచేస్తున్న హోంగార్డులు మరణించినా, పదవీవిరమణ చేసినా హోంగార్డు సంక్షేమ నిధి నుంచి రూ. 5లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్న విషయం అందరికీ తెలిసిందే. హోంగార్డు కుటుంబాలు ఆర్థికంగా బలపడేందుకు సంక్షేమనిధి నుంచి చేయూత నివ్వడం గర్వించదగిన విషయం అని సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కేజీవీ సరిత, హోంగార్డు ఆర్.ఐ కె.సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న సీపీ ఎస్.వి.రాజశేఖరబాబు



లిఫ్ట్ పనులకు శంకుస్థాపన చేసిన జిల్లా జడ్జి అరుణ సారిక, ఎంఎస్‌జే సత్యానందం

'బార్' లిఫ్ట్ పనులకు శంకుస్థాపన

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్ పైనున్న రెండు అంతస్థుల్లోకి వెళ్లేందుకు వీలుగా లిఫ్ట్ పనులకు గురువారం కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం శంకుస్థాపన చేశారు. రూ.13 లక్షలతో నిర్మాణం చేపట్టనున్నట్లు బార్ ప్రధానకార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కె.చంద్రమౌళి, బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది కెఎస్ సుధాకరరాజు, కలతోటి క్రాంతికుమార్, మహిళా కార్యదర్శి పద్మజ, సుబ్బారావు పాల్గొన్నారు.



వీఆర్‌లో ఏఐ అటానమస్ హాకథాన్ 2025 ప్రారంభం



కృత్రిమ మేథ గురించి వివరిస్తున్న విద్యార్థులు

పెనమలూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సిద్ధార్థ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ 50ఏళ్ల స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఏఐ అటానమస్ హాకథాన్ 2025 కార్యక్రమం గురువారం ఉత్సాహభరితంగా ప్రారంభమయింది. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కృత్రిమ మేథ ఆధారిత పరిష్కారాలు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్‌ను ఎలా మార్చగలవో వివరించారు. విద్యార్థులు ఏఐ నేర్చుకోవడం, పరిశోధన చేయడం, అభివృద్ధి చేయడం ద్వారా స్మార్ట్ గవర్నెన్స్, హెల్త్ కేర్, స్మార్ట్ సిటీస్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, వ్యవసాయ అన్వయాలు వంటి అనేక విభాగాల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను రూపొందించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు ఎం.రాజయ్య, కార్యదర్శి లక్ష్మణరావు, ప్రో వీసీ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, కన్వీనర్ డాక్టర్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండోలో ధరణికి పతకాలు

లబ్బీపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): హైదారాబాద్‌లో జరిగిన 40వ నేషనల్ సీనియర్ క్యొరుగి, 13వ నేషనల్ సీనియర్ పూమ్సే తైక్వాండో చాంపియన్‌షిప్ 2025లో కళాశాల చెందిన విద్యార్థిని ధరణి రజత, కాంస్య, రజత పతకాలు కైవసం చేసుకున్నట్లు సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి ధరణిని ప్రిన్సిపాల్, కన్వీనర్ లలిత ప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి తదితరులు అభినందించారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో... కేబీఎన్ కళాశాలలో జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల హ్యాండ్‌బాల్ పోటీల్లో మూడో స్థానం సాధించిన కళాశాల జట్టును సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన అభినందించారు. గెలుపొందిన జట్టు క్రీడాకారులు తమిళనాడులోని పాళై కళాశాలలో జరగబోయే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ఇతర అధ్యాపకులు వారిని అభినందించారు.

మెగా వైద్య శిబిరం రేపు

ఆటోనగర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ సజ్జా రత్నకుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నలందలో ఉత్సాహంగా ఎగ్జిబిట్ 2024

లబ్బీపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు ఎంప్లాయబిలిటీ స్కిల్స్, టెక్నాలజీని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలని లోకల్ ఏరియా కోస్టల్ బ్యాంక్ ఎండీ అండ్ సీఈవో బి.వేణుగోపాల రెడ్డి అన్నారు. నలంద కళాశాలలో గురువారం కళాశాల మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఎగ్జిబిట్ 2024ను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పరిశోధనల వైపు దృష్టిసారించి రీసెర్చ్ స్కాలర్స్‌గా ఎదగాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎం. అనురాధ, వి.లక్ష్మీ, పి.రవికుమార్ పాల్గొన్నారు.

నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ఎమ్మెల్సీ అభ్యర్థి అరిగెల శివరాంప్రసాద్

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు బెజవాడ బార్ న్యాయవాదులంతా సహకారం అందించి శనివారం నామినేషన్ కార్యక్రమంలో పాలుపంచుకోవాల్సిందిగా బెజవాడ బార్ ప్రధానకార్యదర్శి అరిగెల శివరాం ప్రసాద్ కోరారు. బెజవాడ బార్ అసోసియేషన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శనివారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కె.చంద్రమౌళి, జాయింట్ సెక్రటరీ కలతోటి క్రాంతికుమార్‌లు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల
డిప్యూటీ ఛైర్మన్‌గా రామ్‌ప్రసాద్

విస్సన్నపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ కన్జూమర్ రైట్స్ రాష్ట్ర కమిటీ నియామకం గురువారం హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ కన్జూమర్ రైట్స్ డిప్యూటీ ఛైర్మన్‌గా నర్సాపురం గ్రామానికి చెందిన పసుపులేటి రామ్‌ప్రసాద్‌ను నియమించారు. అంతర్జాతీయ అధ్యక్షుడు, ఛైర్మన్ నలమాస శ్రీకాంత్ గౌడ్ నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. వినియోగదార్ల హక్కుల కోసం పోరాటం చేస్తానని ఆయన తెలిపారు.

బాలికలకు ఆత్మరక్షణలో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆత్మరక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) శిక్షణకు అర్హత, ఆసక్తి గల సంస్థల నుంచి 'రాణీ లక్ష్మీభాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్' సెల్ఫ్ డిఫెన్స్ నిర్వహణ నిమిత్తం ఫిబ్రవరి 13 నుంచి 28లోపు 20 సెషన్స్ నిర్వహించుకునేందుకు అర్హత గల సంస్థల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్టు ఎన్టీఆర్ జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ జి.మహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తులను ఫిబ్రవరి 10లోపు అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్ష, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ ప్రాంతీయ కార్యాలయంలో సమర్పించాల్సిందిగా ఆయన కోరారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

పెద్దవరం (తిరువూరు) ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దవరం గ్రామంలో పల్లికంటి డేవిడ్ అనే వ్యక్తి గురువారం రాత్రి ఆత్మహత్యయత్నం చేశాడు. పురుగుమందు తాగిన వ్యక్తిని చికిత్స నిమిత్తం పట్టణంలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఇటీవల సోషల్ మీడియాలో డేవిడ్ ఒక సామాజికవర్గంపై అసభ్యంగా పోస్టింగ్ పెట్టినట్టు ఆరోపిస్తూ ఆ సామాజిక వర్గానికి చెందినవారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. ఆ పోస్టింగ్ తాను పెట్టలేదని ఎవరో తన పేరుతో ఫేక్ అడ్రస్‌తో పోస్టింగ్ పెట్టారని, ఆ పోస్టింగ్‌పై దర్యాప్తు జరిపించాలని కోరుతూ డేవిడ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనలు జరిగిన రెండు రోజుల తదుపరి డేవిడ్ ఆత్మహత్యయత్నానికి పాల్పడటం చర్చనీయాంశమైయింది. పట్టణంలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స జరుగుతోంది.

నగరంలో ఆధునిక కబేళా!

- పీపీపీ విధానంలో చేపట్టేందుకు కార్పొరేషన్ ప్రతిపాదన
- ఆమోదం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి: నగరంలో ఆధునిక కబేళా ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. రూ.15 కోట్ల వ్యయంతో ఆధునిక కబేళాను పీపీపీ విధానంలో ఏర్పాటు చేసేందుకు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ప్రతిపాదించిన ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం గట్టువెనుక ప్రాంతంలో కబేళ ఉంది. ఇందులో కొంత స్థలాన్ని లీజుకు ఇవ్వగా ప్రస్తుతం 6 ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలంలో ఆధునిక కబేళాను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న మాన్యువల్ విధానం కాకుండా యాంత్రిక విధానంలో ఉంటుంది. చాలా పరిశుభ్రంగా, వాసన లేకుండా అత్యాధునిక వాతావరణంలో స్లాటర్ హౌస్ ఏర్పాటు జరుగుతుంది. జంతువులను ఇక్కడ వధించే ముందు పరీక్షలు చేస్తారు. ఆరోగ్యకరమైన జంతువులకు ట్యాగింగ్ చేస్తారు. వాటినే ప్లాంట్‌లోకి పంపిస్తారు. ప్లాంట్‌లో ఉన్న మెషినరీ జంతువుల తల మొండం వేరు చేస్తుంది. పేగులు, ఎముకలు వంటి వాటితో పాటు ఇతర వ్యర్థాలను వేరు చేస్తుంది. ఎక్కడా రక్తం, వ్యర్థాలు అనేవి కనిపించవు. ఎందులోకి వెళ్ళాల్సినవి అందులోకి వెళతాయి. పేగులు, ఇతర వ్యర్థాలు, ఎముకల పొడి వంటి వాటిని అమ్ముకోవటం ద్వారా డబ్బులు కూడా సంపాదించుకోవటానికి అవకాశం ఉంటుంది.

ఉల్లంఘనలకు క్వారీలే సాక్ష్యాలు



రొయ్యూరు క్వారీలో నీటి ఊట బయట పడేలా ఇసుకను తవ్వి గుట్టగా పోస్తున్న ఎక్స్‌కవేటర్

- నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు
- సహకరించిన అధికారులు
- ప్రభుత్వ క్వారీల్లో ముగిసిన గడువు
- ఇక తెరచుకోనున్న ప్రైవేటు క్వారీలు
- సర్వేచేసి హద్దులు వేసిన అధికారులు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్త్‌వల్లూరు, రొయ్యూరు ప్రభుత్వ క్వారీల్లో ఇసుక తవ్వకాలు అడ్డగోలుగా జరిగాయి. అందుకు ఆ క్వారీలే సజీవ సాక్ష్యాలు. 2 నెలల పాటు ఇసుక తవ్వి స్టాక్ యార్డులకు తోలేందుకు టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్లు వాల్టా చట్టం, జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ వంటి నిబంధనలు ఉల్లంఘించి యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరిపినా అధికారులు కిమ్మనకుండా సహకరించారు. జనవరి 28న అర్ధరాత్రి ఆర్డీవో, డీఎస్పీ స్థాయి అధికారులు ఒక్క నార్త్‌వల్లూరు క్వారీని మాత్రమే తనిఖీ చేసి రొయ్యూరు క్వారీకి వెళ్లలేదు. దాంతో అక్కడ క్వారీ కాంట్రాక్టరు ఎలాంటి అదురు బెదురు లేకుండా ఆ ఒక్కరోజు యంత్రాలను ఆపి మరుసటి రోజు నుంచి వాల్టా చట్టానికి విరుద్ధంగా భూగర్భ జలాలు బయటపడేలా తవ్వకాలు జరిపారు. ఈ క్వారీకి తెరవెనుక ముగ్గురు ప్రజాప్రతినిధులు ఉండి కాంట్రాక్టరు చేత ఇసుక తవ్వకాలు జరిపించినట్టు ఆరోపణలున్నాయి. స్టాక్‌యార్డు నుంచి కాకుండా నేరుగా క్వారీలో యంత్రంతో ఇసుక నింపి ఎలాంటి బిల్లులు లేకుండా పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్టు విమర్శలు వచ్చాయి. అధికారులు పూర్తిగా అక్రమాలకు సహకరించారని చెప్పవచ్చు. మండలంలో ప్రభుత్వ ఇసుక క్వారీల గడువు గురువారం సాయంత్రంతో ముగిసిందని తహసీల్దార్ ఎం కుసుమకుమారి తెలిపారు.

ఇక ప్రైవేటు క్వారీలు



ప్రైవేటు క్వారీకి సర్వేచేసి హద్దులు వేసిన అధికారులు

మండలంలో ఇక ప్రైవేటు క్వారీలు తెరచుకోనున్నాయి. రైతుల పట్టా భూములు వరదలకు కోతకు గురై నదీపాయల్లో కలిసి ఇసుక మేటలు వేశాయని, ఆ ఇసుక తీస్తే మళ్లీ పంటలు పండించుకునే అవకాశం లభిస్తుందని ప్రైవేటు క్వారీల మంజూరు లక్ష్యం. ఇలా రైతుల పట్టా భూముల్లో ప్రైవేటు క్వారీలకు సుమారు 30 మంది వరకు దరఖాస్తు చేసినట్టు తెలుస్తోంది. రొయ్యూరు, వల్లూరుపాలెం, నార్త్‌వల్లూరు, దేవరపల్లి, గుర్విందపల్లి, ఐలూరు గ్రామాల్లో ఇప్పటికే అధికారులు ప్రైవేటు క్వారీల కోసం సర్వేలు నిర్వహించి హద్దులు వేశారు. కొన్నిచోట్ల లోపభూయిష్టంగా జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. నదీపాయల మధ్యలోనే హద్దులు వేయటం చూస్తే ఇక నదీపాయ ఎక్కడో తెలియకుండా హద్దులు నిర్ణయించారని విమర్శలు వస్తున్నాయి. రెవెన్యూ అధికారులు పట్టా భూములను గుర్తించటం, అక్కడ ఎంత ఇసుక లభ్యత ఉందో మైనింగ్ అధికారులు లెక్కకట్టటం, ఎంత లోతున ఇసుక తీస్తే మళ్లీ పంటలు సాగుచేయవచ్చో వ్యవసాయాధికారి సర్టిపై చేయటం ఇలా పలుశాఖల అధికారులు నివేదికలు ఇచ్చాక ప్రైవేటు క్వారీకి అనుమతిస్తారు. ఈ ప్రైవేటు క్వారీల విధి విధానాలను ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది.

కరువు రహితం ఇరిగేషన్‌తోనే సాధ్యం

- మంత్రి నిమ్మల రామానాయుడు



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రులు నిమ్మల, సత్యకుమార్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు

విజయవాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా మార్చే శక్తి ఇరిగేషన్ శాఖకు మాత్రమే ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంత్రులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఇరిగేషన్ ఎన్జీవోల 2025 సంవత్సర డైరీ ఆవిష్కరణ విజయవాడ రైతు శిక్షణ కేంద్రంలో గురువారం జరిగింది. సమాజంలో అన్ని వృత్తుల కన్నా ఇరిగేషన్ శాఖ సేవా దృక్పథంతో పని చేస్తుందన్నారు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతలకు సాగునీరు అందిస్తుందన్నారు. ఇరిగేషన్ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు బాధ్యతతో పని చేస్తే ప్రజలకు మంచి సేవలు అందించగలమన్నారు. జగన్ ఐదేళ్లలో వ్యవస్థను, పోలవరం ప్రాజెక్టును భ్రష్టు పట్టించారన్నారు. ఆరేళ్లుగా హెచ్.ఎల్.సి నుంచి కుడి కాలువకు నీరు అందకపోవడంతో రెండు మండలాలు కరువు ప్రాంతాలుగా మారాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఇరిగేషన్ ఈఎన్సీలు వెంకటేశ్వరరావు, రత్నకుమార్, ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఛైర్మన్ శివారెడ్డి, ఇరిగేషన్ ఎన్జీవోల రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, టెక్నికల్ అసోసియేషన్ కార్యదర్శి సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- అధికారులకు ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశం
- తిరుపతమ్మ అమ్మవారి కల్యాణోత్సవ ఏర్పాట్లు పరిశీలన

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11న జరగనున్న తిరుపతమ్మ అమ్మవారి కల్యాణానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శుభం సోక్వాంత్ ఆదేశించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఆర్డీవో బాలకృష్ణతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఈవో కిషోర్ కుమార్‌తో పాటు మిగిలిన అధికారులకు ఆదేశాలిచ్చారు. కల్యాణం జరిగే ప్రదేశంతో పాటు మూనేటి అవతల వైపున అమ్మవారి దీక్షాస్వాములకు అన్నదానం ఏర్పాటు చేసే ప్రదేశం వద్ద క్యూలైన్లు, బారికేడ్స్ పటిష్టంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఎగ్జిక్యూటివ్ ఎల్.రమకు ఆదేశాలిచ్చారు. భక్తుల వాహనాలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని నందిగామ ఏసీపీ తిలక్‌కు సూచించారు. తహసీల్దార్ శాంతిలక్ష్మి, ఎంపీడీవో జి.శ్రీను, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అర్జున, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ శుభం సోక్వాంత్

నేడు నామినేషన్ ర్యాలీ.. విజయవంతం చేయండి: ఆలపాటి

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి నామినేషన్ దాఖలు సందర్భంగా శుక్రవారం గుంటూరులో జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ఆయన ధన్యవాదాలు తెలుపుతూ, ఈనెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు, ఓటర్లకు ఆయన విజ్ఞప్తి చేశారు.

అరుదైన పక్షి



చినగొల్లపాలెం దీవిలో రాబందును పోలి ఉన్న ఓ పక్షిని గ్రామానికి చెందిన యానాది సూర్యారావుకు ఈ నెల 4న సముద్ర ఒడ్డున ఎగరలేని పరిస్థితిలో దొరికింది. దాన్ని ఇంటికి తీసుకొచ్చి చేరదీశారు. ఈ వార్త అటవీ శాఖ అధికారులకు చేరటంతో వారు గురువారం వచ్చి పక్షిని స్వాధీనం చేసుకున్నారు. దీన్ని విశాఖపట్నంలోని ఇందిరాగాంధీ జూలజికల్ పార్క్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. - ఆంధ్రజ్యోతి, కృత్తివెన్ను

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు

- ఐపీఎస్ ట్రైనింగ్ అధికారిణి మనీషా రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ మోహన్

కృష్ణలంక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 36వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా మేరీస్ స్టెల్లా కాలేజీలో గురువారం విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐపీఎస్ ట్రైనింగ్ అధికారిణి మనీషా రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ లత కుమారి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఏ మోహన్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. డాక్టర్ సిస్టర్ రేఖ డైరెక్టర్ ఎక్స్‌టెన్సిన్ యాక్టివిటీస్ ప్రారంభించారు. ఐపీఎస్ ట్రైనింగ్ అధికారిణి మనీషా రెడ్డి మాట్లాడుతూ నేడు విద్యార్థుల చేతుల్లోనే దేశం పురోగతి ఉందని, విద్యార్థులు నైపుణ్యంతో ముందుకు వెళ్లాలని, నిర్లక్ష్యంగా వాహనాలను నడిపి రోడ్డు ప్రమాదాలకు గురవకూడదన్నారు. విద్యార్థులు బాధ్యతాయుతంగా ఉంటేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలమన్నారు. అసిస్టెంట్ కమిషనర్ లత కుమారి మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం చట్టప్రకారం నేరమని, దీనివల్ల ఏకాగ్రత కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. డీటీసీ ఎ.మోహన్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ శాతం హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. ఈ ప్రమాదాలను నివారించాలంటే అది యువతకు మాత్రమే సాధ్యమన్నారు. రోడ్డు రవాణా సంస్థ రీజనల్ మేనేజర్ యేసుదానం మాట్లాడుతూ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగంతో సురక్షితంగా ప్రయాణం కొనసాగించవచ్చునన్నారు. దిశ పోలీసు ఇన్‌స్పెక్టర్ వాసవి, మున్సిపల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఉష కుమారి, ఇంటర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, అధ్యాపకులు, 500 మంది విద్యార్థినులు, ఆర్టీఏ అధికారులు పాల్గొన్నారు.

అసమాన చిత్రకారుడు దామెర్ల



దామెర్ల శతజయంతి చిత్ర బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఇంతియాజ్, గోళ్ల నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చిత్రకళారంగంలో ప్రత్యేక స్థానాన్ని పొంది, భారతీయ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ, ఆయన తన చిత్రాల్లో నాజూకైన శైలిని ప్రదర్శించిన అసమాన్యమైన చిత్రకారుడు దామెర్ల రామారావు అని మాజీ ఐఏఎస్ అధికారి ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో గురువారం ఆంధ్ర చిత్ర కళావైతాళికుడు దామెర్ల రామారావు 100వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామెర్లకు భారతీయ ఇతిహాసాల పట్ల మక్కువ ఎక్కువని అందుకే ఆయన చిత్రాలు రామాయణం, మహాభారతం పురాణ గాథలకు ప్రాణం పోశాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన పోలవరపు కోటేశ్వరరావు, సాహితీ సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ దామెర్ల అజంతా శైలికి సమకాలీన రూపం ఆయన చిత్రాల్లో ఆవిష్కరించారని, అజంతా గుహల చిత్రాల నుంచి ప్రేరణ పొంది, ఆ శైలిని ఆధునికంగా మలిచారన్నారు. ముందుగా దామెర్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిర్వాహకులు మృత్యుంజయరావు, డ్రీమ్ రమేష్, టీవీ కళాసాగర్, స్ఫూర్తి శ్రీనివాస్, ఎ.సునీల్, మండలి లక్ష్మణ్, గంధం మురళి, చిదంబరం, ఎ.రాము, కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



హంసవాహనంలో కొలువు తీరిన స్వామి, అమ్మవార్లు



కోనేరులో స్వామివారి తెప్పోత్సవం

కమనీయం సుబ్బారాయుడి తెప్పోత్సవం

మోపిదేవిలో ప్రప్రథమంగా తెప్పోత్సవం

మోపిదేవి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా కోనేరు పుష్కరిణిలో నిర్వహించిన తెప్పోత్సవం కన్నుల విందుగా కొనసాగింది. మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రప్రథమంగా చేపట్టిన తెప్పోత్సవం ఆద్యంతం పుష్కరిణిలో మూడు ప్రదక్షిణలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన తెప్పపై విశేష అలంకరణ గావించిన హంసవాహనంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులను చేశారు. ఈవో దాసరి శ్రీరామవర ప్రసాదరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుర్వేద పండితులు వేద పారాయణం చేస్తుండగా, అర్చక బృందం వేదమంత్రాలతో వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ స్వామివారి తెప్పోత్సవం వైభవంగా కొనసాగింది. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ ఆధ్వర్యంలో ఎలాంటి అసాంఘిక ఘటనలు జరుగకుండా భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ఇరిగేషన్ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ఇరిగేషన్ అధికారులు

కబ్జాలపై కదలిక

- ఇరిగేషన్ భూముల్లో హెచ్చరిక బోర్డులు
- డ్రోన్లతో టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే
- కార్పొరేషన్‌కు ఇరిగేషన్ శాఖ లేఖ

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 6: అజిత్‌సింగ్ నగర్ సన్‌సిటీ కాలనీలోని ఇరిగేషన్ స్థలాల కబ్జా వ్యవహారంపై ఎట్టకేలకు అధికారుల్లో కదలిక వచ్చింది. ఇరిగేషన్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు స్థానికంగా కబ్జాలు జరిగిన ప్రాంతాలను గుర్తించేందుకు చర్యలు చేపట్టారు. సన్‌సిటీ కాలనీలో వైసీపీ నేతతో పాటుగా మరికొందరు ఇరిగేషన్ స్థలాలను కబ్జా చేసిన విషయమై 4 రోజులుగా ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై గురువారం స్పందించిన అధికారులు సన్‌సిటీ కాలనీకి చేరుకున్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

సన్‌సిటీ కాలనీతో పాటు బుడమేరు పరివాహక ప్రాంతాల్లోని బుడమేరు బఫర్ జోన్లలో ఇరిగేషన్ స్థలం ఎంత ఉందనే దానిపై అధికారులు ఆరా తీశారు. అలాగే సన్‌సిటీ కాలనీలోని 32వ సర్వే నెంబరులో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలంలో అధికారులు 'సదరు స్థలం ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలం'గా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

డ్రోన్లతో సర్వే

స్థానికంగా ప్రభుత్వ స్థలం ఎంత ఉండాలి.. ఎంత ఉంది, ఎక్కడ అనధికారిక నిర్మాణాలు జరిగాయి అనే విషయమై టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే నిర్వహించారు. ముఖ్యంగా సన్‌సిటీ కాలనీలో డ్రోన్ల సాయంతో సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలను గుర్తించారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి


పలుమార్లు కబ్జాకు గురవుతున్న ఇరిగేషన్ స్థలంలో కార్పొరేషన్ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడాకారులకు రూ.11.6 కోట్ల ప్రోత్సాహకాలు విడుదల

శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రీడల పట్ల ఆయనకు చిత్తశుద్ధిని నిరూపించుకుంటున్నారని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. శాప్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాప్ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత రాష్ట్రవ్యాప్తంగా పలువురు క్రీడాకారులకు క్రీడాప్రోత్సకాలు బకాయిలు విడుదల చేయాలని పెద్ద ఎత్తున వినతి పత్రాలు అందజేశారని తెలిపారు. గత ఐదేళ్లలో క్రీడాకారుల భవిషత్తుతో వైసీపీ ఆడుకుందని, ప్రోత్సహకాలు చెల్లించకుండా తమ రాజకీయ విన్యాసాలకు వినియోగించుకుందని అన్నారు. గత ఐదేళ్ళ పాలనలో 220మంది క్రీడాకారులకు 11,68,62,288 క్రీడాపోత్సహకాలను చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని, దీనిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళడంతో స్పందించిన ఆయన రెండు నెలల్లోనే 189 మంది లబ్ధిదారులకు 7,96,62,288క్రీడాపోత్సహకాలను విడుదల చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకూ ఏడుగురు క్రీడాకారులకు 1,68,57,000 క్రీడాపోత్సహకాలను మంజూరు చేయగా 95,25000 మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. మిగతా వారికి కూడా త్వరలోనే ప్రోత్సహకాలను విడుదల చేస్తామని ఆయన తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆర్‌పీ ఠాకూర్ గురువారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామచంద్రమోహన్ అమ్మవారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం, శేష వస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ దంపతులు కనకదుర్గమ్మను దర్శించుకోగా దరనానంతరం డిప్యూటీ ఈవో రత్నరాజు వేద ఆశీర్వచనం, శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్, ఆయన బృందం దుర్గమ్మను దర్శించుకుకోగా డిప్యూటీ ఈవో రత్నరాజు వారికి వేదాశీర్వచనం, శేషవస్త్రం, ప్రసాదం, దుర్గమ్మ చిత్రపటం అందజేశారు.

మరోసారి బ్లేడ్ పట్టిన ఖల్‌నాయల్.. భార్యపై దాడి

విజయవాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో కరుడుగట్టిన రౌడీషీటర్ ఖల్ నాయక్ మరోసారి బ్లేడ్ పట్టాడు. ఈసారి కట్టుకున్న భార్యపై బ్లేడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటన గాంధీనగర్‌లో గురువారం రాత్రి జరిగింది. భార్య లక్ష్మి అతడి నుంచి విడిపోయి విశాఖలో ఉంటోంది. కుమార్తె కోసం విజయవాడకు వచ్చింది. లక్ష్మి, ఆమె కుమార్తెతో వెళ్తుండగా ఖల్‌నాయక్ గాంధీనగర్‌లో లక్ష్మిని చూశాడు. కాపురానికి రావాలని ఒత్తిడి చేయగా ప్రతిఘటించడంతో జేబులోని బ్లేడ్ తీసుకుని చెంపలపై కోశాడు. ఆమె వెంటనే సత్యనారాయణపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.







చిత్రజ్యోతి

SINCE 1965

అంచనాలకు మించి ఆశ్చర్యపరుస్తుంది

- నాగ చైతన్య



అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటించిన చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. చందు మొండేటి దర్శకత్వం వహించారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీవాసు నిర్మించారు. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నాగ చైతన్య మాట్లాడుతూ 'మేమంతా సినిమా చూశాం. చాలా సంతోషంగా ఉన్నాం. చివరి ముప్పై నిమిషాలు సినిమా పీక్స్‌లో ఉంటుంది. అంచనాలకు మించి ఆశ్చర్యపరుస్తుంది. ఈ పాలి యేట గురితప్పలేదు. రేపొద్దున రాజులమ్మ జాతరే' అని అన్నారు. నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ 'చందు సినిమాను అద్భుతంగా తీర్చి దిద్దారు' అని చెప్పారు. చందు మొండేటి మాట్లాడుతూ 'ప్రేమికుల ఎడబాటు, తొమ్మిది నెలలు ఓ మనిషి కోసం ఎదురు చూపు, ఆ మనిషి తనకోసం వస్తాడనే నమ్మకం... ఇలా చాలా బ్యూటీఫుల్ ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి' అని అన్నారు. నిర్మాత బన్నీవాసు మాట్లాడుతూ 'పాకిస్థాన్ సీక్వెన్స్ కోసం డైరెక్టర్ బాగా రీసెర్చ్ చేశారు' అని చెప్పారు.

లైలా గెటప్‌కు రెండు గంటలు పట్టేది

-విశ్వక్ సేన్



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'లైలా'. ఇందులో ఆయన లేడీ గెటప్‌లో కనిపించనున్నారని తెలిసిందే. రామ్‌నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మించారు. ఆకాంక్ష శర్మ హీరోయిన్. ఈ నెల 14న ప్రేమికుల రోజున సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ "ఇందులో నేను లేడీ గెటప్‌లో కనిపించేది మిమ్మల్ని నవ్వించడానికే. ఇందులోని 'లైలా' గెటప్‌లో సిద్ధమవ్వడానికి ప్రతీ రోజూ రెండు గంటలు పట్టేది. ఇదొక విభిన్న తరహా చిత్రం. త్వరలోనే 'అటక్ పటక్' సాంగ్ విడుదలవుతుంది. నేనే ఆ పాటను రాశాను" అని అన్నారు. "పూర్తి వినోదాత్మక చిత్రమిది. కచ్చితంగా మీ అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. విశ్వక్ పోషించిన రెండు పాత్రలు ఆకట్టుకుంటాయి" అని దర్శకుడు రామ్‌నారాయణ్ చెప్పారు.

ఓ ఇంటి కథ



'ఇది మన ఇంటి కథ. ఈ ఇంట్లోనే చిన్న చిన్న కథలు చాలా ఉన్నాయి. ఇది మసాలా డబ్బా కాదు.. అమ్మగారి చిన్న బ్యాంక్. ఇది నాన్న గారి సెంటిమెంట్ బీరువా' అంటూ హీరో సిద్ధార్థ్ వాయిస్‌తో మొదలైన '3 బీహెచ్‌కె' చిత్రం టీజర్ ఆకట్టుకుంటోంది. సిద్ధార్థ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. శ్రీగణేశ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అంశాలతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం వేసవిలో విడుదల కానుంది.


ఇకపై ప్రతీ ఏడాది వేడుక నిర్వహిస్తాం

భరత్ భూషణ్



ఇకపై ప్రతీ ఏడాది ఫిబ్రవరి 6న తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకలు నిర్వహించాలని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయించింది. అలాగే ప్రతీ ఏడాది ఉత్తమ చిత్రాలతో పాటు నటీనటులకు కూడా పురస్కారాలను ఆ రోజున ఇవ్వనుంది. తెలుగు సినిమా పుట్టినరోజు వేడుకల్లో భాగంగా నటీనటుల ఇళ్లతో పాటు రాష్ట్రంలోని థియేటర్లలో తెలుగు సినిమా జెండా ఎగురవేయాలని తీర్మానించుకుంది. జెండా తయారీ బాధ్యతను పరుచూరి గోపాలకృష్ణకు అప్పగించింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రెసిడెంట్ భరత్‌భూషణ్ మాట్లాడుతూ "ఫిల్మ్ ఛాంబర్ నుంచి ఈ వేడుక చేయడం ఇదే తొలి సారి. ఇక నుంచి ప్రతీ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తాం. పాత తరం కళాకారులను సన్మానిస్తాం" అని అన్నారు. "1932లో హెచ్.ఎమ్.రెడ్డి దర్శకత్వంలో తొలి తెలుగు సినిమా 'భక్త ప్రహ్లాద' ఇదే రోజున విడుదలైంది. ఈ సందర్భంగానే ఈ వేడుకను ఫిబ్రవరి 6నే జరపాలని నిర్ణయించుకున్నాం" అని నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ చెప్పారు. "కాస్త ఆలస్యమైనా, ఈ నిర్ణయం తీసుకున్నందుకు సంతోషంగా ఉంది" అని సీనియర్ నటుడు, నిర్మాత మురళీ మోహన్ తెలిపారు.

మరోసారి భన్సాలీతో హృతిక్?



హీరోగా తన రెండు దశాబ్దాల ప్రయాణంలో అభిమానుల హృదయాల్లో చెరగని ముద్రవేశారు హృతిక్ రోషన్. ఇటీవలే నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన డాక్యుమెంటరీ సిరీస్ 'ది రోషన్స్'లో ఆయన నట ప్రస్థానాన్ని ప్రేక్షకుల ముందు ఆవిష్కరించారు మేకర్స్. ప్రస్తుతం వార్ 2 చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు హృతిక్ రోషన్. దీని తర్వాత ఆయన 'క్రిష్ 4'చిత్రం చేస్తారని ప్రకటించారు. అయితే బడ్జెట్ పరిమితుల కారణంగా ఈ సినిమా చిత్రీకరణ వాయిదా వేస్తున్నట్లు రాకేశ్ రోషన్ ప్రకటించారు. దీంతో హృతిక్ నటించబోయే తదుపరి చిత్రం ఏమై ఉంటుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో హృతిక్ రోషన్ ఓ చిత్రం చేయబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. గ్రాండియర్ చిత్రాలకు పెట్టింది పేరు అయిన భన్సాలీ ఈ చిత్రాన్ని కూడా చారిత్రక నేపథ్యం ఉన్న కథతో తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. లైన్ బాగా నచ్చడం, ఇప్పుడు చారిత్రక నేపథ్యంలో వస్తున్న చిత్రాలకు ఆదరణ ఉండడంతో హృతిక్ కూడా అంగీకరించినట్టు టాక్. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.





బిజినెస్

విజయవాడ ● శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

ఎస్‌బీఐ లాభం రూ.16,891 కోట్లు

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నికర లాభం రూ.16,891 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.9,164 కోట్ల లాభంతో పోలిస్తే 84 శాతం వృద్ధి కనబరిచింది. 2024-25లో సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో నమోదైన రూ.18,331 కోట్ల లాభంతో పోలిస్తే మాత్రం భారీగా తగ్గింది. మరిన్ని ముఖ్యాంశాలు..



- ఈ క్యూ3లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) వార్షిక ప్రాతిపదికన 4 శాతం పెరిగి రూ.41,446 కోట్లకు చేరుకుంది. ఇదే కాలానికి బ్యాంక్ రుణాలు దాదాపు 14 శాతం వృద్ధి చెంది రూ.40.68 లక్షల కోట్లకు చేరినప్పటికీ, నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 0.19 శాతం తగ్గుదలతో 3.15 శాతానికి పరిమితమైంది.
- డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ డిపాజిట్లు 9.81 శాతం వృద్ధితో రూ.52.3 లక్షల కోట్లకు పెరిగాయి. అందులో దేశీయ బ్రాంచీల్లోని కరెంట్ అకౌంట్, సేవింగ్ అకౌంట్ల (కాసా) డిపాజిట్లు 4.46 శాతం పెరిగి రూ.19.65 లక్షల కోట్లకు చేరాయి.
- "కస్టమర్ల ప్రాధాన్యాలు మారడంతో సమీక్ష కాలానికి బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ 3.15 శాతానికి తగ్గింది. కస్టమర్లు పొదుపు ఖాతాల కంటే అధిక వడ్డీ ఆదాయం అందించే ఎఫ్‌డీల్లో సొమ్ము జమ చేస్తున్నారు. అయితే, మార్జిన్ 3 శాతం కంటే తగ్గదు. గత త్రైమాసికంలో మొత్తం డిపాజిట్లలో 39.2 శాతానికి తగ్గిన కాసా అకౌంట్ల వాటా మళ్లీ పెంచడం కష్టమే" నని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు.
- ఆస్తుల నాణ్యత విషయానికొస్తే, డిసెంబరు చివరి నాటికి బ్యాంక్ మొండి బకాయిలు లేదా స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 2.07 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.53 శాతానికి జారుకున్నాయి. ఈ క్యూ3లో కొత్త రూ.3,823 కోట్ల రుణాలు మొండి పద్దులుగా మారాయని బ్యాంక్ తెలిపింది.

బ్రైట్‌కామ్ గ్రూప్‌నకు సెబీ షాక్

రూ.34 కోట్ల భారీ జరిమానా

కంపెనీ ప్రమోటర్లపై ఐదేళ్ల పాటు నిషేధం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వాటాదారులను నిండా ముంచిన హైదరాబాద్ కంపెనీ బ్రైట్‌కామ్ గ్రూప్ లిమిటెడ్ (బీజీఎల్)కు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ పెద్ద షాకిచ్చింది. ఈ కంపెనీపైన, కంపెనీ ప్రమోటర్లు, ఇతరులపై రూ.34 కోట్ల భారీ జరిమానా విధించింది. ఇందులో కంపెనీ ప్రధాన ప్రమోటర్లు ఎం సురేశ్ కుమార్ రెడ్డి, కంచర్ల విజయ్ చెరో రూ.15 కోట్ల చొప్పున జరిమానా చెల్లించాలని ఆదేశించింది. దీనికి తోడు వీరిద్దరు ఐదేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనకుండా వేటు వేసింది. అంతేకాకుండా వీరిద్దరూ ఏ కంపెనీలోగానీ, సెబీ వద్ద నమోదైన సంస్థల్లోగానీ ఐదేళ్ల పాటు కీలక మేనేజ్‌మెంట్ పదవులు చేపట్టకూడదని స్పష్టం చేసింది. దీనికి తోడు కంపెనీ ఇతర డైరెక్టర్లు వై శ్రీనివాస రావుపై రూ.2 కోట్లు, ఎర్రదొడ్డి రమేష్ రెడ్డి, బీజీఎల్‌పై చెరో రూ.కోటి చొప్పున జరిమానా విధించింది. తప్పుడు రికార్డుల ద్వారా లేని టర్నోవర్, లాభాలు ఉన్నట్టు చూపి వీరు కంపెనీ షేర్ల విలువను భారీగా పెంచి, తమ వాటా షేర్లు అమ్ముకుని మదుపరులను నిండా ముంచినట్లు తేలడంతో సెబీ ఈ చర్య తీసుకుంది.

మార్కెట్లో రోల్స్ రాయిస్ ఘోస్ట్ సిరీస్ 2



ప్రారంభ ధర రూ.8.95 కోట్లు

లగ్జరీ కార్ల దిగ్గజం రోల్స్-రాయిస్.. భారత మార్కెట్లో ఘోస్ట్ సిరీస్ 2 కార్లను ప్రవేశపెట్టింది. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధర రూ8.95 కోట్లు. ఘోస్ట్ ఎక్స్‌టెండెడ్ సిరీస్ ధర రూ.10.19 కోట్లు కాగా బ్లాక్ బ్యాడ్జ్ ఘోస్ట్ సిరీస్ 2 ధర రూ.10.52 కోట్లు. చెన్నై,ఢిల్లీ షోరూమ్‌లలో మాత్రమే ఈ కారుకు ఆర్డర్లు స్వీకరించనున్నట్టు రోల్స్-రాయిస్ ప్రకటించింది.

ఎయిర్‌టెల్ లాభం ఐదింతలు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో భారతి ఎయిర్‌టెల్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన ఐదింతలకు పైగా పెరిగి రూ.16,134.6 కోట్లకు చేరుకుంది. మొబైల్ టవర్ల నిర్వహణ కంపెనీ ఇండస్ టవర్స్ వ్యాపార కన్సాలిడేషన్ గత నవంబరు నుంచి అమలులోకి రావడంతో పాటు మొబైల్ చార్జీల పెంపు కంపెనీ లాభాల వృద్ధికి దోహదపడింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.2,876.4 కోట్లుగా నమోదైంది. క్యూ3లో రూ.45,129.3 కోట్ల ఆదాయాన్ని గడించింది. 2023-24 క్యూ3లో నమోదైన రూ.37,899.5 కోట్ల రెవెన్యూతో పోలిస్తే 19 శాతం వృద్ధి కనబరిచింది. కాగా, ఈ క్యూ3లో కంపెనీకి ఒక్కో వినియోగదారు నుంచి లభించిన సగటు ఆదాయం (ఆర్పూ) రూ.245కు పెరిగింది.

జెప్టోతో స్కోడా జట్టు

టెస్ట్ డ్రైవ్‌కు 10 నిమిషాల్లోనే కైలాక్ కారు

స్కోడా కంపెనీ ఇటీవల మార్కెట్లో విడుదల చేసిన కైలాక్ కారు టెస్ట్ డ్రైవ్ కోసం జెప్టోతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం కింద జెప్టో కంపెనీ ఆసక్తి చూపిన కస్టమర్ల ఇంటి ముంగిటికి 10 నిమిషాల వ్యవధిలోనే కారును టెస్ట్‌డ్రైవ్‌కు తెస్తుంది. ఆసక్తి గల కస్టమర్ల కోసం జెప్టో తమ యాప్‌పై "10 నిమిషాల్లో టెస్ట్ డ్రైవ్" అనే ఒక టాబ్ ఏర్పాటు చేస్తుంది. చాలా మంది కస్టమర్లు 10 నిమిషాల్లోనే కారు డెలివరీ అని పొరపాటు పడుతున్నారని, ఇది కేవలం టెస్ట్‌డ్రైవ్ కోసమేనని జెప్టో సీఈఓ ఆదిత్ పలీచా స్పష్టం చేశారు.

10 శాతం తగ్గిన అరబిందో ఫార్మా లాభం

రూ.846 కోట్లుగా నమోదు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అరబిందో ఫార్మా నికర లాభం 10 శాతం క్షీణించి రూ.846 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో నికర లాభం రూ.940 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం 8.5 శాతం వృద్ధి చెంది రూ.7,979 కోట్లుగా నమోదైంది. ఈ కాలంలో అమెరికా ఫార్ములేషన్స్ వ్యాపారం 2.3 శాతం తగ్గుదలతో రూ.3,671 కోట్లుగా ఉన్నట్టు కంపెనీ తెలిపింది. మరోవైపు యూరప్ వ్యాపారం మాత్రం 22.7 శాతం వృద్ధితో రూ.2,121 కోట్లుగా ఉన్నట్టు పేర్కొంది. కాగా వర్ధమాన మార్కెట్లలో కూడా ఆదాయం 39.3 శాతం వృద్ధి చెంది రూ.873 కోట్లుగా నమోదైనట్లు తెలిపింది. సమీక్షా కాలంలో ఆర్ అండ్ డీ కోసం రూ.450 కోట్లు వెచ్చించినట్లు అరబిందో వెల్లడించింది. మొత్తం రెవెన్యూలో ఇది 5.6 శాతం.

ఎన్‌సీసీ లాభంలో క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన తృతీయ త్రైమాసికంలో ఎన్‌సీసీ లిమిటెడ్.. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.5,382.86 కోట్ల ఆదాయం పై రూ.193.18 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.220.65 కోట్లుగా ఉండగా ఆదాయం రూ.5,287.74 కోట్లుగా ఉంది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.4,719.75 కోట్ల ఆదాయంపై రూ.185.40 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను రూ.16,165.55 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.566.06 కోట్ల నికర లాభాన్ని సాధించింది. డిసెంబరు ముగిసే నాటికి కంపెనీ ఆర్డర్ బుక్ రూ.55,548 కోట్లుగా ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	500
వరంగల్	442	గోదావరి	452
చిత్తూరు	493	విశాఖపట్నం	470
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	103	విజయవాడ	119
వరంగల్	103	గుంటూరు	114
కరీంనగర్	103	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	92
కర్నూలు	103	నెల్లూరు	97
విశాఖపట్నం	111	అనంతపురం	97
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	86,510 ▲	79,300 ▲	1,07,000 ▲
విజయవాడ	87,500 ▲	82,500 ▲	97,500 ▼
విశాఖపట్నం	84,860 ▲	77,790 ▲	95,770 ▼
రాజమండ్రి	86,510 ▲	79,300 ▲	99,000 ▲
ప్రొద్దుటూరు	85,400 ▲	79,910 ▲	96,500 ▲
ముంబై	84,613 ▼	77,506 ▼	94,762 ▼

కిమ్స్ హాస్పిటల్స్ ఆదాయం రూ.790 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కృష్ణా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్) డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ.790 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.93 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.77 కోట్లుగా ఉండగా స్థూల ఆదాయం 29.7 శాతం వృద్ధి చెందింది. డిసెంబరు త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ వద్ద రూ.112 కోట్ల నగదు, అందుకు సమానమైన నిల్వలు ఉన్నాయి. సీజనల్‌గా డిసెంబరు త్రైమాసికం అంతగా మెరుగ్గా ఉండకపోయినప్పటికీ నిర్వహణపరంగా సామర్థ్యాలను పెంచుకోవటంపై దృష్టి పెట్టడంతో మంచి ఫలితాలను నమోదు చేయగలిగినట్లు కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బీ భాస్కర్ రావు తెలిపారు. కాగా సంస్థకు చెందిన అన్ని యూనిట్ల సహకారంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాలను అందుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఎన్ఎండీసీ లాభంలో 30 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.1,944 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.1,492 కోట్లు)తో పోల్చితే లాభం 30 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 21 శాతం వృద్ధితో రూ.5,410 కోట్ల నుంచి రూ.6,531 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో ముడి ఇనుప ఖనిజ ఉత్పత్తి 9 శాతం పెరిగి 1.32 కోట్ల టన్నులకు చేరుకుందని ఎన్ఎండీసీ పేర్కొంది. కాగా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కంపెనీ రూ.6,942.92 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.1,896.66 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ వృద్ధి పథంలోనే సాగుతూ వస్తోందని ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. దేశీయంగా ముడి ఇనుము, స్టీల్‌కు డిమాండ్ గణనీయంగా పెరుగుతూ వస్తోందన్నారు.

మార్కెట్లో లాభాల స్వీకరణ

213 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్

ముంబై: ఆర్‌బీఐ ద్రవ్యపరపతి సమీక్షకు ముందు అప్రమత్తతతో ఈక్విటీ మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోవడమూ మార్కెట్‌ను కుంగదీసింది. గురువారం లాభాల్లో ట్రేడింగ్ ప్రారంభించిన సెన్సెక్స్.. తొలి గంటలోనే నష్టాల్లోకి మళ్లింది. ఒక దశలో 427 పాయింట్లు క్షీణించిన సూచీ.. చివరికి 213.12 పాయింట్ల నష్టంతో 78,058.16 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92.95 పాయింట్లు కోల్పోయి 23,603.35 వద్దకు జారుకుంది.

12 నుంచి హెక్సావేర్ టెక్నాలజీస్ ఐపీఓ: ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం కార్లైల్ గ్రూప్ పెట్టుబడులు కలిగిన మధ్య స్థాయి ఐటీ కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 12న ప్రారంభమై 14న ముగియనుంది. ఐపీఓలో భాగంగా షేర్ల విక్రయ ధరల శ్రేణిని కంపెనీ రూ.674-708గా నిర్ణయించింది.

మరో రికార్డు కనిష్ఠానికి రూపాయి: భారత కరెన్సీ సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 16 పైసలు క్షీణించి రూ.87.59 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడంతో పాటు డొనాల్డ్ ట్రంప్ సుంకాల దెబ్బతో అంతర్జాతీయ వాణిజ్య మార్కెట్లో పెరిగిన అనిశ్చితి రూపాయి క్షీణతకు కారణమవుతున్నాయని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.

అందరి చూపూ ఆర్‌బీఐ వైపే

ముంబై: మధ్యతరగతి ప్రజలు, పారిశ్రామిక, వాణిజ్య వర్గాలు అందరూ భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వైపే ఆశగా చూస్తున్నారు. సుమారుగా ఐదేళ్ల నుంచి వడ్డీ రేట్ల భారంతో ఉక్కిరిబిక్కిరవుతున్న తమకు కనీసం ఈ సారైనా ఊరట లభిస్తుందా అన్నదే అందరిలోనూ ఉత్సుకత. తన సారథ్యంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ద్రవ్య విధాన కమిటీ నిర్ణయాన్ని ఆర్‌బీఐ నూతన గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ఉదయం ప్రకటించనున్నారు. అంతర్జాతీయ, దేశీయ రేటింగ్ ఏజెన్సీలన్నీ కూడా ఈ పాలసీలో రెపో రేటు పావు శాతం కోత ఉంటుందని అంచనా వేస్తున్నాయి. 2020 మే నెలలో ఆర్‌బీఐ చిట్టచివరిగా రెపో రేటును 0.40 శాతం తగ్గించింది.

షాంఘై కంపెనీతో డాక్టర్ రెడ్డీస్ లైసెన్సింగ్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అభివృద్ధి దశలో ఉన్న క్యాన్సర్ ఔషధం హెచ్ఎల్ఎక్స్ 15 అభివృద్ధి, వాణిజ్యపరమైన విడుదల కోసం షాంఘై హెన్లియస్ బయోటెక్ కంపెనీతో లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ ప్రకటించింది. తమ అనుబంధ కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఎస్ఏ ఈ ఒప్పందంపై సంతకాలు చేసినట్టు తెలిపింది. డార్జలెక్స్, డార్జలెక్స్ ఫాస్‌ప్రోలకు బయోసిమిలర్ ఔషధం ఇది. ఈ ఒప్పందం ప్రకారం ఔషధం అభివృద్ధి, తయారీ, వాణిజ్యపరమైన సరఫరా బాధ్యత హెన్లియస్‌ది. ఇందుకోసం ఆ కంపెనీ 13.16 కోట్ల డాలర్లను అందుకుంటుంది. 3.3 కోట్ల డాలర్లు నేరుగా చెల్లిస్తారు. మిగతా సొమ్ము పురోగతి ఆధారంగా దశల వారీగా చెల్లిస్తారు. ఇవి కాకుండా వార్షిక అమ్మకాల ప్రాతిపదికన హెన్లియస్ బయోటెక్‌కు రాయల్టీ కూడా లభిస్తుందని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది.

అలవోకగా ఆడేశారు..

గిల్, శ్రేయాస్, అక్షర్ హాఫ్ సెంచరీలు

భారత్ ఘనవిజయం

జడేజా, రాణాలకు మూడేసి వికెట్లు

తొలి వన్డేలో ఇంగ్లండ్ చిత్తు



నాగ్‌పూర్: ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను కూడా టీమిండియా అదిరే విజయంతో ఆరంభించింది. వెటరన్ జడేజా (3/26)తో పాటు అరంగేట్ర పేసర్ హర్షిత్ రాణా (3/53) బౌలింగ్‌లో ఇంగ్లండ్‌ను కట్టడి చేయగా.. ఆ తర్వాత ఛేదనలో వైస్ కెప్టెన్ గిల్ (87), శ్రేయాస్ (59), అక్షర్ (52) కీలక అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. దీంతో గురువారం జరిగిన ఈ తొలి వన్డేలో భారత్ మరో 11.2 ఓవర్లుండగానే 4 వికెట్ల తేడాతో బోణీ చేసింది. అలాగే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలవగా.. రెండో వన్డే ఆదివారం కటక్‌లో జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 47.4 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. బట్లర్ (52), బెథెల్ (51) అర్ధసెంచరీలు సాధించగా, ఓపెనర్లు సాల్ట్ (43), డకెట్ (32) ఫర్వాలేదనిపించారు. ఆ తర్వాత ఛేదనలో భారత్ 38.4 ఓవర్లలో 6 వికెట్లకు 251 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గిల్ నిలిచాడు. ఈ వన్డేలో పేసర్ హర్షిత్, ఓపెనర్ జైస్వాల్ అరంగేట్రం చేశారు.

భారీ భాగస్వామ్యాలతో..: ఛేదనలో భారత్ 19 పరుగులకే ఓపెనర్లు రోహిత్ (2), జైస్వాల్ (15) వికెట్లను కోల్పోయింది. కానీ బరిలోకి దిగిన గిల్, శ్రేయాస్‌లతో పాటు బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చిన అక్షర్ పటేల్ ఇంగ్లండ్ బౌలర్లను సునాయాసంగా ఎదుర్కొన్నారు. అలాగే వీరి మధ్య భారీ భాగస్వామ్యాలు నెలకొనడం విశేషం. ఆరంభంలో గిల్ నిదానం కనబర్చినా.. శ్రేయాస్ మాత్రం టీ20 ఆటతీరును రుచి చూపించాడు. బౌలర్ ఎవరైనా అలవోకగా బౌండరీలు సాధిస్తూ స్కోరు బోర్డును పరిగెత్తించాడు. ఆర్చర్ ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లు బాదిన తను కేవలం 30 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అందులో 44 పరుగులు బౌండరీల రూపంలోనే రావడం విశేషం. కానీ 16వ ఓవర్‌లో బెథెల్ అతడిని ఎల్బీ చేయడంతో మూడో వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే అతడి వికెట్ తీసిన సంబరంలో ఉన్న ఇంగ్లండ్‌కు ఆ తర్వాత చుక్కలు కనిపించాయి. శ్రేయాస్ అవుటయ్యాక గిల్ జోరు పెంచాడు. అటు కుడి-ఎడమ చేతి కాంబినేషన్ కోసం రాహుల్‌కన్నా ముందే ఐదో స్థానంలో అక్షర్‌ను బరిలోకి దించారు. తను వచ్చీ రాగానే బాదుడు ఆరంభించడంతో ఇంగ్లండ్ బౌలర్లకు దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. 60 బంతుల్లో గిల్ హాఫ్ సెంచరీ పూర్తి చేయగా.. అక్షర్ మాత్రం 46 బంతుల్లోనే పూర్తి చేశాడు. ఈ దశలో రషీద్ వరుస ఓవర్లలో అక్షర్, రాహుల్ (2)ల వికెట్లను తీశాడు. దీంతో నాలుగో వికెట్‌కు గిల్-అక్షర్ మధ్య నెలకొన్న 108 పరుగుల శతక భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు శతకం పూర్తి చేస్తాడనుకున్న గిల్‌ను 37వ ఓవర్‌లో సకీబ్ పెవిలియన్‌కు చేర్చాడు. అప్పటికి జట్టు ఇంకా 14 పరుగుల దూరంలోనే ఉంది. దీంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా జడేజా (12 నాటౌట్), హార్దిక్ (9 నాటౌట్) 68 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించారు.

ఆరంభం బాగున్నా..: టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్‌కు మెరుపు ఆరంభం దక్కింది. ఓపెనర్ సాల్ట్ మాత్రం దూకుడైన ఆటతో భారత్‌ను భయపెట్టాడు. రాణా వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లోనైతే అతడు 6,4,6,4,0,6తో 26 పరుగులను రాబట్టాడు. మరో ఎండ్‌లో డకెట్ అడపాదడపా ఫోర్లతో సహకారం అందించాడు. అయితే అత్యంత ప్రమాదకరంగా మారిన ఈ జోడీకి తొమ్మిదో ఓవర్‌లో బ్రేక్ పడింది. మూడో రన్ కోసం ప్రయత్నించిన సాల్ట్.. శ్రేయాస్ త్రోతో రనౌట్‌గా వెనుదిరగ్గా తొలి వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక తర్వాతి ఓవర్‌లోనే డకెట్, బ్రూక్ (0)లను రాణా అవుట్ చేయడంతో ఒక్కసారిగా స్కోరు మందగించింది. రూట్ (19) స్వల్ప స్కోరుకే వెనుదిరిగాక బట్లర్, బెథెల్ జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఈక్రమంలో బట్లర్ 31వ ఓవర్‌లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. కానీ కాసేపటికే అక్షర్‌కు చిక్కడంతో ఐదో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత బెథెల్ కూడా అర్ధసెంచరీ పూర్తి చేసినా.. మిగతా బ్యాటర్ల నుంచి సహకారం కరువైంది. జడేజా పొదుపైన బౌలింగ్‌తో పాటు బెథెల్ వికెట్ తీశాడు. 44వ ఓవర్‌లో ఆర్చర్ 4,6,4తో 16 రన్స్‌తో అదరగొట్టాడు. కానీ మరో నాలుగు ఓవర్లలోనే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది.

1 భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన వన్డేల్లో ఎక్కువ వికెట్లు (42) తీసిన బౌలర్‌గా జడేజా. అండర్సన్ (40)ను అధిగమించాడు.

1 మూడు ఫార్మాట్లలోనూ అరంగేట్ర మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా హర్షిత్ రాణా. అలాగే అరంగేట్ర వన్డేలో భారత్ తరపున ఒకే ఓవర్‌లో ఎక్కువ పరుగులిచ్చుకున్న (26) బౌలర్‌గానూ రాణా నిలిచాడు.

5 అంతర్జాతీయ క్రికెట్‌లో 600 వికెట్లు పూర్తి చేసిన ఐదో భారత బౌలర్‌గా జడేజా. కుంబ్లే (953), అశ్విన్ (765), హర్భజన్ (707), కపిల్ (687) ముందున్నారు.

విరాట్‌కు గాయం

స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ గాయం కారణంగా తొలి వన్డేకు దూరమయ్యాడు. బుధవారం రాత్రి తను మోకాలి నొప్పికి గురైనట్టు కెప్టెన్ రోహిత్ టాస్ సమయంలో తెలిపాడు. అయితే అతడి గాయం తీవ్రతపై బోర్డు ఇంకా స్పందించలేదు. చాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ మూడు మ్యాచ్‌లే ఆడనుండడంతో విరాట్ తదుపరి మ్యాచ్‌లో ఉంటాడా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది.

యశస్వి సూపర్ క్యాచ్

అరంగేట్ర మ్యాచ్‌లోనే యశస్వీ జైస్వాల్ అద్భుత ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. జోరు మీదున్న ఓపెనర్ డకెట్ పదో ఓవర్‌లో పుల్ షాట్‌కు ప్రయత్నించాడు. అయితే గాల్లోకి లేచిన బంతిని మిడ్ వికెట్ నుంచి జైస్వాల్ ముందుకు పరిగెత్తుతూ డైవ్ ద్వారా రెండు చేతుల్తో ఒడిసిపట్టుకున్నాడు. అసాధ్యం అనుకున్న ఈ క్యాచ్‌ను అందుకోవడంతో ఆ తర్వాత ఇంగ్లండ్ పరుగుల వేగం తగ్గి ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్: సాల్ట్ (రనౌట్) 43; డకెట్ (సి) జైస్వాల్ (బి) రాణా 32; రూట్ (ఎల్బీ) జడేజా 19; బ్రూక్ (సి) రాహుల్ (బి) రాణా 0; బట్లర్ (సి) పాండ్యా (బి) అక్షర్ 52; బెథెల్ (ఎల్బీ) జడేజా 51; లివింగ్‌స్టోన్ (సి) రాహుల్ (బి) రాణా 5; కార్స్ (బి) షమి 10; రషీద్ (బి) జడేజా 8; ఆర్చర్ (నాటౌట్) 21; సకీబ్ (స్టంప్) రాహుల్ (బి) కుల్దీప్ 2; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 47.4 ఓవర్లలో 248 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-75, 2-77, 3-77, 4-111, 5-170, 6-183, 7-206, 8-220, 9-241, 10-248; **బౌలింగ్:** షమి 8-1-38-1; హర్షిత్ రాణా 7-1-53-3; అక్షర్ పటేల్ 7-0-38-1; హార్దిక్ పాండ్యా 7-1-37-0; కుల్దీప్ 9.4-0-53-1; రవీంద్ర జడేజా 9-1-26-3.

భారత్: జైస్వాల్ (సి) సాల్ట్ (బి) ఆర్చర్ 15; రోహిత్ (సి) లివింగ్‌స్టోన్ (బి) సకీబ్ 2; గిల్ (సి) బట్లర్ (బి) సకీబ్ 87; శ్రేయాస్ (ఎల్బీ) బెథెల్ 59; అక్షర్ (బి) రషీద్ 52; రాహుల్ (సి అండ్ బి) రషీద్ 2; హార్దిక్ (నాటౌట్) 9; జడేజా (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 38.4 ఓవర్లలో 251/6; వికెట్ల పతనం:** 1-19, 2-19, 3-113, 4-221, 5-225, 6-235; **బౌలింగ్:** ఆర్చర్ 7-1-39-1; సకీబ్ 6.4-0-47-2; కార్స్ 5-0-52-0; రషీద్ 10-1-49-2; బెథెల్ 3-0-18-1; లివింగ్‌స్టోన్ 5-0-28-0; రూట్ 2-0-10-0.

స్పోర్ట్స్

స్టొయినిస్ షాకింగ్ నిర్ణయం!

వన్డేలకు తక్షణం వీడ్కోలు



చాంపియన్స్ ట్రోఫీకి దూరం

మెల్‌బోర్న్: గాయాలతో సతమతమవుతున్న ఆస్ట్రేలియాకు చాంపియన్స్ ట్రోఫీ (సీటీ) ముందు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్ (35) హఠాత్తుగా వన్డేలకు వీడ్కోలు పలికి అందరికీ షాకిచ్చాడు. తక్షణం తాను 50 ఓవర్ల ఫార్మాట్ నుంచి తప్పుకొంటున్నట్టు అతడు ప్రకటించడంతో ఈ నెల 19 నుంచి జరిగే సీటీకి కూడా దూరమయ్యాడు. కీలక ఆటగాళ్లు కమిన్స్, మిచెల్ మార్ష్, హాజెల్‌వుడ్ గాయాల బారిన పడడంతో ఐసీసీ మెగా టోర్నీ కోసం తగిన జట్టును ఎంపిక చేయడానికి సెలెక్టర్లు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పుడు స్టొయినిస్ రిటైర్మెంట్ ప్రకటనతో అతడి స్థానంలో మరో ఆటగాడిని వెతకాల్సిన పరిస్థితి. కాగా, సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో డర్బన్ సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్నప్పుడు తొడ కండర గాయం కావడంతోనే మార్కస్ ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తోంది. అయితే, టీ20 ఫార్మాట్‌లో కొనసాగుతానని అతడు చెప్పాడు. 2021 టీ20 వరల్డ్‌కప్, 2023 వన్డే ప్రపంచకప్ నెగ్గిన జట్లలో మార్కస్ సభ్యుడు. ఆడిన 71 వన్డేల్లో 26.69 సగటుతో 1495 పరుగులు చేసిన స్టొయినిస్.. బంతితో 48 వికెట్లు పడగొట్టాడు. 74 టీ20ల్లో 1245 పరుగులు సాధించగా.. 45 వికెట్లు కూల్చాడు. కానీ, తన పదేళ్ల కెరీర్‌లో ఒక్క టెస్ట్ కూడా ఆడలేదు.

కమిన్స్, హాజెల్‌వుడ్ అవుట్

కెప్టెన్ కమిన్స్‌తో పాటు పేసర్ హాజెల్‌వుడ్ గాయం కారణంగా చాంపియన్స్ ట్రోఫీకి దూరమయ్యారు. కమిన్స్ కెప్టెన్సీలోనే ఆసీస్ 2023 వన్డే వరల్డ్‌కప్ సాధించిన విషయం తెలిసిందే. ఇప్పటికే మిచెల్ మార్ష్ కూడా గాయంతో ఈ టోర్నీ నుంచి వైదొలిగాడు. సీటీ కోసం జనవరి 13న ఆసీస్ ప్రకటించిన ప్రాథమిక జట్టులో ఈ నలుగురు ఉండడం గమనార్హం. అయితే ఈనెల 12 వరకు టీమ్‌లో మార్పులు చేసుకునే అవకాశం ఉండడంతో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కొత్తగా మరో నలుగురితో వీరి స్థానాలను భర్తీ చేయనుంది.

సెమీస్‌కు సాకేత్ జోడీ

చెన్నై ఓపెన్ టెన్నిస్

చెన్నై: డిఫెండింగ్ చాంపియన్ సాకేత్ మైనేని-రామ్‌కుమార్ రామనాథన్ జోడీ చెన్నై ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన క్వార్టర్స్‌లో సాకేత్-రామనాథన్ జంట 6-3, 6-4తో ఇగోర్ అగఫనోవ్-ఎవజెన్నీ టియుర్నేవ్‌పై నెగ్గింది. మరో క్వార్టర్స్ మ్యాచ్‌లో గెలిచిన జీవన్ నెడుంజెళియన్-విజయ్ సుందర్ ప్రశాంత్ ద్వయం కూడా సెమీస్ చేరింది.

శ్రీలంక 229/9

ఆసీస్‌తో రెండో టెస్ట్

గాలె: దినేష్ చాందిమల్ (74), కుశాల్ మెండిస్ (59 బ్యాటింగ్) అర్ధ శతకాలతో ఆదుకొన్నా.. ఆస్ట్రేలియా బౌలర్లు శ్రీలంకను భారీ స్కోరు చేయకుండా అడ్డుకొన్నారు. దీంతో గురువారం ఆరంభమైన రెండో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో లంక 9 వికెట్లకు 229 పరుగులు చేసింది. కెరీర్‌లో ఆఖరి టెస్ట్ ఆడుతున్న దిముత్ కరుణరత్నె (36), రమేష్ మెండిస్ (28) ఫర్వాలేదనిపించారు. మిచెల్ స్టార్క్, లియోన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు.

బీచ్ వాలీబాల్‌లో ఆంధ్రకు స్వర్ణం

● బాక్సింగ్‌లో తెలంగాణకు కాంస్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): డెహ్రాడూన్‌లో జరుగుతున్న జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ నాలుగో పసిడి పతకం కైవసం చేసుకుంది. బీచ్ వాలీబాల్ ఫైనల్లో కె.మణికంఠ రాజు-ఎల్. సాయి ద్వయం 25-23, 21-19తో తమిళనాడు జోడీపై నెగ్గి, విజేతగా నిలిచింది. ఇక బాక్సింగ్ 91 ప్లస్ కిలోల విభాగంలో తెలంగాణ బాక్సర్ అబ్దుల్ జావేద్‌కు కాంస్యం లభించింది.

'ద హండ్రెడ్' జట్టును కొన్న 'సన్‌రైజర్స్'

లండన్: సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ 'ద హండ్రెడ్' లీగ్‌లో జట్టును కొనుగోలు చేసింది. 'నార్తర్న్ సూపర్ చార్జర్స్' జట్టులో పూర్తి 100 శాతం వాటాను రూ.1086 కోట్లకు దక్కించుకుంది. తద్వారా ఈ లీగ్ జట్టును సొంతం చేసుకున్న మూడో ఐపీఎల్ ఫ్రాంచైజీగా హైదరాబాద్ నిలిచింది. ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టులో 49 శాతం వాటాను రూ.645 కోట్లకు ముంబై ఇండియన్స్, మాంచెస్టర్ ఒరిజినల్స్ ఫ్రాంచైజీలో 70 శాతం వాటాను రూ.882 కోట్లకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు ఇప్పటికే చేజిక్కించుకున్నాయి.

ఆసియా వింటర్ గేమ్స్‌కు చంద్ర

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా వింటర్ గేమ్స్‌లో పాల్గొనే భారత బృందంలో విశాఖపట్నం స్కేటర్ దండ చంద్రమౌళికి చోటు లభించింది. చైనాలోని హర్బిన్ నగరంలో ఈనెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీల్లో భారత్ నుంచి మొత్తం 12 మంది స్కేటర్లు పాల్గొంటున్నారు.

బ్యాడ్మింటన్‌లో కొత్త స్కోరింగ్ విధానం

ఆరు నెలలపాటు ప్రయోగాత్మకంగా అమలు

న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్‌లో కొత్త స్కోరింగ్ విధానాన్ని తీసుకురావాలని అంతర్జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) నిర్ణయించింది. 3X15 పేరిట నూతన పద్ధతిని ఎంపిక చేసిన టోర్నమెంట్లలో ఆరు నెలలపాటు వచ్చే ఏప్రిల్ నుంచి అమలు చేయనుంది. ప్రస్తుత స్కోరింగ్ విధానంలో 21 పాయింట్లతో బెస్టాఫ్ త్రీ గేమ్‌లు (3X21) నిర్వహిస్తున్నారు. అలా కాకుండా బెస్టాఫ్ త్రీ గేమ్‌లు 15 పాయింట్లతో జరుగుతాయి.

చివరి పరీక్షను ఇలా గెలుద్దాం!



మనమందరం మన రోజువారీ జీవితాలలో తీరిక లేకుండా గడిపేస్తున్నాం. మనుగడకోసం చేసే ఈ పోరాటంలో మనం ఎన్నో కష్ట సుఖాలను ఎదుర్కొంటూ ఉంటాం. మన రోజువారీ విధులను నిర్వర్తిస్తూనే... భగవంతుడికి చేరువయ్యే మార్గాన్ని 'భగవద్గీత' బోధించింది. అదే విధంగా మనకు ఎన్నో పండుగలు, విశేషమైన ఉత్సవాలు ఉన్నాయి. వాటిని జరుపుకోవడం ద్వారా భగవన్నామస్మరణను మరింత ఎక్కువగా చేసుకోవచ్చు. భగవంతుణ్ణి, ఆయన దివ్య లీలల్లోని అంతరార్థాన్నీ పరిపూర్ణంగా అర్థం చేసుకున్నవారు మోక్షాన్ని పొందుతారని, భగవత్ సన్నిధానాన్ని చేరుకుంటారనీ పెద్దలు చెప్పారు. అటువంటి ఒక అవకాశమే శ్రీ వరాహ ద్వాదశి. ఇది శ్రీ వరాహస్వామిగా మహా విష్ణువు అవతరించిన రోజు.

వరాహస్వామి వాగ్దానం

శ్రీ వరాహావతార లీలను ప్రపంచవ్యాప్త హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యుడైన శ్రీల ప్రభుపాదులు వివరిస్తూ... "సృష్టి ఆరంభం నుంచి దేవతలు, దైత్యులు అనే ఇరు వర్గాల వారు విశ్వంలోని లోకాలన్నిటినీ శాసించేవారు. భగవంతుడు ఏర్పరచిన ఈ సృష్టిలో నిర్దిష్ట నియమానుసారం... గ్రహాలన్నీ అంతరిక్షంలో తేలియాడుతూ ఉండేవి. వాటిలో కొన్ని జలాలతో నిండి ఉండగా, మిగిలిన సగం అసంఖ్యాకమైన గ్రహాలతో కూడిన లోకాలతో నిండి ఉండేది. ఈ గ్రహాలు కక్ష్యలో తిరిగే క్రమానికి అసురుడైన హిరణ్యాక్షుడు విఘాతం కలిగించాడు. దీనితో భూలోకం తన భారరహిత స్థితిని కోల్పోయి జలాలలోకి జారిపోయింది. ఆ సమయంలో... ఈ జగత్తుకు స్థితికారకుడైన మహా విష్ణువు... భీకరమైన సూకర రూపాన్ని ధరించి, తన దంతాలతో భూమండలాన్ని జలాల నుంచి పైకి ఎత్తి పట్టాడు. ఆ సందర్భంలో వరాహస్వామిని హిరణ్యాక్షుడు అడ్డగించబోగా... స్వామి తన దంతాలతో అతణ్ణి గుచ్చి సంహరించాడు. భగవంతుడి అవతారాలకు ఉన్న విశిష్టత ఇదే. అసాధారణమైన పరిస్థితుల్లోనే ఆయన అవతరిస్తాడు. మనుష్యుడి ఆలోచనకైనా అందని పరమాద్భుతమైన రీతిలో తన లీలలను ప్రదర్శిస్తాడు. అటువంటి భగవంతుణ్ణి సదా స్మరించుకోవడమే ముక్తికి మార్గం అని పురాణాలు చెబుతున్నాయి. మరి మేము ప్రతిరోజూ భగవన్నామ స్మరణ చేస్తున్నాం. కానీ జీవితంలోని ఆఖరి క్షణంలో దేవుణ్ణి స్మరించుకోలేని ప్రమాదకర పరిస్థితిలో ఉంటే ఎలా? అని కొందరు భక్తులకు సందేహం కలుగవచ్చు. "ఒకవేళ నా భక్తుడు మరణ సమయంలో దేహానికి కలిగే అవాంతరాల కారణంగా నన్ను స్మరించలేకపోతే... నేనే నా భక్తుణ్ణి స్మరించి, నా దివ్య ధామానికి తీసుకువెళ్తాను" అని 'వరాహ పురాణం'లో శ్రీవరాహస్వామి చేసిన వాగ్దానం... ఆ సందేహానికి సమాధానం ఇస్తుంది. వరాహ ద్వాదశి రోజున... వరాహమూర్తిని స్మరించాలి. హరేకృష్ణ మంత్రాన్ని జపించాలి. అన్నదానం, గోసేవలను నిర్వహించడం వల్ల స్వామి అనుగ్రహం కలుగుతుంది.

9న వరాహ ద్వాదశి

శాశ్వతమైన ఆనందం కోసం...


జీవితంలోని చిట్టచివరి క్షణంలో చేసే భగవన్నామ స్మరణ గురించి శ్రీకృష్ణుడు వివరించాడు. "ఏ వ్యక్తి తన చిట్ట చివరి క్షణంలో దేనినైతే తలుస్తాడో, దాని ఆధారంగానే ఆ వ్యక్తి తదుపరి జన్మ నిర్ణయం అవుతుంది. దేవతలను తలిస్తే దేవ లోకాన్ని చేరుతారు. తమ పూర్వీకులను తలిస్తే పితృలోకాలకు చేరుకుంటారు. శ్రీహరిని లేదా నారాయణుణ్ణి లేదా శ్రీకృష్ణుణ్ణి తలచుకుంటే... ఆ దేవాదిదేవుడి దివ్య ధామాన్ని తప్పకుండా చేరుకుంటారు" అని చెప్పాడు. భగవద్ధామం ఒక్కటే శాశ్వతమనీ, భౌతిక ప్రపంచంలోని మిగిలినవన్నీ తాత్కాలికమేననీ భగవద్గీత వివరిస్తోంది. శాశ్వతమైన ఆనందాన్ని పొందాలన్నదే అందరి ఆకాంక్ష. అయితే అది భగవద్ధామాన్ని చేరినప్పుడు మాత్రమే నెరవేరుతుంది. జీవితంలోని ఆఖరి క్షణంలో చేసే ఆలోచన చివరి పరీక్షలాంటిది. ఈ చివరి పరీక్షకు జీవితాంతం సిద్ధం కావాలి. జీవితమంతా ఆ భగవతుణ్ణి స్మరించే సాధన చేయగలిగితే... మన ఆఖరి క్షణాల్లో రాసే ఆ చిట్ట చివరి పరీక్షలో తప్పకుండా ఉత్తీర్ణులం అవుతాం.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984


మనసు ఏం చేస్తోందో గమనిస్తున్నారా?

విద్యను, సమాచారాన్ని పొందడానికి మనకు ఎన్నో మార్గాలు ఉన్నాయి. పాఠశాలకు, కళాశాలకు, విశ్వవిద్యాలయానికి వెళ్ళడం ద్వారా, గురువుల ద్వారా విద్యను సంపాదించగలం. వార్తా పత్రికల ద్వారా ఇతర మాధ్యమాల ద్వారా సమాచారం తెలుసుకోగలం. పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానాన్ని పొందగలం. ఇలా మనకు ఎన్నో మార్గాలు కనిపిస్తాయి. కానీ జ్ఞానం పొందాలంటే ఇలాంటి మార్గాల ద్వారా సాధ్యం కాదు. మన మనసులో ప్రస్తుతం ఏం జరుగుతోందో తెలుసుకోవడమే జ్ఞానం. కానీ మనసు గురించి అవగాహన చేసుకోవడానికి ఇతర మార్గాలేవీ దోహదపడవు.

ప్రతి క్షణం మీ మనసు ఏం చేస్తోందో, అక్కడ ఏం జరుగుతోందో మీరు గమనించారా? తరువాత జరగబోయేది ఏవిటో అది ఆలోచిస్తూ ఉంటుంది. అది గతానికి, భవిష్యత్తుకు మధ్య ఊగిలాడుతూ ఉంటుంది. గతంలో జరిగిన దాని గురించి విచారంగా, లేదా కోపంగా ఉంటుంది. లేదా భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతుంది. మనస్సుకు మరో ధోరణి కూడా ఉంది. అది: ప్రతికూలతను అంటిపెట్టుకొని ఉండడం. మన జీవితంలో పది సందర్భాలు, సంఘటనల్లో ఒకటి ప్రతికూలంగా జరిగితే... అనుకూలంగా జరిగినవాటిని మరచిపోతాం. ఆ ఒక్క ప్రతికూలమైన దాని గురించే ఆలోచిస్తూ ఉంటాం. ఈ ధోరణిని మార్చుకోవడమే మీకు మీరు చేసుకోగలిగే పెద్ద సహాయం. ఈ ధోరణి గురించి అర్థం చేసుకోవడం వల్ల మీ జీవితం మరింత సహజంగా, మరింత సరళంగా మారుతుంది. అంతర్గతమైన వికాసం కలుగుతుంది. నిజానికి మనం పుట్టినప్పుడు ఎంతో అమాయకంగా ఉంటాం. పరిణతి చెందుతున్నకొద్దీ, తెలివైనవారిగా మారుతున్న కొద్దీ ఆ అమాయకత్వాన్ని కోల్పోతాం. చివరకు కఠినంగా మారుతాం. దానివల్ల జీవితంలో ఆనందం కోల్పోతాం. ఆ కాఠిన్యాన్ని విడిచిపెట్టండి. అందరిపట్ల, అన్నిటిపట్ల దయగా, ప్రేమగా ఉండండి. అప్పుడు జీవితం మరింత ఆనందదాయకంగా, మరింత సంతృప్తికరంగా, ఆసక్తికరంగా మారుతుంది. ఇదంతా మీ మనసును అవగాహన చేసుకున్నప్పుడు, జరుగుతుంది. అందుకోసం మనసు ఏం చేస్తోందో గమనించాలి. ప్రతికూలమైన విషయాల గురించి ఆలోచించడం మానేయాలి. సానుకూలమైన దృక్పథంతో జీవితాన్ని కొనసాగించాలి. అప్పుడు అంతా ఆనందమే!



మనస్సుకు మరో ధోరణి కూడా ఉంది. అది: ప్రతికూలతను అంటిపెట్టుకొని ఉండడం. మన జీవితంలో పది సందర్భాలు, సంఘటనల్లో ఒకటి ప్రతికూలంగా జరిగితే... అనుకూలంగా జరిగినవాటిని మరచిపోతాం. ఆ ఒక్క ప్రతికూలమైన దాని గురించే ఆలోచిస్తూ ఉంటాం.

• శ్రీశ్రీరవిశంకర్

సుభాషితం


ఫలితాలు ఇచ్చేది అదే!

నైవాకృతిః ఫలతి నైవ కులం న శీలం
విద్యాపి నైవ న చ యత్న కృతాపి సేవా
భాగ్యాని పూర్వతపసా ఖలు సంచితాని
కాలే ఫలంతి పురుషస్య యథైవ వృక్షాః..

జీవితంలో మంచి ఫలితాలు పొందడానికి పూర్వ పుణ్యాలే కారణమవుతాయని తన 'నీతి శతకం'లోని ఈ శ్లోకంలో భర్తృహరి వర్ణించాడు. దాన్ని...

రమ్యరూపంబు, విద్యయు, రాజసేవ
కులము శీలంబు జాలవు ఫల మొసంగ
బూర్వపుణ్య సంచిత భాగ్యములు ఫలించు
గాలమున బనసాది వృక్షముల కరణి...

అనే పద్యరూపంలో ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి అందించాడు.




భావం: అందమైన రూపం, ఉన్నతమైన విద్య, గొప్ప కులం, మంచి నడవడిక, అధికారంలో ఉన్నవారి ఆశ్రయం... ఇవేవీ మనిషికి గొప్ప ఫలితాలను ఎల్లప్పుడూ ఇవ్వలేవు. కొన్నిసార్లు వాటివల్ల ప్రయోజనం ఉండదు. పూర్వం చేసిన పుణ్యం వల్ల మాత్రమే కర్మ ఫలం లభిస్తుంది. చెట్లు నాటిన తరువాత... అవి పెరిగి పెద్దవై, పండ్లు కాయడానికి సమయం పడుతుంది. అలాగే తగిన కాలం వచ్చినప్పుడే పూర్వ పుణ్యాల వల్ల ప్రతిఫలం లభిస్తుంది. కాబట్టి ఎప్పుడూ పుణ్యకార్యాలు చేస్తూ ఉండాలి. వాటి వల్ల ఫలితం భవిష్యత్తులో తప్పకుండా ఉంటుంది.

సహజయోగ

సమతుల్యత సాధించాలంటే...

భూమికి అక్షం ఉంటుంది. భూమి చలనం దాని మీద ఆధారపడి జరుగుతుంది. అదే విధంగా మానవుడిని సమతుల్య స్థితిలో ఉంచే అక్షం (ఇరుసు)... సూక్ష్మ నాడీ వ్యవస్థలో అంతర్గతంగా ఉన్న సుషుమ్నా నాడి. ఇదే మనకు ఆధారం. ఇది మనలో మధ్యస్థంగా ఉండే నాడి. ఎవరిలో సుషుమ్నా నాడి సరైన రీతిలో ఉండదో... వారి శరీరంలోని వివిధ చక్రాలలో సమస్యలు, ఇబ్బందులు ఏర్పడతాయి. ఈ ఇరుసు పరిధిని దాటి కుడి పార్శ్వం వైపు మొగ్గినప్పుడు... వ్యక్తి తన అహంకారంతో సమస్యలను సృష్టించుకుంటాడు. ఎడమ ఎడమ పార్శ్వం వైపు మొగ్గు చూపినప్పుడు.. తన వినాశనాన్ని కొని తెచ్చుకుంటాడు. సుషుమ్నా నాడిలో ప్రవహిస్తున్న శక్తి... ముప్పావు వంతు చుట్టుకున్న కాగితంలా ఉంటుంది. దాని లోపలే బ్రహ్మనాడి ఉంటుంది. ఈ బ్రహ్మనాడి మామూలుగా అయితే చాలా సన్నగా.. వెంట్రుక వాసిలో ఉంటుంది. అటువంటి సన్నని బ్రహ్మనాడిలోంచీ ఇంకా సన్నటి పోగులా ఉండే కుండలినీ శక్తి ఊర్ధ్వముఖంగా పయనిస్తుంది. ఈ పోగు బాగా సన్నగా ఉన్నవారు పైకి చూడడానికి గంభీరంగా, ధైర్యంగా తెలివైనవారుగా, మంచివారుగా కనిపిస్తారు. కానీ అంతర్గతంగా ఆధ్యాత్మికమైన లోతు ఉండదు. ఏ వ్యక్తయినా ఆధ్యాత్మికంగా లోతులకు వెళ్ళగలిగినప్పుడు... అతని బ్రహ్మనాడి విశాలం అవుతుంది. దానిలో ప్రయాణించే కుండలినీ పోగులు కూడా వెడల్పుగానే ఉంటాయి. ఆధ్యాత్మికమైన లోతు ఉన్నవారికి వైఖరి చాలా సుందరంగా, మనోహరంగా ఉంటుంది. వారు అందరికీ ఆనందాన్ని పంచుతారు.

కాబట్టి మన సుషుమ్నా నాడిని దృఢంగా ఉంచుకోవడం



చాలా ముఖ్యం. ఈ స్థితిని సాధించడానికి భక్తి శ్రద్ధలే అనువైన మార్గం. ముందు మీ జీవితం మీద మీకు శ్రద్ధ ఉండాలి. "ఈ జీవితంతో నేను ఏం చేస్తున్నాను? నేను జీవితాన్ని ఎలా వృధా చేస్తున్నాను? ఎందుకు వృధా చేస్తున్నాను? నా జీవితానికి పరమార్థం ఉండాలి కదా! ఆ పరమార్థాన్ని నేను నెరవేరుస్తున్నానా?" అనే ప్రశ్నలు మీరు వేసుకోవాలి. అప్పుడు మీ అహంకారంతో పోరాటం చేయడం చాలా సులువని మీరు అర్థమవుతుంది. ఎప్పుడయితే చిత్తం అంతర్గతంగా ప్రయాణం ప్రారంభిస్తుందో... అప్పుడు బ్రహ్మనాడి విస్తరించడం మొదలవుతుంది. ఆ తరువాత ఎలాంటి పరిస్థితులలోనైనా, ఎటువంటి స్థితిలోనైనా, ఎటువంటి జీవన విధానంలోనైనా మీరు సౌకర్యంగా ఉండేలా చేస్తుంది. కుండలినీ జాగృతి ద్వారా ఆత్మ సాక్షాత్కారం పొంది సహజయోగ సాధన చేస్తున్నవారు ఈ స్థితిని సాధించగలరనీ, నిరంతర ధ్యాన సాధన ద్వారా ఈ స్థితిని సుస్థిరపరుచుకోగలరని శ్రీమాతాజీ నిర్మలాదేవి పలు సందర్భాలలో స్పష్టం చేశారు.

డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి,
సహజయోగ ట్రస్ట్', తెలంగాణ


శాంతిపథంలో తొలి మెట్టు

చింతన



మనం చదువుకోవాలంటే బడికి వెళ్ళాలి. ఆడుకోవాలంటే ఆట వస్తువులు బజార్లో దొరుకుతాయి. ఇలా మనకు కావలసింది ఏదైనా మన దగ్గర లేదనే విషయాన్ని ప్రపంచం మనకు నేర్పుతుంది. శాంతి విషయంలోనూ ఇలాగే ఆలోచిస్తాం. కానీ అది ఎక్కడో బయట ఉండదు. మన లోపలే ఉంటుంది. ఇది మనం తెలుసుకోవలసిన అతి ముఖ్యమైన విషయం. శాంతి పథంలో ఇదే తొలిమెట్టు.

శాంతి మీలోనే ఉంది...

మీరు తొలి అడుగు వెయ్యవలసింది ముందుకు కాదనీ, వెనక్కి అనీ నేను చెప్పినప్పుడు... చాలా మంది 'ఎప్పుడూ ముందుకే అడుగు వెయ్యాలి కదా!' అని ఆలోచిస్తూ ఉంటారు. కానీ మనం ముందుకు కాదు, లోపలివైపు అడుగు వెయ్యాలి. ఎందుకంటే మీకు అవసరమైన శాంతి మీలోనే నిక్షిప్తం అయి ఉంది. ఇప్పుడు కూడా ఉంది. మీరు కోపంతో రగిలిపోతున్న సమయంలో కూడా ఉంటుంది. అలాగే మీరు దుఃఖంలో విలవిలలాడిపోతున్న సమయంలో, సుఖ సంతోషాలతో తులతూగుతున్న సమయంలో కూడా ఉంటుంది. ప్రపంచంలో ఎవరు ఎక్కడ ఉన్నా, కటిక పేదవారైనా, గొప్ప ఐశ్వర్యవంతులైనా ప్రతి ఒక్కరూ దాన్ని స్వయంగా అనుభూతి పొందవచ్చు.

అది అసాధ్యం కాదు...

ఎవరికో దాహంగా ఉందని తెలిసి... నేను నాలుగు గ్లాసుల నీరు ఇచ్చి వచ్చాను. "అతని దాహం తీరిపోయి ఉంటుందా?" అని ఎవరైనా అడిగితే... "నేను నాలుగు గ్లాసుల నీరు ఇచ్చి వచ్చాను, తప్పకుండా తీరిపోయి ఉంటుంది" అని చెబుతాను. కానీ ఆ వ్యక్తి నీరు తాగకుండా ఉంటే దాహం ఎలా తీరుతుంది? శాంతి విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది. యుద్ధాలు జరగకపోతే శాంతి ఏర్పడుతుందని భావిస్తారు. కానీ శాంతిగా ఉన్నప్పుడు యుద్ధం ఎలా మొదలైంది? కాబట్టి ఏవైతే జరుగుతున్నాయో వాటన్నిటికీ కారణం... శాంతి లోపించడం. 'ఇంతమందిని శాంతిపథంలో నడిపించడం అసాధ్యం' అని మీకు అనిపించవచ్చు.

కానీ ఈ ప్రపంచంలో యాభైశాతం మంది శాంతి పథంలో అడుగు పెట్టినా... మిగిలిన వారిపై ఆ ప్రభావం తప్పకుండా ఉంటుంది. మీరు గడిపే ఏ క్షణమైన మళ్ళీ తిరిగిరాదని గుర్తించి, ప్రతి రోజునూ కాపాడుకోవాలి. వృధాగా గడిచిపోకుండా చూసుకోవాలి.

దేన్నీ వదిలెయ్యాల్సిన అవసరం లేదు...


మనకు లభించిన ఈ జీవితకాలంలోని ప్రతి క్షణంలో దాగిన జీవన మాధుర్యాన్ని, శాంతిని అనుభూతి చెందడం చాలా అవసరం. జీవితంలో ఈ చిన్న పని చేయలేకపోతే మానవ శరీరం లభించడం వల్ల ప్రయోజనం ఏమిటి? ఈ మాట వినగానే 'మేము మా సంసారాలను, ఇల్లు వాకిళ్ళను వదిలేసి వెళ్ళాలా?' అని కొందరు అడుగుతారు. మీరు అవేవీ వదిలెయ్యాల్సిన పని లేదు. మీకు ఉన్న అన్ని బాధ్యతలను చక్కగా నిర్వహించండి. వాటితోపాటు మీలో కొలువై ఉన్న ఆ భగవంతుణ్ణి అనుభూతి చెందే బాధ్యతను కూడా నెరవేర్చుకోమని చెబుతున్నాను. ఆ బాధ్యతను విస్మరించకండి. ఈ విషయాలన్నిటినీ కేవలం నమ్మితే సరిపోదు. అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. మీరు జ్ఞానం స్వీకరించడానికి శ్రద్ధ ఉండాలి, ఆరాటం ఉండాలి. ఎందుకంటే మనిషిలో జిజ్ఞాస అనేది లేకపోతే విషయం అర్థం కాదు. మీలో ఉన్న శాంతి కోసం అన్వేషించండి. శాంతిని మీరు మీ అంతరంగంలోనే అనుభూతి చెందడం కోసం ప్రయత్నించండి.

• ప్రేమ్ రావత్
9246275220
www.premrawat.com

సద్బోధ

అంతా సమానమే

సమాజంలో కొన్ని ఆచారాలు, సంప్రదాయాలు, పద్ధతులు ఉంటాయి. సాధారణ ప్రజలు వాటిని సాధ్యమైనంతవరకూ ఆచరిస్తారు. వయస్సులో పెద్దవారు వస్తే చిన్నవారు లేచి నిలబడతారు. పండితులు వస్తే పామరులు లేచి నిలబడి నమస్కరిస్తారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వస్తే... ఇతరులు వారికి స్వాగతం పలికి, పూలదండలు వేసి, శాలువాలు కప్పి తమ గౌరవాన్ని చాటుతారు. కానీ జ్ఞానులు ఇలాంటి సాంఘిక ఆచారాలు పాటించడంలో శ్రద్ధ చూపించరు. పెద్దలు, పిన్నలు, ధనికులు, పేదలు, , పండితులు, పామరులు, రాజులు, సామాన్యులు... ఇలా అందరిపట్లా సమభావమే కనబరుస్తారు. వారికి అణకువ ఉండదు, అహంకారం కూడా ఉండదు. సమత్వ గుణం వారిలో తొణికిసలాడుతూ ఉంటుంది. తమలో లేని అణకువను, నమ్రతను కృత్రిమంగా తెచ్చిపెట్టుకొని నటించరు. తమకు ఏది చేయాలని తోస్తే అది చేస్తారు. "నాకు అణకువ మీద విశ్వాసం లేదు. నేను సమదర్శిత్వాన్ని నమ్ముతాను" అన్నారు స్వామి వివేకానంద. అలాంటి వ్యక్తి లావోట్జు. చైనా తత్త్వవేత్తలలో కన్ఫ్యూసియస్ ప్రముఖుడు. అతను అన్ని మర్యాదలు, ఆచారాలు, పద్ధతులు తెలిసినవాడు. ప్రజలందరూ లావోట్జు గురించి గొప్పగా చెప్పుకోవడం అతను విన్నాడు. ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఉన్న లావోట్జును



వెతుక్కుంటూ వెళ్ళి కలిశాడు. ప్రశాంతంగా కూర్చొని ఉన్న లావోట్జుతో "నేను కన్ఫ్యూసియస్‌ని. మీతో కొన్ని విషయాలు చర్చించాలని వచ్చాను" అన్నాడు. తన గొప్పతనం గురించి లావోట్జు విని ఉంటాడనీ, తను ఎవరో చెప్పిన వెంటనే లేచి నిలబడతాడనీ ఊహించాడు. కానీ లావోట్జు లేచి నిలబడలేదు.

అప్పుడు కన్ఫ్యూసియస్ "నేను నీకన్నా వయసులో పెద్దవాణ్ణి. పాండిత్యంలో నిన్ను మించినవాణ్ణి. లేచి నిలబడాలనే మర్యాద కూడా నీకు తెలీదా"? అన్నాడు కోపంగా.

లావోట్జు గట్టిగా నవ్వి "నాకన్నా ఎవరూ పెద్దవారూ లేరు, చిన్నవారూ లేరు. 'నేను', 'పెద్దవాణ్ణి' అనే అహంకారాన్ని పక్కన పెట్టి కూర్చో, మాట్లాడుకొందాం" అన్నాడు.


కన్ఫ్యూసియస్‌కు కనువిప్పు కలిగింది. తనకు ఉన్నది ఉత్త పాండిత్యమేననీ, లావోట్జుకు ఉన్నది అనుభవ జ్ఞానమనీ, ఆ జ్ఞానం ముందు తన మేధస్సు, పాండిత్యం నిర్జీవ పదార్థాలనీ తెలిసివచ్చింది. లావోట్జు తను ఊహించలేనంత ఉన్నతుడని గ్రహించాడు. అతనికి నమస్కరించి, వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

గీతాసారం

స్థిరమైన బుద్ధి

మన జీవిత ప్రయాణంలో మనం ఎన్నో విషయాలను వింటూ ఉంటాం. వాటిలో ఒకే అంశం గురించి విరుద్ధమైన అభిప్రాయాలు ఉంటాయి. ఇది మనకు కలవరపాటు కలిగిస్తాయి. వార్తలు కావచ్చు, ఇతరుల అనుభవాలు కావచ్చు, నమ్మకాలు కావచ్చు. వాటి మీద వివిధ అభిప్రాయాలు, వాదనలు విన్నప్పుడు కూడా మన బుద్ధి స్థిరంగా ఉన్నప్పుడే అత్యున్నతమైన యోగ స్థితిని పొందుతామని 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు బోధించాడు. దీనిలోని అంతరార్థాన్ని అవగాహన చేసుకోవడానికి చెట్టు సరైన ఉదాహరణ. చెట్టు పైభాగం మనకు కనిపిస్తుంది. దాని కింది భాగం వేర్ల మూల వ్యవస్థతో కూడి ఉంటుంది. అది బయటకు కనిపించదు. పైభాగం తీవ్రమైన గాలులకు ఊగుతూ ఉంటుంది. కానీ దానివల్ల వేర్ల వ్యవస్థ ప్రభావితం కాదు. ఎగువ భాగం బాహ్య శక్తుల ప్రభావంతో ఊగిపోతూ ఉంటే... దిగువ భాగం నిశ్చలంగా, సమాధి స్థితిలో ఉన్నట్టు ఉంటుంది. అది స్థిరంగా ఉడడంతోపాటు మొత్తం చెట్టుకు పోషకాహారాన్ని అందించే బాధ్యతను నిర్వహిస్తుంది. బాహ్యాభాగం ఊగిసలాడుతూ... అంతర్గతంగా నిశ్చలంగా ఉండడమే చెట్టుకు యోగ స్థితి.



అజ్ఞాన స్థితిలో ఉన్నప్పుడు మన బుద్ధి చంచలంగా ఉంటుంది. అది బయటి విషయాల ప్రభావానికి గురై దానంతట అదే ఊగిసలాడుతూ ఉంటుంది. తాత్కాలికమైన స్పందనలు, ఉద్వేగాలు, కోపాల రూపంలో ఈ ఊగిసలాట మన నుంచి బయటకు వస్తుంది. మన జీవితాలను సమస్యాత్మకం చేస్తుంది. మన వ్యక్తిగత జీవితాలనే కాదు, మన కుటుంబ సభ్యుల జీవితాలను, మనం పని చేసే చోట తోటి వారి జీవితాలను కూడా ఇది సమస్యాత్మకంగా మారుస్తుంది. కొందరు ఈ ఊగిసలాటను అణచివెయ్యడం కోసం ముఖానికి ఒక ముసుగు తొడుక్కుంటారు. అందరిముందూ ధైర్యంగా, ఆహ్లాదంగా ఉన్నట్టు ప్రవర్తిస్తారు. కానీ ఇది ఎక్కువకాలం సాగదు. ఈ బాహ్యమైన ఊగిసలాటలు అనిత్యమైనవని తెలుసుకొని... నిశ్చలంగా ఉన్న అంతరాత్మను చేరుకోవడమే దీనికి పరిష్కారమని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు.

కె. శివప్రసాద్
ఐఏఎస్





సౌత్ మోపూరులో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

సౌత్ మోపూరులో కోటితో అభివృద్ధి పనులు

- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోటంరెడ్డి
- 'ఆంధ్రజ్యోతి'కి గ్రామస్థుల కృతజ్ఞతలు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం 'ఆంధ్రజ్యోతి- ఏబీఎన్' నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా కార్యక్రమంతో సత్ఫలితాలొస్తున్నాయి. నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరులో సమస్యలను ప్రస్తావిస్తూ జనవరి 27న 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆ మర్నాడు నిర్వహించిన 'అక్షరం అండగా..' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. సమస్యల పరిష్కారానికి గాను రూ.కోటి కేటాయిస్తున్నామని, పది రోజుల్లోపే పనులు మొదలుపెడతామని ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు రూ.1.22 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులకు ఆయన గురువారం శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

సాగుకు 9 గంటలు ఉచిత విద్యుత్!

- అమలుకు కట్టుబడి ఉన్నాం
- సీజీఎంపై చార్జిషీట్, బదిలీ వేటు వేశాం
- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తొమ్మిది గంటల ఉచిత వ్యవసాయ విద్యుత్ అమలుకు కట్టుబడి ఉన్నామని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు స్పష్టం చేశారు. 'సీమలో సాగుకు ఏడు గంటలే కరెంటు!' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో 9గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల పరిధిలో రైతులకు 9 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని చెప్పారు. వేసవి విద్యుత్ వినియోగానికి అనుగుణంగా వ్యవసాయనికి 9 గంటల విద్యుత్ సరఫరా అంశంపై జిల్లా అధికారులకు చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఆదేశాలిచ్చే క్రమంలో సమయ గణాంకాల్లో పొరపాట్లు దొర్లాయని, ఆ తర్వాత సవరణ ఉత్తర్వులిచ్చినా వాటిని సీజీఎం పట్టించుకోలేదని తెలిపారు. ఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకోకుండా సరఫరా సమయాలు మార్చినందుకు సీజీఎం (ఆపరేషన్స్)కు చార్జిషీట్ ఇవ్వడంతో పాటు బదిలీ చేశామని చెప్పారు.


కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కేశవ్, మనోహర్, సత్యకుమార్

మధ్యాహ్న భోజనంలో తృణధాన్యాలు!

మంత్రుల కమిటీ సమావేశంలో నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం, సంక్షేమ పథకాల్లో తృణధాన్యాలను చేర్చాలని, ఏపీ మిషన్ మిల్లెట్ పథకం ద్వారా జొన్నలు, రాగులు తదితరాల వినియోగాన్ని ప్రోత్సాహించాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. ధరల పర్యవేక్షణకు రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రుల కమిటీ గురువారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమై మార్కెట్‌లో ధరల పరిస్థితిపై సమీక్షించింది. మంత్రులు పయ్యావుల కేశవ్(ఆర్థిక), అచ్చెన్నాయుడు(వ్యవసాయ), సత్యకుమార్(ఆరోగ్య), ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. గతేడాదితో పోల్చితే కందిపప్పు 13 శాతం, వేరుశెనగ నూనె 4 శాతం, మిర్చి 27 శాతం ధరలు తగ్గాయని మంత్రులు తెలిపారు. ధరల అదుపునకు తగు చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా మార్కెట్ ధరలపై నిత్యం పర్యవేక్షణ ఉండాలని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రులు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 154 మండల కేంద్రాల నుంచి, 151 రైతు బజార్ల నుంచి ప్రతిరోజూ సీపీ యాప్ ద్వారా ధరలు సేకరిస్తూ వాటిపై విశ్లేషణ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

దండకారణ్యం కాదు... ఉక్కు నగరం



దట్టమైన అడవిలా కనిపిస్తున్న ఈ ప్రాంతం దండకారణ్యం కానే కాదు. విశాఖలోని ఉక్కు కర్మాగారానికి చెందిన ప్రాంతం. దాదాపు 25 వేల ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రాంతం పచ్చదనంతో కళకళలాడుతోంది. పైనుంచి చూస్తే అడవిలా కనిపించే ఈ ప్రాంతానికి కొంచెం దగ్గరగా వెళితే.. ఉద్యోగుల నివాసాలూ కనిపిస్తాయి. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇలా మొక్కలు, చెట్లను భారీగా పెంచారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

పరిష్కారం.. కాగితాల్లోనే?

- రైతుల నుంచి 4.20 లక్షల ఫిర్యాదులు
- రీ సర్వే అప్పీల్స్‌ను పట్టించుకోని ఆర్ఎస్ డీటీలు
- జగన్ జమానాలో భ్రష్టుపట్టిన అప్పీల్స్ విధానం
- తాజాగా గుర్తించిన రెవెన్యూ శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ జమానాలో భూముల రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల నుంచి 4.20 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. అవన్నీ పరిష్కరించేశామని రీ సర్వే డీటీలు నివేదికలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో రీ సర్వేపై 2.80 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. మరి అప్పట్లోనే ఫిర్యాదులన్నీ పరిష్కరించేస్తే మళ్లీ ఎందుకు వస్తున్నాయి?.. అంటే ఆ పరిష్కారమంతా జరిగింది కాగితాల్లోనే. ఫిర్యాదుల పరిష్కారానికి అప్పట్లోనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినా.. అది పనిచేయలేదు. ఎందుకని రెవెన్యూ ఉన్నతాధికారులు ఆరా తీస్తే.. విస్తుగొలిపే విషయాలు వెలుగుచూశాయి.

కొలువు ఒకచోట.. పని చేసేది మరోచోట

జగన్ ప్రభుత్వం మూడున్నరేళ్లలో ఎనిమిది వేల గ్రామాల్లో భూములను రీ సర్వే చేసిన సంగతి తెలిసిందే. సర్వే, సరిహద్దుల చట్టం ప్రకారం రీ సర్వేలో తప్పులు వస్తే వాటిని పరిష్కరించడానికి మండల స్థాయిలో ప్రత్యేకంగా అప్పీల్స్ వ్యవస్థ ఉండాలి. డిప్యూటీ తహసీల్దార్ స్థాయి అధికారి అప్పీల్స్ చూడాలి. దీంతో సీనియర్ అసిస్టెంట్లకు డీటీలుగా పదోన్నతులు కల్పించి అప్పీల్స్ చూసే బాధ్యతను అప్పగించారు. ఇలా 679 మండలాలకు అప్పీల్స్ డీటీలను నియమించారు. వీరి బాధ్యత పూర్తిగా రీ సర్వే కేసుల పరిష్కారమే. వారు మరో పనిలో భాగస్వాములు కావడానికి వీల్లేదు. అయితే, ఆచరణలో ఈ వ్యవస్థ పనితీరు గాడితప్పింది. రీ సర్వే డీటీలుగా పోస్టింగ్‌లు పొందిన అనేక మంది నాటి వైసీపీ నేతల అండదండలు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో ఉన్న పరిచయాలతో రెవెన్యూ రెగ్యులర్ డీటీలుగా ఎఫ్ఏసీ అధికారాలు (పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు) పొందారు. మరికొందరు పౌరసరఫరాల శాఖ డీటీలుగా పోస్టింగ్‌లు తెచ్చుకున్నారు. ఇలా రీ సర్వే ప్రాజెక్టులో, అటు ఎఫ్ఏసీ కింద ఇతర శాఖల్లో జోడు పోస్టులు నిర్వహించారు. రెవెన్యూ శాఖలో డీటీల కొరత తీవ్రంగానే ఉంది. దీంతో కలెక్టర్లు రీసర్వే డీటీలకు అదనపు బాధ్యతల కింద ఇతర శాఖల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. దీంతో వీరంతా ఇతర శాఖల పనిలో బిజీగా ఉండిపోయి.. రీ సర్వే సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టలేదు. అయినా ఈ విషయాన్ని జగన్ ప్రభుత్వం మరుగున పెట్టింది. రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల నుంచి 4.20 లక్షల ఫిర్యాదులు వచ్చాయని, వాటిని రీ సర్వే డీటీలు పరిష్కరించారని నివేదికలు తయారు చేసింది. రీ సర్వే అప్పీల్స్ పరిష్కారమయ్యాయి కాబట్టే ఆ గ్రామాల్లో రీ సర్వే ఫైనల్ నోటిఫికేషన్లు జారీ చేశారు. కానీ, రీ సర్వే అనంతరం ఇచ్చిన కొత్త పాస్ పుస్తకాలు, రికార్డుల్లోనూ తప్పులు కనిపించాయి. దీంతో రైతులు జగన్ ఫొటోలున్న పాస్ పుస్తకాలు చించేశారు. భూముల విస్తీర్ణంలో తేడాలు, సర్వే నంబర్లతో తప్పులు, సరిహద్దుల్లో లోపాలు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఫిర్యాదులను గాలికొదిలేశారు!

కూటమి ప్రభుత్వం వచ్చాక రీ సర్వే జరిగిన 8,680 గ్రామాల్లో సభలు నిర్వహించగా 2.80 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. రీ సర్వే సరిగ్గా చేయలేదని, భూమి విస్తీర్ణం తగ్గించారని, రికార్డుల్లో తప్పులు ఉన్నాయని రైతులు ఫిర్యాదులు చేశారు. వీటిపై సర్వే శాఖ పరిశీలన చేయగా, అవన్నీ అప్పీల్స్ డీటీలు పరిష్కరించాల్సిన కేసులని నిర్ధారణ అయింది. వీరు గత ప్రభుత్వంలో కేసుల పరిష్కారం ఎందుకు చేయలేకపోయారని అధికారులు ఆరా తీశారు. అప్పీల్స్ వ్యవస్థ చట్టప్రకారం, నిబంధనల మేరకు పని చేయలేదన్న నిర్ధారణకు వచ్చారు. నేరుగా కొందరు డీటీలతో మాట్లాడగా.. తమకు డబుల్ పోస్టులు ఇచ్చారని, రీ సర్వే పని కాకుండా మిగతా వర్క్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చామని కొందరు డీటీలు చెప్పారు. మరి 4.20 లక్షల అప్పీల్స్‌ను ఎలా పరిష్కరించారని ఆరా తీయగా.. అదంతా కాగితాలపైనే జరిగిందని కొందరు అధికారులు తేల్చేసినట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన తర్వాత బుధవారం నాటి అప్పీల్స్ డీటీల సమావేశంలో సీసీఎల్ఏ జయలక్ష్మి, సర్వే డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డిలు తీవ్ర ఆగ్రహం, అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. అప్పీల్స్‌ను పరిష్కరించకపోతే సస్పెండ్ చేస్తానని సీసీఎల్ఏ తీవ్ర హెచ్చరికలు చేశారు.

ఇప్పటికైనా దారికొస్తారా?

ప్రస్తుతం 697 గ్రామాల్లో రీ సర్వే కొత్తగా పైలెట్ ప్రాజెక్టుగా సాగుతోంది. కూటమి ప్రభుత్వంలోనూ అప్పీల్స్ డీటీలు అసలు పనికన్నా కొసరు పనులపైనే ఎక్కువ దృష్టిపెడితే ఎలా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రెవెన్యూ శాఖ ఇదే అంశంపై దృష్టిసారించినట్లు కనిపిస్తోంది. బుధవారం నిర్వహించిన అప్పీల్స్ డీటీల సమావేశంలో.. ఇకపై వారం వారం పనితీరు నివేదికలు పంపించాలని టార్గెట్ పెట్టింది. రైతుల సమస్యలు పరిష్కరించని పక్షంలో సస్పెన్షన్‌కు గురికావాల్సి ఉంటుందని సీసీఎల్ఏ హెచ్చరించారు. ప్రతీ మూడు నెలలకోసారి డీటీల పనితీరును సమీక్షిస్తామని, తప్పు చేసినట్లు తేలితే వెంటనే రివర్షన్ ఇస్తామని సర్వే డైరెక్టర్ హెచ్చరించారు. మరి ఇప్పటికైనా డీటీలు రీ సర్వే సమస్యలపై దృష్టిపెట్టి, రైతుల కష్టాలు తీరుస్తారా?

'బనకచర్ల' మా అంతర్గతం!

- తెలంగాణ, కృష్ణా బోర్డు జోక్యానికి వీల్లేదు: ఆంధ్ర
- జల వనరుల శాఖ ప్రత్యేక సీఎస్‌తో కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి భేటీ
- సాగర్ ఎడమ కాలువ వద్ద రాష్ట్ర ఎస్పీఎఫ్: సాయిప్రసాద్ స్పష్టీకరణ
- బెజవాడలోనే బోర్డు కార్యాలయం: రాయ్‌పురే

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పోలవరం-బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ పథకం పూర్తిగా తమ రాష్ట్ర అంతర్గత వ్యవహారమని.. ఇందులో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు గానీ, తెలంగాణ గానీ జోక్యం చేసుకునేందుకు వీల్లేదని ఏపీ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ స్పష్టం చేశారు. గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే ఆయన్ను కలిశారు. పోలవరం-బనకచర్లపై తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలు.. నీటి లెక్కలు.. వాటర్ గేజ్‌ల అమరిక అంశాలను ప్రస్తావించగా.. సాయిప్రసాద్ ఘాటుగా స్పందించారు. 'ఈ ప్రాజెక్టు పూర్తిగా రాష్ట్ర పరిధిలోని అంశం. మా అంతర్గత జలాల వ్యవహారం. దీనిపై తెలంగాణకు అభ్యంతరాలేవిటి? ఇందులో కేఆర్ఎంబీ జోక్యం ఏమిటి' అని ప్రశ్నించారు. అభ్యంతరాలను బోర్డు లేవనెత్తడం లేదని.. తెలంగాణ మాత్రమే లేవనెత్తిందని రాయ్‌పురే చెప్పారు. నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ వద్ద సీఐఎస్ఎఫ్‌ను తొలగించాక.. భద్రతా సిబ్బంది లేకపోవడంపైనా చర్చకు వచ్చింది. అక్కడ రాష్ట్ర ఎస్పీఎఫ్ బలగాలను నియమించేందుకు ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావును సాయిప్రసాద్ ఆదేశించారు. తెలంగాణ ప్రతిపాదించినట్లుగా ఏపీ పరిధిలోని కృష్ణా ప్రాజెక్టుల్లో వాటర్ గేజ్‌లు ఏర్పాటు చేసేది లేదని రాయ్‌పురేకు తేల్చిచెప్పారు. జల వనరుల శాఖ ఇంజనీర్లను ఐదేళ్ల కాలానికి కేఆర్ఎంబీకి డిప్యుటేషన్‌పై పంపడానికి ఎలాంటి అభ్యంతరమూ లేదన్నారు. కాగా.. విజయవాడలోనే కృష్ణా బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని రాయ్‌పురే ఆయనకు చెప్పారు.

కర్నూలు కాంగ్రెస్‌లో 'కార్యాలయ కబ్జా' కల్లోలం!

కళావెంకటరావు భవన్ పేరిట ప్రైవేట్ సొసైటీ రిజిస్ట్రేషన్

- అధిష్ఠానం అనుమతి లేకుండానే వ్యవహారం
- కబ్జా కుట్రలో భాగమే: నంద్యాల డీసీసీ అధ్యక్షుడు

కర్నూలు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కాంగ్రెస్‌లో 'పార్టీ కార్యాలయం కబ్జా' వ్యవహారం కల్లోలం రేపుతోంది. కొండారెడ్డి బురుజు సమీపంలో కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం (కళా వెంకట్రావ్ భవన్) ఉంటుంది. ఆఫీస్ ఉండే 33 సెంట్ల స్థలం విలువ రూ.16 కోట్లు పైమాటే. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ అధ్యక్షుడిగా ఏడుగురితో ప్రైవేటు సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించడం ఆ పార్టీలో కల్లోలానికి కారణమైంది. దీనిపై విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశించారు. దీంతో ఆ పార్టీ నేతలు గురువారం కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అటెండర్, స్వీపర్లకు సొసైటీలో పదవులు!

ఎన్నికల ముందు వరకు వైసీపీలో ఉన్న కోడుమూరు మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ ఆ పార్టీ టికెట్ రాకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. గత ఐదు నెలలుగా డీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. డీసీసీ కార్యాలయ పరిధిలోని 15 దుకాణాల ద్వారా నెలకు రూ.1.80 లక్షలు ఆదాయం వస్తోంది. ఏఐసీసీ, పీసీసీ అనుమతులు లేకుండా, జిల్లా కాంగ్రెస్ కమిటీ తీర్మానం చేయకుండానే ప్రైవేటు సొసైటీ రిజిస్ట్రేషన్ చేయడం, ఆఫీసు ఆస్తులను దాని పరిధిలోకి తీసుకొచ్చి కబ్జా చేయాలనే కుట్రలో భాగంగానే మురళీకృష్ణ ఈ ఎత్తుగడ వేసినట్లు పార్టీలోని ఓ వర్గం ఆరోపిస్తోంది. కార్యాలయంలో పనిచేసే అటెండర్, స్వీపర్లకు కార్యదర్శి, ట్రెజరర్ వంటి కీలక పదవులు ఇస్తూ రిజిస్ట్రేషన్ చేయడం అనుమానాలకు తావిస్తోంది. కబ్జా ఆరోపణలపై విచారణ బాధ్యతలను షర్మిల ఆ పార్టీ నేత గిడుగు రుద్రరాజుకు అప్పగించారు. మురళీకృష్ణ పార్టీ ఆస్తులను సొంతవిగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించారని, అక్రమాలకు పాల్పడినట్లు తన దృష్టికి వచ్చిందని షర్మిల పేర్కొన్నారు.



కర్నూలు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం

కబ్జా కుట్రలో భాగమే..: లక్ష్మీనరసింహ

కబ్జా కుట్రలో భాగంగానే మురళీకృష్ణ సొసైటీ రిజిస్ట్రేషన్ చేశారని నంద్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్, పలువురు ఇతర నేతలు గురువారం ఆరోపించారు. కాంగ్రెస్ ఆస్తులకు తానే యాజమానిగా ప్రకటించుకునే కుట్ర పన్నారని, గుమాస్తా, స్వీపర్లను సొసైటీలో సభ్యులుగా చేర్చారన్నారు. పీసీసీ, డీసీసీలకు సమాచారం ఇవ్వకుండా నిర్ణయం తీసుకోవడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, సొసైటీ రిజిస్ట్రేషన్ రద్దుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

ఈకేవైసీ కోసమే సొసైటీ: మురళీకృష్ణ

ఈ కేవైసీ కోసమే సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించానని, ఆ సొసైటీని రద్దు చేసుకున్నామని మురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పరువు తీసేలా కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. తన కుటుంబం ఆర్థికంగా బాగుందని, కాంగ్రెస్ ఆస్తులు తనకు అవసరం లేదని తెలిపారు. గతేడాది సెప్టెంబరు 14న జిల్లా కాంగ్రెస్ కమిటీ తీర్మానం మేరకే సొసైటీ రిజిస్ట్రేషన్ చేయించామని తెలిపారు.


విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్ వంటశాలను పరిశీలిస్తున్న మంత్రి సవిత

బీసీ రుణాల దరఖాస్తు గడువు పెంపు

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న బీసీ కార్పొరేషన్ల రుణాలను అర్హులందరికీ అందజేయాలని, దరఖాస్తు గడువు ఈ నెల 12వరకు పెంచామని మంత్రి ఎస్ సవిత చెప్పారు. రుణాల సద్వినియోగంపై విజయవాడ బీసీ భవన్‌లో వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ గడువు పెంపు సమాచారాన్ని జిల్లాలకు అందించాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు మాత్రమే ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు.

అది బూటకపు ఎన్‌కౌంటర్.. మావోయిస్టుల లేఖ

చింతూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో రాజ్య హింస రోజురోజుకూ పెరుగుతోందని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. ఈ మేరకు ఆ పార్టీ సౌత్ జోనల్ బ్యూరో సమత పేరిట గురువారం ఓ లేఖ విడుదలైంది. ఆపరేషన్ కగార్ పేరిట అమాయక ఆదివాసీలను హత్య చేయడం, అది ఎన్‌కౌంటర్ అంటూ ప్రచారం చేసుకోవడం పరిపాటిగా మారిందని ఆరోపించారు. గంగులూర్ పరిధి తోడ్కాలో ఇటీవల ఎనిమిది మంది గ్రామీణులను హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా చెప్పుకొన్నారన్నారు. హింసకు పాల్పడుతున్న జవాన్లపై చర్యలు చేపట్టాలన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకూ పోరాటం: సీపీఐ

అమరావతి, విశాఖపట్నం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజలకు పట్టణాల్లో 2సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలం ఇచ్చేంత వరకూ తమ పార్టీ పోరాడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. భూమితో పాటు ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షలు చొప్పున ఇవ్వాలని కోరారు. కాగా, ఏపీకి రూ.3లక్షల కోట్ల నిధులు విడుదల చేశామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అబద్ధాలు చెప్పడం దుర్మార్గమని కె.రామకృష్ణ విమర్శించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి కేంద్రం నుంచి రాష్ట్రానికి విడుదలైన నిధుల వివరాలతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం చంద్రబాబుకు గురువారం లేఖ రాశారు.

ఏపీకి ప్రత్యేక హోదా చర్చకే పరిమితమా?: జేడీ

తిరుపతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రత్యేక హోదా చర్చనీయాంశంగానే మిగిలిపోయిందని జేడీ లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా సాధన సమితి సభ్యులతో కలిసి గురువారం ఆయన తిరుపతిలో మాట్లాడారు. 'విభజన తర్వాత ప్రత్యేక హోదా కోసం అనేక సందర్భాల్లో పోరాటాలు చేసినా ఫలితం లేకపోయింది. విభజన చట్టం ప్రకారం పోలవరాన్ని నేషనల్ ప్రాజెక్టుగా కేంద్రం పూర్తిచేయనున్నా, 41.15 మీటర్లు ఎత్తుకు నీటి నిల్వ పరిమితం చేయడం వల్ల చాలా నష్టం జరుగుతుంది' అని జేడీ అన్నారు. చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ... 'అమరావతి నిర్మాణానికి రూ.17వేల కోట్లు కేంద్రం నుంచి సాయం కాదు. మన తలలు తాకట్టు పెట్టి ప్రపంచ బ్యాంకు నుంచి తెచ్చారు' అని అన్నారు.

విలువల గురించి జగన్ మాట్లాడటం... పాతివ్రత్యం గురించి చింతామణి చెప్పినట్టుంది

- ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఎద్దేవా



వేంపల్లె, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ విశ్వసనీయత, విలువల గురించి మాట్లాడడం హాస్యాస్పదమని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'దుశ్శాసనుడు మహిళా సాధికారిత గురించి, చింతామణి పాతివ్రత్యం గురించి, గాడ్సే అహింస గురించి మాట్లాడితే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. తన తండ్రి మరణానికి రిలయన్స్ అధినేత అంబానీ కారణమని చెప్పి ఆయన ఆస్తుల మీద దాడి చేయించి.. అధికారంలోకి వచ్చాక ఆయన సిఫారసు చేసిన పరిమళ్ నత్వానీకి రాజ్యసభ సీటు ఇచ్చారు. పోలవరం, సీపీఎస్ రద్దు, నిరుద్యోగులు, మద్యనిషేధం అగ్రిగోల్డ్ బాధితులు, రైతుభరోసా, పెట్రో ధరల విషయాల్లో మాట తప్పారు. తనకు సొంత పేపర్ లేదని, తాను పేదవాడినని పచ్చి అబద్ధం ఆడారు. విశ్వసనీయత గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది' అని తులసిరెడ్డి మండిపడ్డారు.

వాట్సాప్ గవర్నెన్స్‌తో అవినీతికి ఆస్కారం ఉండదు

- టీడీపీ ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, కృష్ణప్రసాద్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌తో అవినీతికి ఆస్కారం ఉండదని టీడీపీ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, తెన్నేటి కృష్ణప్రసాద్ చెప్పారు. ప్రజలకు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. ఢిల్లీలో దగ్గుమళ్ల మాట్లాడుతూ కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత రీతిలో నిధులు, ప్రాజెక్టుల కేటాయింపు జరిగిందన్నారు. ఎంపీ తెన్నేటి మాట్లాడుతూ 1995లో నాటి సీఎం చంద్రబాబు జన్మభూమి ద్వారా ప్రజల వద్దకు పాలన తెస్తే, ఇప్పుడు మంత్రి లోకేశ్ వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర యాప్ ద్వారా 161 సేవలను ప్రజలకు చేరువ చేశారని తెలిపారు.

పీఎంకేఎస్‌వై కింద 8 ప్రాజెక్టుల నిర్మాణం: కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన(పీఎంకేఎస్‌వై) వేగవంతమైన నీటిపారుదల ప్రయోజన కార్యక్రమం(ఏఐబీపీ) కింద ఏపీలో 8 ప్రధాన, మధ్యతరహా ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని కేంద్ర జలశక్తి సహాయమంత్రి రాజ్‌భూషణ్ చౌదరి అన్నారు. గురువారం లోక్‌సభలో టీడీపీ సభ్యుడు కేశినేని చిన్ని అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2025-26 నాటికి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయటమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. కాగా, స్మార్ట్ సిటీస్ మిషన్ కింద అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నంలలో ప్రస్తుతం రూ.928 కోట్ల విలువైన 45 ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోకన్ సాహూ తెలిపారు. గురువారం లోక్‌సభలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

ఉన్నత విద్యామండలి X కళాశాల విద్యాశాఖ!

- ఉన్నత విద్యాశాఖలో అధికారం కోసం పోరాటం
- పలు అంశాల్లో మండలికి తగ్గిన ప్రాధాన్యం
- త్వరలో అడ్మిషన్ల బాధ్యతలూ తొలగింపు?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్యాశాఖలో ఆధికార పోరు సాగుతోంది. ఉన్నత విద్యామండలి, కళాశాల విద్యాశాఖ మధ్య అధికారాల మార్పిడి ప్రయత్నాలు అంతర్గత విభేదాలకు దారితీస్తున్నాయి. ఈ విభేదాలు వచ్చే విద్యా సంవత్సరంపై ప్రభావం చూపించే ప్రమాదం కనిపిస్తోంది. మరోవైపు వచ్చే ఏడాదికి తెలంగాణ ఈఏపీసెట్ తేదీలు ప్రకటించింది. కానీ ఇక్కడ ఇంతవరకూ కన్వీనర్లనే నియమించలేదు. ఉన్నత విద్యాశాఖలో ఉన్నత విద్యామండలి పాత్ర కీలకం. అన్ని ప్రవేశ పరీక్షల నిర్వహణ, అడ్మిషన్ల ప్రక్రియ బాధ్యత మొత్తం మండలి పరిధిలోనే ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉన్నత విద్యకు కమిషనరేట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది ఇంకా ప్రతిపాదన దశలోనే ఉండగానే ఉన్నత విద్యామండలి బాధ్యతలను బలవంతంగా తీసుకునే ప్రయత్నాలను కళాశాల విద్యాశాఖ మొదలుపెట్టింది. దీనిలో భాగంగా ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీ అడ్మిషన్ల ప్రక్రియకు టెండర్లు పిలిచినట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై జీవో విడుదల చేసి పూర్తిస్థాయిలో అడ్మిషన్లను తన పరిధిలోకి తీసుకోవాలని భావిస్తోంది. ఉన్నత విద్య కమిషనరేట్ ఏర్పాటు చేయకుండానే అడ్మిషన్ల బాధ్యతలు తీసుకోవడంపై మండలి వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా ఎలా తీసుకుంటారని మండలి వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. కాగా, ప్రవేశ పరీక్షలు నిర్వహణను త్వరలో కళాశాల విద్యాశాఖకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అధికారాల మార్పిడి ప్రయత్నాలతో ఇటీవల ఉన్నత విద్యాశాఖలో పలు అంశాల్లో సమన్వయం కుదరట్లేదు. వర్సిటీ వీసీల నియామకానికి ఏర్పాటుచేసిన సెర్చ్ కమిటీల సభ్యులను మండలి ప్రమేయం లేకుండా నియమించడంతో ఆ కమిటీల సమావేశాల్లో జాప్యం జరుగుతోందని తెలిసింది. ప్రైవేటు వర్సిటీల అంశంపై ఇటీవల నియమించిన కమిటీని కూడా మండలి సలహా లేకుండానే నియమించినట్లు ప్రచారం సాగుతోంది. ప్రవేశ పరీక్షలకు కన్వీనర్లను ప్రకటిద్దామని మండలి ప్రయత్నించినా సమన్వయం లేకపవడంతో ఆగిపోయింది. ఇలా పలు అంశాల్లో ఉన్నత విద్యామండలికి ప్రాధాన్యం తగ్గినట్లు స్పష్టమవుతోంది.



మంత్రి పేషీ అధికారి జోక్యం

ఉన్నత విద్యాశాఖలో మంత్రి లోకేశ్ పేషీలో ఓ అధికారి జోక్యం పెరుగుతోందనే ఆరోపణలున్నాయి. వివిధ విభాగాలను సమన్వయం చేయాల్సిన ఆయన.. ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, శాఖలో అంతర్గత అంశాలు మంత్రి దృష్టికి తీసుకెళ్లకుండా తన స్థాయిలోనే నిర్ణయాలు తీసుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. ఇటీవల పాఠశాల విద్యాశాఖలో అదనపు డైరెక్టర్లు, జేడీల బదిలీల సమయంలోనూ సొంత నిర్ణయాలు తీసుకున్నారని ఆ శాఖ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు సాంకేతిక విద్యాశాఖ నుంచి డెప్యుటేషన్‌పై సచివాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి కూడా ఉన్నత విద్యాశాఖపై పెత్తనం చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇంజనీరింగ్ అడ్మిషన్లలో కీలకంగా వ్యవహరించిన ఆయన్ను డెప్యుటేషన్‌పై సచివాలయంలో నియమించడంపై విమర్శలున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవట్లేదు.






మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో మంత్రులు నిమ్మల, ఆనం, అనగాని, డోలా, కందుల, జనార్దన్ రెడ్డి, సవిత, ఫరూక్, కేశవ్, పార్థసారథి, రవికుమార్, సంధ్య, భరత్, రాంప్రసాద్‌రెడ్డి

4 నెలలు.. 3 హామీలు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులను ఆదేశించారు. గురువారం వెలగపూడి సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, జనాభా నిర్వహణకు ఉపయోగపడుతుందని చంద్రబాబు అన్నారు. చాలామంది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి తల్లిదండ్రులు పిల్లలను చదివించలేక ఒకరు లేదా ఇద్దరికే పరిమితమవుతున్నారని, ఎంత మంది పిల్లలున్నా ప్రభుత్వం చదివిస్తుందన్న భరోసా వారికి తల్లికి వందనం ఇస్తుందన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బియ్యం



సంక్షేమ వసతి గృహాలకు, మధ్యాహ్న భోజన పథకానికి ఇస్తున్న బియ్యం నాసిరకంగా ఉందని మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ కేబినెట్‌లో ప్రస్తావించారు. దీన్ని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో నాణ్యమైన బీపీటీ బియ్యాన్ని అందిస్తామని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.

మళ్లీ ఆర్డీవోలకే అధికారం

రెవెన్యూ సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడానికి ఏం చేయాలన్న దానిపై కేబినెట్‌లో చర్చ జరిగింది. గతంలో ఆర్డీవో స్థాయిలోనే అప్పీల్ చేసుకునే అధికారం ఉండేదని, వైసీపీ హయాంలో ఆర్డీవోను పక్కన పెట్టి డీఆర్వోకు ఆ బాధ్యతలు అప్పగించారని, డీఆర్వోలపై పనిఒత్తిడి కారణంగా రెవెన్యూ ఫైళ్లు భారీగా పేరుకుపోతున్నాయని అభిప్రాయపడ్డారు. గతంలో మాదిరి ఆర్డీవోకే అప్పీల్ చేసుకునే అధికారాన్ని కట్టబెట్టాలని నిర్ణయించారు.

జీఎస్‌డీపీ పర్యవేక్షణకు ప్రత్యేక బృందం

రాష్ట్రం ప్రస్తుతమున్న పరిస్థితుల నుంచి గట్టెక్కాలంటే స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి(జీఎస్‌డీపీ) పెంచుకోవడం ఒక్కటే మార్గమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ దిశగా అడుగులు వేసేందుకు నియోజకవర్గ స్థాయిలో ఉన్న అన్ని సచివాలయాల నుంచి అత్యుత్తమమైన ఐదుగురు ఉద్యోగులను ఎంపిక చేసి వారితో పాటు ఒక ఆర్థిక, సామాజిక వృత్తినిపుణుడిని, ప్రభుత్వ అధికారిని ఒక బృందంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. నియోజకవర్గ స్థాయిలో జీఎస్‌డీపీ పెంపుదలపై నిరంతరాయంగా పర్యవేక్షణ చేయాలన్నారు. నియోజకవర్గంలోని కుటుంబాల నుంచి వనరుల వరకు అన్నింటినీ నిరంతరాయంగా పర్యవేక్షిస్తూ జీఎస్‌డీపీ పెరుగుదలకు ఏం చర్యలు తీసుకోవాలో ఈ బృందం అధ్యయనం చేసి స్థానిక ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని సీఎం తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు ప్రతినెలా సమావేశాలు పెట్టుకుని పర్యవేక్షించాలని ఆర్థిక మంత్రి కేశవ్‌కు సూచించారు.

వాట్సాప్ గవర్నెన్స్‌కు స్పందన భేష్



రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌పై కేబినెట్‌లో చర్చ జరిగింది. దీనికి మంచి స్పందన వస్తోందని, దీన్ని జనంలోకి మరింతగా తీసుకెళితే ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తగ్గడంతోపాటు ఇటు అధికారుల పని సులభతరం అవుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై నిరంతరం సర్వేలు చేయిస్తున్నామని, అన్ని పథకాల మీద పాజిటివ్ స్పందన వస్తోందన్నారు. దీనిని ఇంకా పెంచుకోవాల్సిన అవసరం ఉందని మంత్రులకు సీఎం సూచించారు.

ఆప్కాస్ రద్దుకు సూచన

ఏపీ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్స్‌డ్ సర్వీసెస్ (ఆప్కాస్)ను రద్దు చేయాలన్న అంశంపై చర్చించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆప్కాస్ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని పలువురు మంత్రులు పేర్కొన్నారు. ఏ శాఖకు ఆ శాఖ వారి అవసరాలకు తగ్గట్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకోవడం ద్వారా ఉద్యోగులపై ఆ శాఖ అధికారులకు పట్టు ఉంటుందని, మంచి పనితీరు రాబట్టుకునేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆప్కాస్ రద్దు చేస్తేనే మంచిదని కేబినెట్ అభిప్రాయపడింది.

నీరు-చెట్టు బిల్లులు చెల్లించాలి



టీడీపీ హయాంలో 2014-19 మధ్య నీరు-చెట్టు పనులు చేసిన టీడీపీ సానుభూతిపరుల బిల్లులు సుమారు రూ.900 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చెల్లించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని కేబినెట్‌లో చర్చ జరిగింది. అప్పులు చేసి పనులు చేసిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులు బకాయిల కోసం తమ చుట్టూ తిరుగుతున్నారని, వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని మంత్రులు వ్యాఖ్యానించారు. ఇన్‌చార్జి మంత్రులు జిల్లాలకు వెళ్లినప్పుడు ఆయా జిల్లాల్లో ఉన్న బకాయిలపై దృష్టి సారించాలని సీఎం సూచించారు. 2019 నాటికి ఉన్న ఇళ్ల బకాయిలు కూడా క్లియర్ చేయాలని నిర్ణయించారు.

ఉద్యోగాల కల్పనపై దృష్టి

రెన్యువబుల్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీలో చాలా ఎంవోయూలు చేసుకున్నామని, వాటిని గ్రౌండ్ చేయడంపై దృష్టి సారించాలని మంత్రులకు సీఎం సూచించారు. సుమారు రూ.10 లక్షల కోట్ల ఎంవోయూలు జరిగాయని ఇవన్నీ గ్రౌండ్ చేయించగలిగితే సుమారు 7 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

సౌర విద్యుత్తులో టాప్‌లో నిలవాలి



సూర్యఘర్, కుసుమ పథకాల అమలుపై దృష్టి సారించాలని నిర్ణయించారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఈ పథకాల కింద 7 లక్షల యూనిట్లు గ్రౌండ్ చేశారని, రాష్ట్రంలో ఏడాది కాలంలో 10 లక్షల యూనిట్లు గ్రౌండ్ చేయడం ద్వారా దేశంలోనే రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలపాలని సీఎం కోరారు. సౌర విద్యుత్తు వినియోగం పెరిగితే వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం తగ్గడంతో పాటు ప్రభుత్వంపై విద్యుత్తు కొనుగోలు భారం కూడా తగ్గుతుందన్నారు. వీలైనంత వరకు విద్యుత్తు చార్జీలు తగ్గించడంపైనే అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సూర్యఘర్, కుసుమ పథకాల అమలుపై ఇన్‌చార్జి మంత్రులు దృష్టి సారించాలన్నారు.

ఇసుక, మద్యం సమస్యలపై చర్చించండి



జిల్లా సమీక్షా సమావేశాలు(డీఆర్సీ) క్రమం తప్పకుండా పెట్టాలని ఇన్‌చార్జి మంత్రులకు సీఎం సూచించారు. డీఆర్సీ సమావేశాలకు వెళ్లినప్పుడు ఇన్‌చార్జి మంత్రులు ఆ జిల్లాలో ఏ మేరకు ప్రభుత్వ భూములు ఉన్నాయన్న అంశంపై దృష్టి పెట్టాలన్నారు. అధికారులతో మాట్లాడి, వాటిలో పరిశ్రమలు పెట్టేందుకు అనువైన భూములు ఉన్నాయా అన్న అంశాన్ని గుర్తించాలని సూచించారు. మద్యం, ఇసుక పాలసీల్లో సమస్యలనూ చర్చించాలని కోరారు. ఇది నిరంతరాయంగా జరగాలన్నారు.

2028 నాటికి బనకచర్ల

బనకచర్లపై 3-4 నెలల్లో స్పష్టత తీసుకొచ్చి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సీఎం సూచించారు. 2028 నాటికి ఎట్టి పరిస్థితుల్లో బనకచర్ల ప్రాజెక్టు పూర్తవ్వాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు. అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయులను వెనక్కి పంపుతున్న అంశంపైనా చర్చ జరిగింది. దీనిపై సీఎం స్పందిస్తూ ట్రంప్ నిర్ణయం వల్ల తెలుగువాళ్లకు పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చని అభిప్రాయపడ్డారు.

మంత్రులు.. ర్యాంకులు

- ఫైళ్ల పరిష్కారంలో ఫరూక్ టాప్.. సీఎంకు ఆరో స్థానం
- 8వ స్థానంలో లోకేశ్.. పదిలో పవన్
- చివరి స్థానానికి పరిమితమైన వాసంశెట్టి
- కేబినెట్ భేటీలో వెల్లడించిన చంద్రబాబు
- ఫైళ్లను వేగంగా పరిష్కరించాలని సూచన

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి 2024 డిసెంబరు వరకు ఫైళ్లను పరిష్కరించడంలో మంత్రుల పనితీరు ఎలా ఉందనే అంశాన్ని కేబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. మంత్రుల్లో ఎవరెవరు, ఏ స్థానంలో ఉన్నారో చదివి వినిపించారు. తాను 6వ స్థానంలో ఉన్నట్లు సీఎం పేర్కొన్నారు. ఆరు నెలల్లో సగటున 2.30 గంటలకు ఒక ఫైల్ చొప్పున క్లియర్ చేసిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మొదటి స్థానంలో ఉన్నట్లు తెలిపారు. తమ వద్దకు వచ్చిన ఫైళ్లను వేగంగా పరిష్కరించాలని మంత్రులకు సూచించారు. జనవరి నుంచి లెక్కలు తీస్తే తమ పనితీరు చాలా మెరుగుపడిందని పలువురు మంత్రులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

మంత్రుల ర్యాంకులు ఇలా..

ర్యాంకు	మంత్రి పేరు
1	ఎన్ఎండీ ఫరూక్
2	కందుల దుర్గేశ్
3	కొండపల్లి శ్రీనివాస్
4	నాదెండ్ల మనోహర్
5	డోలా బాలవీరాంజనేయస్వామి
6	చంద్రబాబు నాయుడు (సీఎం)
7	సత్యకుమార్ యాదవ్
8	నారా లోకేశ్
9	బీసీ జనార్దన్‌రెడ్డి
10	పవన్ కల్యాణ్ (డిప్యూటీ సీఎం)
11	ఎస్. సవిత
12	కొల్లు రవీంద్ర
13	గొట్టిపాటి రవికుమార్
14	పి. నారాయణ
15	టి.జి. భరత్
16	ఆనం రామనారాయణరెడ్డి
17	కె. అచ్చెన్నాయుడు
18	ఎం. రాంప్రసాద్‌రెడ్డి
19	గుమ్మడి సంధ్యారాణి
20	వంగలపూడి అనిత
21	అనగాని సత్యప్రసాద్
22	నిమ్మల రామానాయుడు
23	కొలుసు పార్థసారథి
24	పయ్యావుల కేశవ్
25	వాసంశెట్టి సుభాశ్

పోలవరం నిర్వాసితులకు జీవనోపాధి

పోలవరం నిర్వాసితుల్లో చాలామంది పరిస్థితి దయనీయంగా ఉందని, భూములను కోల్పోయినవారు సరైన జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. నిర్వాసితుల జీవనోపాధికి మార్గం చూపాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వైసీపీ హయాంలో నిలిచిపోయిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పనులకు మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయించారు.

అధికారులకు శిక్షణ కేంద్రం

ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇచ్చేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో మంచి శిక్షణ కేంద్రం ఉండేదని, ప్రస్తుతం ఏపీలో అలాంటి శిక్షణ కేంద్రం నెలకొల్పాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. బాపట్లలో శిక్షణ కేంద్రం ఉన్నా అది పెద్దగా ప్రయోజనకరంగా లేదని, అమరావతిలో అత్యాధునిక వసతులతో మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (హెచ్ఆర్డీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతపురంలో కస్టమ్స్ అధికారుల కోసం అన్ని సౌకర్యాలతో శిక్షణ కేంద్రం ఉందని, దాన్ని పరిశీలించి అంతకన్నా మెరుగైన శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలని సీఎం సూచించారు. దీనికోసం మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, నారాయణతో ఓ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అనంతపురం వెళ్లి కస్టమ్స్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి రావాలని సీఎం సూచించారు.

ఇంధన ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు సంప్రదాయేతర ఇంధన వనరుల ప్రాజెక్టులు స్థాపించడానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

కేబినెట్ ఆమోదం పొందిన ప్రాజెక్టులు ఇవీ..

- అల్లూరి సీతారామరాజు జిల్లా గుజ్జిలిలో 1500 మెగావాట్లు, చిట్టంవలసలో 800 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు నవయుగ ఇంజనీరింగ్ సంస్థ చేసిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోద ముద్ర పడింది.
- అన్నమయ్య జిల్లా రాయవరంలో 1500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంటుకు నవయుగ చేసిన ప్రతిపాదనలకూ కేబినెట్ ఓకే చెప్పింది.
- అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఎకోరాన్ నుంచి టేకోవర్ చేసుకున్న ఆయాన సంస్థ 201.30 మెగావాట్ల పవన విద్యుత్ ప్లాంట్‌ను, 498.30 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఏంపిన్ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపింది.
- అన్నమయ్య జిల్లా చింతలకుంట, మంటపంపల్లెలలో 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాలను స్థాపించేందుకు మేఘా ఇంజనీరింగ్ సంస్థ చేసిన ప్రతిపాదనలకు అంగీకారం చెప్పింది.
- కడప జిల్లాలో సీల్ సోలార్ సంస్థ 300 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. ఈ ప్రాజెక్టు కోసం ఏటా ఎకరా రూ. 31,000 చొప్పున లీజుకు ఇస్తారు. రెండేళ్లకోసారి 5% పెంచుతారు.
- అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలంలో టాటాపవర్ సంస్థ 499 మెగావాట్ల పవన విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు.



మంత్రి కందుల దుర్గేశ్‌తో సమావేశమైన అమెరికాకు చెందిన మాక్సీ హోటల్స్ ప్రతినిధులు


పర్యాటకాభివృద్ధితో ప్రత్యేక ముద్ర

- టూరిజం, కల్చర్ ఈవెంట్ క్యాలెండర్ రూపొందించాలి
- ప్రచారానికి ట్యాగ్‌లైన్ సిద్ధం చేయండి: మంత్రి దుర్గేశ్

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించడం ద్వారా ప్రత్యేక ముద్ర వేయాలని ఆ శాఖ అధికారులకు మంత్రి కందుల దుర్గేశ్ నిర్దేశించారు. గురువారం మంగళగిరిలోని ఏపీఐఐసీలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ), ఏపీ టూరిజం అథారిటీ (ఏపీటీఏ) అధికారులతో ఆయన సమీక్షించారు. రాష్ట్ర పర్యాటక రంగానికి అద్భుతమైన ట్యాగ్‌లైన్ సిద్ధం చేయాలని, ఈ నెలలో సీఎం చంద్రబాబుతో జరిగే సమావేశంలో అనుమతి తీసుకొని విస్తృత ప్రచారం కల్పిద్దామని సూచించారు. అఖండ గోదావరి, గండికోట ప్రాజెక్టు పనులపై మంత్రి ఆరా తీశారు. జిల్లాల వారీగా ఆయా ప్రాంతాల్లో పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాలకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి ఈవెంట్లు చేద్దామని, టూరిజం, కల్చర్ ఈవెంట్ క్యాలెండర్ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. తిరుపతి తరహాలో శ్రీశైలం క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో తలెత్తిన సిబ్బంది సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. సూర్యలంక, మైపాడు బీచ్‌లను మరింత అభివృద్ధి చేయాలన్నారు. నూతన పర్యాటక పాలసీపై పెట్టుబడిదారులకు అవగాహన కల్పించి పెట్టుబడులు రాబట్టాలన్నారు. ఇటీవలే విజయవాడ, విశాఖపట్నంల్లో ఇన్వెస్టర్ సమ్మిట్లు నిర్వహించామని త్వరలో తిరుపతితో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాల్లో సైతం నిర్వహించాలని సూచించారు. ఇన్వెస్టర్లను ఆకర్షించి యువతకు ఉపాధి కల్పిద్దామన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి పనితీరును మంత్రి ప్రశంసించారు.

ఉగాది నుంచి పీ-4 విధానం

- విధివిధానాల రూపకల్పనకు ప్రజల సలహాల స్వీకరణ: సీఎస్



పీ4 అమలుపై సమీక్షా సమావేశంలో సీఎస్ విజయానంద్, ఉన్నతాధికారులు

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఉగాది నుంచి పబ్లిక్- ప్రైవేట్- పీపుల్స్- పార్టనర్‌షిప్ (పీ-4) విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. గురువారం అమరావతి సచివాలయంలో పీ-4 విధానంపై సంబంధిత అధికారులతో సీఎస్ సమీక్ష జరిపారు. జిల్లా కలెక్టర్లు వర్చువల్‌గా పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. 'ముఖ్యంగా సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న 10% మంది పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20% మందికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుంది. దీని అమలు కోసం విధివిధానాల రూపకల్పనకు ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడంతో పాటు ఇందుకోసం ప్రత్యేక పోర్టల్ కూడా రూపొందిస్తాం' అని పేర్కొన్నారు. పేదలకు సాయం చేసేందుకు ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలను ఉగాది రోజు పీ-4 ప్రారంభకార్యక్రమానికి ఆహ్వానిస్తామని సీఎస్ తెలిపారు. ప్రతి ఏటా 15% వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 500 కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చిన నేపథ్యంలో వీటి ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించాలని కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు.

రూ.6,78,345కోట్ల పెట్టుబడులు!

- ఒప్పందాలు జరిగిన 34 ప్రాజెక్టుల ప్రతిపాదనలకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం
- మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి



అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోందని సమాచార పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఇప్పటి వరకూ రూ.6,78,345 కోట్ల విలువైన పెట్టుబడులకు సంబంధించి 34 ప్రాజెక్టుల ఏర్పాటుకు ఒప్పందాలు కుదిరాయని.. ఆ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించిందని చెప్పారు. వీటి ద్వారా 4,28,705 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. గురువారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆయన వివరించారు. 2024-29 మధ్య చేపట్టే ఎంఎస్ఎంఈ, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ, టెక్స్‌టైల్, అపెరల్, గార్మెంట్ల పాలసీల సవరణల కోసం చేసిన ప్రతిపాదనలను మంత్రిమండలి ఆమోదించిందని వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతులు, మహిళా ఎంటర్‌ప్రెన్యూర్స్‌ను ప్రోత్సహించేందుకు వారికిస్తున్న 35% పెట్టుబడి రాయితీని 45శాతానికి పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. రవాణా లాజిస్టిక్స్‌కు కూడా 45% రాయితీని.. గరిష్ఠంగా రూ.75లక్షల వరకు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. కొత్తగా పెట్టుబడులు పెట్టే వారికే ఈ రాయితీలు వర్తిస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు భూమి విలువపై 75శాతం రాయితీ.. గరిష్ఠంగా రూ.25 లక్షలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఎంఎస్ఎంఈడీపీ-4.0 పాలసీలో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విభిన్న ప్రతిభావంతులకు ప్రతి యూనిట్ విద్యుత్‌పై రూపాయిన్నర రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్ర జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ ప్రోత్సాహాన్ని ఐదేళ్ల పాటు అన్ని వర్గాలకూ ఇస్తామన్నారు.

మరిన్ని నిర్ణయాలు..

- రాష్ట్రంలోని ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్న నినాదంలో భాగంగా వారిని ప్రోత్సహించడానికి 8 ప్రాధాన్య అంశాలు ఖరారు.
- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు గత నెల 30న చేసిన సిఫారసులకు ఆమోదం.
- కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఎలీప్, ఈఎంసీ(కొప్పర్తి) తదితర కంపెనీలు కోరిన ప్రోత్సాహాలపై సానుకూల నిర్ణయాలు.
- ఎలీప్ సంస్థకు తూర్పుగోదావరి జిల్లా బాలభద్రాపురంలో గతంలో కేటాయించిన 34.19 ఎకరాల బదులు అనకాపల్లి జిల్లా కోడూరులో 31.77 ఎకరాలు కేటాయింపు.
- 2014-19 మధ్య నీరు-చెట్టు కింద చేపట్టిన పనులకు పెండింగ్ బిల్లుల చెల్లింపు.. పనుల తనిఖీ, 386 మంది ఇంజనీర్లపై చేపట్టిన క్రమశిక్షణ చర్యల ఉపసంహరణ.
- టీటీడీలో నూతన పోస్టుల సృష్టికి బదులుగా ప్రస్తుతం ఉన్న 15 వర్కర్స్(సీనియర్) పోస్టులను.. పోటు సూపర్‌వైజర్ల స్థాయికి అంటే సీనియర్ అసిస్టెంట్ కేడర్‌కు సమానంగా పెంచేందుకు ఆమోదం.
- రిజిస్ట్రేషన్లు-స్టాంపుల విభాగంలో పత్రాల నమోదు కోసం డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టం ప్రవేశపెట్టేందుకు సమ్మతి.
- చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ ఏర్పాటులో తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం, కోట మండలం కొత్తపట్నంలో భూములు కోల్పోయిన వారికి కొన్ని షరతులకు లోబడి ఏకకాల ప్రత్యేక పరిహారం కింద ఎకరానికి రూ.8 లక్షల చొప్పున మొత్తం రూ.78,84,83,200 మంజూరుకు ఆమోదం.
- ఏపీ హక్కుల భూమి, పట్టాదార్ పాస్ పుస్తకాల చట్టం (1971)లోని సెక్షన్ 5 (1), (2), (4) సవరణ కోసం చేసిన ప్రతిపాదనకు, రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి ఆమోదం. ఆంధ్రప్రదేశ్ నాలెడ్జ్ సొసైటీ, కెపాసిటీ బిల్డింగ్ పాలసీ-2025 ముసాయిదాకు ఆమోదం.
- పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు రూ. 920 కోట్లతో సహాయ పునరావాస కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని తీర్మానం.

ఎక్సైజ్ లెక్క తప్పింది

- మార్జిన్ విషయంలో తొందరపాటు
- ఇష్యూ ప్రైస్ అంచనాలో మెలిక
- లైసెన్సీల ఆందోళనతో దిద్దుబాటు చర్యలు
- 14 శాతం మార్జిన్‌కు కేబినెట్ ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మద్యం పాలసీని అమల్లోకి తెచ్చే క్రమంలో ఎక్సైజ్ శాఖ తీసుకున్న తొందరపాటు నిర్ణయాలపై ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సరైన కసరత్తు లేకుండా లైసెన్సీలకు ఇచ్చే మార్జిన్‌పై ఆ శాఖ వేసిన అంచనాల లెక్క తప్పింది. దీంతో పాలసీ అమల్లోకి వచ్చిన మూడు నెలల తర్వాత దాన్ని సవరించాల్సి వచ్చింది. తాజా కేబినెట్ సమావేశంలో మార్జిన్ సవరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనివల్ల ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం పడే అవకాశం ఉంది. వినియోగదారులపైనా కొంతమేర భారం పడనుంది. లైసెన్సీలకు 14శాతం మార్జిన్ ఇస్తామని ఇప్పటికే సీఎం నిర్ణయం తీసుకోగా, అందుకు అనుగుణంగా కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఇష్యూ ప్రైస్‌కు సొంత నిర్వచనం

సాధారణంగా మద్యం లైసెన్సీలకు ఇష్యూ ప్రైస్‌పై మార్జిన్ ఇస్తారు. మద్యం సీసాపై అన్ని రకాల పన్నులు వేసిన తర్వాత వచ్చే దానిని ఇష్యూ ప్రైస్ అంటారు. ఇష్యూ ప్రైస్ తర్వాత లైసెన్సీలకు ఇచ్చే మార్జిన్ మరో పన్నుగా ఉంటుంది. రెండూ కలిపితే ఎమ్మార్పీ అవుతుంది. అక్టోబరులో అమల్లోకి తెచ్చిన మద్యం పాలసీలో ఇష్యూ ప్రైస్‌పై 20శాతం లైసెన్సీలకు మార్జిన్‌గా ఇస్తామని ఎక్సైజ్‌శాఖ పేర్కొంది. అన్నట్టుగానే ఇస్తోంది. కానీ వాస్తవంగా చూస్తే వారికి 10శాతమే మార్జిన్ వస్తోంది. లెక్క ఎక్కడ మారిందంటే ఇష్యూ ప్రైస్ నిర్వచనాన్ని ఎక్సైజ్‌శాఖ మార్చేసింది. మొత్తం పన్నులపై 20శాతం మార్జిన్ ఇస్తారని భావించిన వ్యాపారులు లైసెన్స్‌ల కోసం భారీగా దరఖాస్తు చేసుకున్నారు. కానీ, లాభాలు రాకపోవడంతో వ్యాపారులు ఆందోళనలకు దిగే పరిస్థితి వచ్చింది. దీంతో ప్రభుత్వం ఇప్పుడు సవరణలు చేస్తోంది.

మార్జిన్ సవరణ ప్రభావం ఇదీ

మార్జిన్ పెంచడం వల్ల సుమారు రూ.వెయ్యి కోట్ల ఆదాయం ప్రభుత్వం కోల్పోనుంది. దీంతో ఆ నష్టాన్ని నివారించేందుకు ఎక్సైజ్ శాఖ పలు ప్రతిపాదనలు చేసింది. ఎమ్మార్పీ రూ.150 దాటిన బ్రాండ్లపై రూ.10 ధర పెంచేలా ఓ ప్రతిపాదన చేసింది. అన్ని కేటగిరీలకు 14శాతం మార్జిన్ ఇస్తూ, రూ.150 దాటిన బ్రాండ్లపై రూ.10 పెంచితే ప్రభుత్వం రూ.135 కోట్ల ఆదాయాన్ని కోల్పోతుంది. క్వార్టర్ రూ.99 బ్రాండ్లు మినహా అన్నిటిపైనా రూ.10 పెంచి, 14శాతం మార్జిన్ ఇస్తే రూ.320 కోట్లు అదనంగా ఆదాయం వస్తుంది. రూ.150 దాటిన బ్రాండ్లపై రూ.10 పెంచి మార్జిన్‌ను రెండు కేటగిరీల్లో 10.5, 14 శాతాలుగా అమలుచేస్తే రూ.220 కోట్ల ఆదాయం పెరుగుతుంది. దీనిపై ఎక్సైజ్ శాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

బీసీలకు మళ్లీ అగ్ర తాంబూలం!

- నామినేటెడ్ పదవుల్లో 34% కోటా.. రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం
- జగన్ హయాంలో మైనారిటీలనూ కలిపి 29 శాతానికి బీసీ రిజర్వేషన్ కుదింపు
- నాడు వైసీపీ తెచ్చిన చట్టం రద్దుకు తాజాగా కేబినెట్ ఆమోదం
- బీసీ సంఘాలు, నాయకుల హర్షం

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. వారికి 34 శాతం రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదనను గురువారమిక్కడ వెలగపూడి సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదించింది. దీనిపై బీసీ సంఘాలు, నేతలు హర్షం వెలిబుచ్చుతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచీ బీసీలకు పెద్దపీట వేస్తూ వస్తోంది. నామినేటెడ్ పదవుల్లోనూ వారికి రిజర్వేషన్ కల్పించిన ఘనత ఆ పార్టీకే దక్కుతుంది. తొలిసారి ఎన్టీఆర్ హయాంలో బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 20 శాతం రిజర్వేషన్‌ను అమలు చేశారు. చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచారు. అయితే వైసీపీ హయాంలో బీసీలు, మైనారిటీలకు కలిపి 29 శాతానికి కుదించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం కలిపి రిజర్వేషన్‌ను 50 శాతానికే పరిమితం చేస్తూ 2019లో చట్టం కూడా తెచ్చారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ పరిమితి నిబంధన అమలు చేయాల్సిన అవసరం లేకపోయినా పరిమితి తీసుకురావడంతో ఆయా వర్గాలకు తీరని అన్యాయం జరిగింది. అప్పట్లో బీసీ సంఘాలు నాయకులు ఆందోళన చేసినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. తిరిగి బీసీలకు నామినేటెడ్ పదవుల్లో 34 శాతం కోటా ఇస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు కేబినెట్ సమావేశంలో జగన్ తెచ్చిన సదరు చట్టాన్ని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. లోపాలను సరిదిద్ది కొత్త చట్టాన్ని తీసుకురానున్నారు. అందులో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూనే ఎస్సీ, ఎస్టీలకు 15, 6 శాతం కోటాను కొనసాగించనున్నారు.

నాస్తికోద్యమ నాయకురాలు డాక్టర్ మారు మృతి

» అనారోగ్యంతో విజయవాడలో కన్నుమూత


డాక్టర్ మారు

విజయవాడ (పటమట), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్యురాలు, సామాజిక సేవకురాలు, నాస్తికోద్యమ నాయకురాలు సరస్వతి గోరా 4వ కుమార్తె డాక్టర్ మారు (80) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. ఆమె డాక్టర్ సమరానికి సోదరి. వీరిద్దరూ విజయవాడలో 55 ఏళ్లుగా వాసవ్య నర్సింగ్ హోం ద్వారా సేవలందిస్తున్నారు. డాక్టర్ మారు.. అనేక గ్రామాల్లోను, గిరిజన ప్రాంతాల్లోను సేవలందించడమే కాకుండా మూఢనమ్మకాల నిర్మూలనకు ఎంతో కృషిచేశారు. కొన్ని వేలమంది పోలియో కలిగిన చిన్నారులకు ఉచితంగా శస్త్రచికిత్స చేయించారు. శుక్లాల ఆపరేషన్లు వేలల్లో చేయించడమే కాకుండా, వందలాది మందికి నర్సింగ్ ట్రైనింగ్ అందించడంలోనూ ఆమెది కీలకపాత్ర. ఆమె మృతి విషయం తెలియగానే, వందల సంఖ్యలో అభిమానులు, ఆమె ద్వారా ప్రయోజకులైన వారు తరలివచ్చి నివాళులర్పించారు. ఆమె నేత్రాలను స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఆమె అంతిమ యాత్ర శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ నాస్తిక కేంద్రం నుంచి ప్రారంభమవుతుందని నాస్తిక కేంద్రం నిర్వాహకులు తెలిపారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం

» రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చర్యలను వేగవంతం చేయాలని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు, రాజధాని అమరావతిలో నల్సార్ విశ్వవిద్యాలయం, ఇంటర్నేషనల్ లా స్కూల్ ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణ, నిధుల కేటాయింపులు తదితర అంశాలపై మంత్రి గురువారం సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ అంశాలపై అవసరమైతే క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని న్యాయశాఖ అధికారులను ఆదేశించారు.

సమాజం కోసం మనం సైతం!

తలసీమియా పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

రెండు రాష్ట్రాల్లో సెంటర్లు

» నిధుల సేకరణకు 15న మ్యూజికల్ షో

» తన టీమ్‌తో ఉచితంగా నిర్వహిస్తున్న తమన్

» ప్రతి రూపాయీ బాధిత పిల్లల కోసమే

» సీఎం పీఏలైనా టికెట్ కొనాల్సిందే: భువనేశ్వరి

అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమాజం గురించి ఆలోచించి.... సమాజానికి ఏదో ఒకటి చేయాలని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. తలసీమియా బాధిత పిల్లల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యూజికల్ షో గురించి వివరించేందుకు సంగీత దర్శకుడు తమన్‌తో కలిసి గురువారం ఆమె విజయవాడలో మీడియాతో మాటాడ్లారు. "సమాజమే దేవాలయం... ప్రజలే దేవుళ్లు అనే స్ఫూర్తితో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు స్థాపించాం. తలసీమియా బాధిత పిల్లలకు రెండు లేదా నాలుగు నెలల్లో రక్తమార్పిడి చేయాల్సి ఉంటుంది. దీనికి ఎంతో రక్తం అవసరం. ప్రతి ఒక్కరూ, కుటుంబ సభ్యులతో సహా రక్తదానం చేయాలి. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసీమియా సెంటర్లు ప్రారంభించాలని అనుకున్నాం. ఈ సెంటర్లకు నిధుల సేకరణ కోసమే ఈ మ్యూజికల్ షో ఏర్పాటు చేశాం. దీని గురించి చెప్పగానే తమన్ అంగీకరించారు. మా ట్రస్ట్ చేసే కార్యక్రమాలు చూసిన తర్వాత షో మొత్తం ఫ్రీగా చేస్తానని అంగీకరించారు" అని భువనేశ్వరి తెలిపారు. ఈనెల 15వ తేదీన విజయవాడలో 'యుఫోరియా మ్యూజికల్ షో' పేరుతో దీనిని నిర్వహిస్తున్నామని... బుక్ మై షోలో టికెట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ప్రభుత్వాన్ని సాయం అడగను...

రెండు రాష్ట్రాల్లో తలసీమియా సెంటర్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని భువనేశ్వరి తెలిపారు. "ప్రస్తుతం హైదరాబాద్‌లో చిన్న సెంటర్‌ను ఏర్పాటు చేశాం. అది సరిపోవడం లేదు. విశాఖ, తిరుపతి, హైదరాబాద్, రాజమండ్రిలో బ్లడ్ బ్యాంక్‌లున్నాయి. అక్కడే తలసీమియా సెంటర్లు ఏర్పాటు చేస్తాం. అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు ప్రభుత్వం కొంత స్థలాన్ని ఇచ్చింది. అందులో బాలకృష్ణ ఆస్పత్రి ఏర్పాటు చేస్తారు" అని తెలిపారు. సీఎం సతీమణిగా ప్రభుత్వ మద్దతు ఉంటుంది కదా.. ఈ షో నిర్వహించడం ఎందుకనే ప్రశ్నకు భువనేశ్వరి సూటిగా బదులిచ్చారు. "ఐ యామ్ భువనేశ్వరి. పదవులు వస్తాయి.. వెళ్తాయి. అది నాకు ముఖ్యం కాదు. నేను నా కాళ్ల మీద నిలబడాలని అనుకుంటాను. సీఎం చంద్రబాబును నేను ఏదీ అడగను. ఒకవేళ... ఎన్టీఆర్ ట్రస్ట్, హెరిటేజ్ గురించి అడిగినా ఆయన వెంటనే 'నో' చెబుతారు. ఇప్పుడు కూడా మ్యూజికల్ షో నిర్వహిస్తున్నానని చెప్పగానే... 'మీరు చేయండి. మీరు చేయగలరు' అని మాత్రమే చెప్పారు. మ్యూజికల్ షోకు ఎవరైనా టికెట్ కొని రావాల్సిందే అని స్పష్టం చేశారు. "మా కుటుంబానికి సంబంధించి రూ.6 లక్షలు తన వ్యక్తిగత ఖాతా నుంచి చెల్లించి చంద్రబాబు ఒక టేబుల్ బుక్ చేశారు. షోకు ఎవ్వరూ ఫ్రీగా రావడానికి లేదు. సీఎం చంద్రబాబుతోపాటు వచ్చే పీఏలు కూడా టికెటు కొని రావాల్సిందే" అని భువనేశ్వరి నవ్వుతూనే సూటిగా చెప్పారు. ఈ కార్యక్రమానికి పవన్ కల్యాణ్‌ను ఫోన్ చేసి పిలిచానని, తప్పకుండా వస్తారని అనుకుంటున్నానని చెప్పారు.



"తలసీమియా ఉందని బాధితుల్లో చాలా మందికి తెలియదు. ఊపిరి పీల్చుకోలేక ఇబ్బంది పడతారు. మరికొన్ని సమస్యలతో బాధపడతారు. ప్రతి ఒక్కరూ తలసీమియా పరీక్షలు చేయించుకోవాలి. నేను బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి చూసినప్పుడు వారిని చూస్తే చాలా బాధ అనిపించింది. అందుకే పిల్లల్లో తలసీమియా నివారణ కార్యక్రమం చేపట్టాం. దేశంలో 70 వేల మంది పిల్లలు తలసీమియాతో బాధపడుతున్నారు. అందులో 10 శాతం మంది మన రెండు రాష్ట్రాల్లో ఉన్నారు. దీనిపై రీసెర్చ్ సెంటర్ పెట్టాలని అనుకుంటున్నాం." - భువనేశ్వరి

ఆనందంగా ఉంది: తమన్



"సీఎం చంద్రబాబు రాష్ట్రం కోసం చాలా చేస్తున్నారు. భువనేశ్వరి కూడా చాలా మంచి పనులు చేస్తున్నారు. నాపై నమ్మకముంచి ఈ షో చేయిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. షో ద్వారా వచ్చే ప్రతి రూపాయి పిల్లలకు అందిస్తాం. 50 మంది సింగర్స్ పాల్గొంటున్నారు. సీఎం చంద్రబాబు, ఎండీ భువనేశ్వరి, హీరో బాలకృష్ణ తదితరులు హాజరవుతారు. ఇది అతి పెద్ద షో అవుతుంది. దీనిని విజయవంతం చేయడానికి మా టీమ్ కష్టపడుతోంది. షోను కొత్తగా చేయాలని ఆలోచిస్తున్నాం" అని తమన్ తెలిపారు. భువనేశ్వరి చాలా ఎనర్జిటిక్ అని ప్రశంసించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ అంటే ఆత్మ గౌరవానికి ప్రతీకని ట్రస్ట్ సీఈవో రాజేంద్రకుమార్ అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌ను 1997లో చంద్రబాబు నాయుడు ప్రారంభించారని చెప్పారు.

సునీల్‌ను సస్పెండ్ చేయాలి



» డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు డిమాండ్

» కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

» ఆకివీడు గొడవలో ఆయన ప్రమేయం ఉంది

» ఆక్రమణల తొలగింపు కులాలకు ఆపాదించడం ఏంటి?

కాళ్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కులాల మధ్య చిచ్చుపెడుతూ విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తున్న సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు డిమాండ్ చేశారు. ఆకివీడులో బుధవారం జరిగిన సంఘటన అతడి అక్రమాలకు నిదర్శనమన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెద అమిరంలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆకివీడులో బుధవారం సాయంత్రం పోలీసు స్టిక్కర్‌తో ఉన్న ఇన్నోవా కారులో వచ్చి నగర పంచాయతీ వద్ద గొడవ చేసిన వాళ్లు సునీల్ కుమార్ మనుషులే అని పోలీసు విచారణలో తేలిందన్నారు. సునీల్ కుమార్ వద్ద సీసీగా పనిచేసిన వ్యక్తి చెబితే వాళ్లు వచ్చినట్లు తెలిసిందన్నారు. ఆ కారు సునీల్ కుమార్ అనుచరుడు గుత్తికొండ వెంకట జోగారావు పేరుపై ఉందని అతడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్నోవా కారుపై అంబేడ్కర్ ఇండియా మిషన్ స్టిక్కర్‌లో సునీల్‌కుమార్ బొమ్మ ఉందని తెలిపారు. కారులో వచ్చి ప్రభుత్వ కార్యాలయంపై దాడి చేస్తారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఐపీఎస్ ఆఫీసర్ ఇంత విచ్చలవిడిగా రౌడీయిజం చేయడానికి తెగిస్తే ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంటుందో చూడాలని చెప్పారు. సమాజానికి మంచి జరగాలని భావించే తనకు కులాలతో సంబంధం లేదని, అందరినీ సమాన దృష్టితో చూస్తానని తెలిపారు. కోర్టు ఉత్తర్వుల మేరకు పంట కాల్వలు, మంచినీటి చెరువులపై ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుడితే.. దానిని కులాలకు ఆపాదించడం సరికాదన్నారు.

నేడు ఒంగోలులో పోలీసు విచారణకు ఆర్జీవీ

ఒంగోలుక్రైం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వివాదాస్పద సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ శుక్రవారం ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌లో జరిగే విచారణకు హాజరుకానున్నారు. ఉదయం 7 గంటలకు ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారణ జరగనుంది. అందుకు సంబంధించి పోలీసులు పటిష్ఠంగా భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ల ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో ఆర్జీవీ పోస్టు చేశారు. దీనిపై గతేడాది నవంబరు 10న ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో శుక్రవారం వర్మ పోలీసుల ముందుకు రానున్నారు.

జగన్ 0.0లో ఉన్నాడు: మంత్రి డోలా

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జగన్ మానసిక స్థితి బాగోలేదని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి వ్యాఖ్యానించారు. గురువారం అమరావతి సచివాలయంలోని తన చాంబర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. 'జగన్ అహంకారం వల్లే వైసీపీకి 11 సీట్లు ఇచ్చారు. జగన్ 2.0 అంటున్నాడు. కానీ ఇప్పుడు జగన్ 0.0లో ఉన్నాడు. జనం జగన్‌ని బంగాళాఖాతంలో కలిపేశారు. మళ్లీ జగన్ గెలుస్తాడనే నమ్మకం లేక ఆపార్టీ నేతలు వైసీపీని వదిలి వెళ్లిపోతున్నారు. మేం గేట్లు తెరిస్తే... ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూటమిలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారు' అని డోలా అన్నారు.

జగన్‌కి బుర్ర పోయింది: పంచుమర్తి

అధికారం పోయిందనే ఫ్రస్టేషన్‌లో వైఎస్ జగన్‌కి బుర్ర పోయిందని శాసన మండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ ఎద్దేవా చేశారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ ఐదేళ్ల పాలనలో నాశనమైన వ్యవస్థల్ని సీఎం చంద్రబాబు గాడిలో పెడుతుంటే.. జగన్ ఓర్వలేక ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాడు. అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించాలనే కుతంత్రాన్ని జగన్ ఇకనైనా మానుకోవాలి' అని పంచుమర్తి హెచ్చరించారు.

ఏడు నెలలకే విష ప్రచారమేంది జగన్?: రెడ్డప్పగారి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలలకే చంద్రబాబు పాలనపై వైఎస్ జగన్ విష ప్రచారం చేయడం ఏంటని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి మండిపడ్డారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డిని చూస్తే జాలేస్తోంది. అధికారం కోల్పోయి ఏం చేయాలో పాలుపోక ప్రజల కోసం పని చేస్తున్న కూటమి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాడు' అని ధ్వజమెత్తారు.

జగన్ 2.0తో కుటుంబ సభ్యులకే సమస్య

» విజయమ్మ, షర్మిల, భారతి జాగ్రత్తగా ఉండాలి: కిరణ్ రాయల్

తిరుపతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 'జగన్ 1.0లో బాబాయిని వేసేశారు. ఇప్పుడు జగన్ 2.0తో స్పీడ్‌గా వస్తారంట. ఆయన ఇలా రావడం వల్ల సమస్య వారి కుటుంబ సభ్యులకే. అందుకే విజయమ్మ, షర్మిలమ్మ, భారతమ్మ జాగ్రత్తగా ఉండాలి. ఆయన ఏ స్పీడ్‌లో, ఎలా వస్తారో తెలియదు. ఏమి వాడుకుంటారో తెలియదు. అందుకే పడుకునేటప్పుడు హెల్మెట్లు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు వేసుకోండి' అని జనసేన నేత కిరణ్ రాయల్ వ్యాఖ్యానించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన జగన్ 2.0 పోస్టర్లను విడుదల చేసి మీడియాతో మాట్లాడారు.

భ్రమల బాధితుడు జగన్: మంత్రి సత్యకుమార్

అమరావతి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): "మాజీ సీఎం జగన్‌రెడ్డి మరే ఇతర రాజకీయ నాయకుడికీ సాధ్యం కాని 'విధ్వంసానికి బ్రాండ్ అంబాసిడర్' అనే ఘనతను సంపాదించారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా పూర్తిగా నాశనం చేశారు' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అధికారాన్ని కోల్పోవడంతో పార్టీని వీడుతున్న నాయకుల్ని, కార్యకర్తల్ని నిలబెట్టుకోవడానికి మళ్లీ అధికారంలోకి వస్తాననే భ్రమలు కల్పించడానికి విఫల ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన తిరిగి అధికారంలోకి వస్తాననే కలలు కంటున్న భ్రమల బాధితుడు జగన్ అని ఎద్దేవా చేశారు.

నూజివీడు- వట్లూరు- ఏలూరు మధ్య నాన్ ఇంటర్ లాకింగ్ పనులు

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నూజివీడు-వట్లూరు-ఏలూరు మధ్య ఆటోమేటిక్ సెక్షన్‌ను ఏర్పాటు చేయడానికి నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా ఈనెల 8న పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్నింటిని దారిమళ్లించనున్నారు. ఈ మేరకు డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ ఎం.మండ్రుప్‌కర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

దస్తగిరి ఫిర్యాదుపై విచారణ ప్రారంభం

కడప, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వివేకా హత్యకేసులో అప్పటి సీబీఐ విచారణాధికారి రాంసింగ్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పాలంటూ తనను డాక్టర్ దేవిరెడ్డి చైతన్యరెడ్డి, అప్పటి జైలు సూపరింటెండెంట్, ఎర్రగుంట్ల సీఐ, జమ్మలమడుగు డీఎస్పీ బెదిరించారంటూ చేసిన ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దీంతో దస్తగిరి ఆరోపణలపై విచారణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్‌ను విచారణ అధికారిగా నియమిస్తూ జైళ్ల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కడప సెంట్రల్ జైలులో శుక్రవారం, శనివారం విచారించనున్నారు. తొలుత దస్తగిరి నుంచి వివరాలు సేకరించనున్నారు. శనివారం జైళ్ల శాఖ సూపరింటెండెంట్ ప్రకాశ్, వివేకా హత్య కేసు నిందితుడు దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డిలను విచారించనున్నారు. ఈ మేరకు వారికి నోటీసులు ఇచ్చారు.

'జగన్ 2.0'.. చాన్సే లేదు!

» ఆయనను ఒక్కసారే భరించలేకపోయారు

» నాటి పరిస్థితులను జనం మరిచిపోలేరు

» ఢిల్లీ వేదికగా విరుచుకు పడ్డ మంత్రి లోకేశ్

» కేంద్రమంత్రులతో వరుస భేటీలు...

» అదే సమయంలో జగన్‌కు కౌంటర్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు, రాష్ట్రం కోసం విన్నపాలు... మరోవైపు ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ వ్యాఖ్యలకు అక్కడికక్కడే కౌంటర్‌లు! ఇదీ... టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్ ఢిల్లీ పర్యటన జరిగిన తీరు! ఆయన మంగళవారం, బుధవారం వరుసగా ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కూటమి సర్కారు వినూత్నంగా తీసుకొచ్చిన 'వాట్సాప్ గవర్నెన్స్'తో డేటా చౌర్యం జరుగుతుందంటూ జగన్ పత్రిక చేసిన ప్రచారంపై విరుచుకుపడ్డారు. డేటా చౌర్యాన్ని నిరూపిస్తే రూ.10 కోట్లు స్వయంగా తానే కానుకగా ఇస్తానని సవాల్ విసిరారు. ఇక... 'జగన్ 2.0... మళ్లీ అధికారంలోకి వస్తాం.. 30 ఏళ్లు నేనే సీఎం' అని బుధవారం జగన్ చేసిన ప్రకటనపై లోకేశ్ తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. "జగన్ 1.0నే జనం భరించలేకపోయారు. ఇక ఆయన రెండోసారి అధికారంలోకి వచ్చే అవకాశం ఎక్కడుంది? ఆయన హయాంలో మైనారిటీలు, దళితులు, బలహీనవర్గాలు హింసకు గురయ్యారు. అప్పుడు ప్రజలకు స్వేచ్ఛ ఎక్కడ ఉండేది? నాటి పరిస్థితులను ఎప్పటికీ మరిచిపోలేరు" అని లోకేశ్ పేర్కొన్నారు. జగన్ హయాంలో అక్రమ మద్యం అమ్మకాలు, భూకుంభకోణాలు, అవినీతి కార్యకలాపాలు అనేకం జరిగాయని... వాటిపై చట్టాన్ని అనుసరించి చర్యలు తీసుకుని తీరుతామని లోకేశ్ తెలిపారు. తన రెడ్‌బుక్‌లో ఎన్ని అధ్యాయాలు అమలయ్యాయన్నదీ రహస్యంగా ఉంచుతామని తెలిపారు.

అవన్నీ మరిచిపోయారా?

ఇప్పుడు జగన్ నుంచి పెద్దిరెడ్డి వరకూ స్వేచ్ఛగా తిరుగుతున్నారని... జగన్‌కు జెడ్ ప్లస్ బుల్లెట్ ప్రూఫ్ భద్రతతోపాటు ఎస్కార్ట్‌లు, రోప్‌పార్టీలు ఇస్తున్నామని లోకేశ్ గుర్తు చేశారు. గతంలో జగన్ ఏం చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలని ఆయన అన్నారు. చంద్రబాబు ఆత్మకూరుకు బయలుదేరితే గేటుకు తాళం వేశారని, తనపై 23 కేసులు... నేతలు, కార్యకర్తలపై వందలాది కేసులు పెట్టారని చెప్పారు. 'అవన్నీ మరిచిపోయారా? అన్నింటిపై చర్యలుంటాయి' అని స్పష్టం చేశారు. దావోస్‌కు వెళ్లి దారి ఖర్చులు వృథా చేశామని జగన్ అనడంపై లోకేశ్ మండిపడ్డారు. జగన్ గత ఐదేళ్ల పాలనలో ఎన్ని ప్రాజెక్టులు తీసుకొచ్చారో? ఈ 8 నెలలలో తాము ఎన్ని తీసుకొచ్చామో? బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. రాబోయే 12 నెలలలో ఎలాంటి పెట్టుబడులు రాబోతున్నాయో మీరే చూస్తారని ఆయన చెప్పారు. జగన్ హయాంలో 13 లక్షల మంది విద్యార్థులు ఎలా తగ్గిపోయారో బొత్స సత్యనారాయణ జవాబివ్వాలని డిమాండ్ చేశారు.

ఫీడ్ బ్యాక్ కోసమే పీకేతో భేటీ

ఫీడ్‌బ్యాక్ తీసుకునేందుకే ప్రశాంత్ కిశోర్‌తో చర్చలు జరిపానని, తాను అందరు వ్యూహకర్తలతో కలుస్తూనే ఉంటానని లోకేశ్ చెప్పారు. తమ 8 నెలల పాలనపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నానని, భవిష్యత్తులో కూడా తీసుకుంటానని చెప్పారు. తెలంగాణలో తాము పార్టీని బలోపేతం చేస్తామని, త్వరలో కమిటీలను, రాష్ట్ర అధ్యక్షుడిని నియమిస్తామని ఆయన చెప్పారు. పార్టీలో పదవులపైనా లోకేశ్ స్పందించారు. తాను, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా ఇప్పటికే మూడుసార్లు బాధ్యతలు చేపట్టామని... వచ్చేసారైనా తమకు పార్టీ పదవులకు సంబంధించి ప్రమోషనో, డిమోషనో ఇవ్వాలని వ్యాఖ్యానించారు.

నాయకుడికి క్యారెక్టర్, క్రెడిబిలిటీ ఉండాలి

» ప్రలోభాలకో.. భయపడో కాంప్రమైజ్ అయితే మన గౌరవం ఏంటి?

» సాయిరెడ్డికైనా.. ఎవరికైనా ఇదే వర్తిస్తుంది: జగన్



అమరావతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుడికి క్యారెక్టర్, క్రెడిబిలిటీ ఉండాలని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. వైసీపీని వీడిన విజయసాయిరెడ్డికి కూడా ఇది వర్తిస్తుందని తెలిపారు. గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో తన అనుకూల మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి వైసీపీని వీడడంపై అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. 'వైసీపీకి 11 మంది రాజ్యసభ సభ్యులు.. వీరిలో పోయినోళ్లు ముగ్గురు. సాయిరెడ్డితో కలిపితే నలుగురు. రాజకీయాల్లో ఉన్నప్పుడు క్యారెక్టర్ ముఖ్యం. క్రెడిబిలిటీ అనే పదానికి అర్థం తెలియాలి. రాజకీయాల్లో ఉన్నప్పుడు.. ఫలానా వాడు నాయకుడని కాలర్ ఎగరేసుకుని చెప్పుకోవాలి. అది సీఎం అయినా.. ఎంపీ అయినా.. ఎమ్మెల్యే అయినా సరే.. ఎవరి గురించైనా గొప్పగా చెప్పుకోవాలి. కానీ మనమంతట మనమే ప్రలోభాలకు లొంగో.. భయపడో.. ఏదో కారణం చేత మన వ్యక్తిత్వాన్ని.. క్రెడిబిలిటీని పణంగా పెట్టి.. కాంప్రమైజ్ అయి అటువైపు పోతే మన గౌరవం ఏంది.. మన వాల్యూ ఏంది? మన క్యారెక్టర్ ఏంది? మన క్రెడిబిలిటీ ఏంది.. అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవాలి. కష్టం ఎల్లకాలం ఉండదు.. డెమోక్రసీ అంటేనే ఐదేళ్లు. అది సాయిరెడ్డికైనా.. పోయిన ముగ్గురు ఎంపీలకైనా.. ఒకడో అరో పోతే వారికైనా అంతే' అని జగన్ అన్నారు. మూలనున్న ముసలమ్మా బటన్ నొక్కుతుందని.. ఇందులో వింతేముందంటూ గతంలో తేలిగ్గా మాట్లాడిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో ఎందుకు బటన్ నొక్కలేదని జగన్ ప్రశ్నించారు. బటన్ నొక్కితే జేబుల్లోకి డబ్బులు రావనే ఆయన డీబీటీ కింద నిధులివ్వడం లేదని ఆరోపించారు. సంపద సృష్టి చంద్రబాబు జేబులో జరుగుతోందన్నారు. చంద్రబాబును నమ్మడమంటే చంద్రముఖిని నిద్రలేపడమేనని ఎన్నికల సమయంలో తాను చెప్పిందే నిజమైందన్నారు. అసెంబ్లీకి తానెందుకు వెళ్లడంలేదో చెప్పాల్సింది స్పీకరేనని చెప్పారు. ఈ విషయంలో హైకోర్టుకు ఆయన సమాధానం పంపలేదని.. పంపితే స్పందిస్తానని తెలిపారు. కూటమి ప్రభుత్వం 7 నెలల్లో రికార్డు స్థాయిలో అప్పులు తెచ్చిందన్నారు. తాను 2019లో సీఎంగా బాధ్యతలు స్వీకరించిన కొద్ది రోజుల్లోనే కరోనా రావడంతో రెండున్నరేళ్లు ఆదాయాలు తగ్గిపోయాయని.. ప్రజారోగ్యం, సంక్షేమ పథకాలకే ప్రాధాన్యం ఇచ్చానని.. వైసీపీ కార్యకర్తలకు, నాయకులకు ఇవ్వలేదని. ఈసారి అధికారంలోకి వస్తే వారికి అత్యంత ప్రాధాన్యం ఇస్తానని.. కార్యకర్తలను వేధిస్తున్న పోలీసులతో సెల్యూట్ కొట్టించి క్షమాపణ చెప్పిస్తానని అన్నారు.

పోలవరం ముంపుపై ఎన్‌డీఎంఏ సభ్యుల పరిశీలన


తహసీల్దార్‌ను అడిగి ముంపు వివరాలను తెలుసుకుంటున్న జాతీయ విపత్తుల నివారణ సంస్థ సభ్యులు

వేలేరుపాడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ముంపు, పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ముంపును అంచనా వేయడానికి జాతీయ విపత్తుల నివారణ సంస్థ సభ్యులు ఢిల్లీ నుంచి వచ్చారు. గురువారం ఆ సభ్యులు ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో పర్యటించారు. ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ బృందంలో సీనియర్ కన్సల్‌టెంట్ (సీఐఐ) డాక్టర్ స్వాతి సులగ్న, డిప్యూటీ డైరెక్టర్ సీఐఐ అయినపర్తి జెస్సీ ఆనంద్, మరో ఇద్దరు సభ్యులు ఉన్నారు. మండలంలోని రుద్రమ్మకోట, రేపాక గొమ్ము, తాటుకూరుగొమ్ము గ్రామాల్లో పర్యటించి 2022లో వరదలు ఎంత మేరకు వచ్చాయి? ప్రజలు ఎక్కడ రక్షణ పొందారు? తదితర అంశాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జనసేన మండల అధ్యక్షుడు ఆదినారాయణ, టీడీపీ నేతలు యాళ్ళ శంకర్, గుడిపిటి సురేష్, బీజేపీ మండల అధ్యక్షుడు నరసింహారావు పాల్గొన్నారు.

ఆకతాయిల పనా..? లేక అస్మదీయుల పనా..!

» మాజీ సీఎం జగన్ ఇంటి వద్ద తగలబడిన ఎండిన గ్రీనరీ

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ ఇంటి ఎదుట బుధవారం రాత్రి మంటలు వ్యాపించాయి. ఇంకేముంది భద్రతా లోపంతోనే ఈ ఘటన జరిగింది.. అంటూ సోషల్ మీడియాలో వార్తలు హల్‌చల్ చేశాయి. జగన్ ఇంటి ఎదుట ఉన్న కాల్వ గట్టుపై సుమారు కిలోమీటరు మేర గ్రీనరీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నిర్వహణ లేకపోవడంతో అక్కడక్కడా ఎండి పోయి నిర్జీవంగా మారింది. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వైపు నుంచి భరతమాత విగ్రహం వరకు ఐదు చోట్ల బుధవారం రాత్రి ఆ ఎండిన గ్రీనరీకి మంటలు అంటుకుని తగలబడింది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సెల్ టవర్ వద్ద కొన్ని వైర్లు తగలబడ్డాయి. కాగా ఈ రోడ్ పూర్తిగా సీసీ కెమేరాల పర్యవేక్షణలో ఉంది. భద్రతా అధికారులు విచారణ చేస్తే మంటలు ఎలా వ్యాపించాయి? ఇది ఆకతాయిల పనా? లేక అస్మదీయుల పనా! అనేది తేలిపోతుంది.

జగన్‌ను మానసిక వైద్యులకు చూపించండి: బుద్దా



విజయవాడ(వన్‌టౌన్), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి మానసిక వైద్యుల వద్ద పరీక్షలు చేయించాలని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న సూచించారు. తన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ పాలనను అంగీకరించకనే ప్రజలు ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేసి, ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా మూలన కూర్చోబెట్టారన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకుని సంతోషంగా ఉన్నారన్నారు. ఏడాది కూడా కాకుండానే తనకే ప్రజలు అధికారం కట్టబెడతారని, మరో 30 సంవత్సరాలు సీఎంగా ఉంటాననే భ్రమలుపోతున్నాడని ఎద్దేవా చేశారు. జగన్ మాటలకు వైసీపీలోని నాయకులే విస్తుపోతున్నారన్నారు. జగన్ హయాంలో రాష్ట్రంలో ఎక్కడ పట్టినా కబ్జాలేనన్నారు. దమ్ముంటే జగన్ అసెంబ్లీకి వెళ్లి ప్రజల పక్షాన మాట్లాడాలన్నారు. జగన్ 2.0కు 2029 ఎన్నికల్లో ఇప్పుడు వచ్చిన 11 సీట్లు కూడా రావని బుద్దా తేల్చిచెప్పారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.